జనవరి 2026

237

సంపుటి : 21 సంచిక : 8

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి: ప్రచారాలు - వాస్తవాలు

సోషలిస్టు పరివర్తనకోసం తహతహలాడుతున్న ప్రపంచం

పోర్చుగీసు వారి రాక

పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రేమ

దైవ స్వరూపుడైన మోడీ గారు

పెరుగుతున్న నియంతృత్వ ధోరణులు

అమెరికా ఆర్థికాధిపత్యానికి అంతిమ ఘడియలు?

భారతీయ పాఠశాలల్లో లోపించిందేమిటి?

ఒక దళిత యోధుని సమరగాథ

స్ఫూర్తి

# ఒక దళిత యోధుని సమరగాథ



రచయిత విజయవాడలోని జాషువా సాంస్కృతిక వేదిక నాయకుడు

**గుండు నారాయణ రావు**

**భా**రత దేశంలో దారుణమైన కుల పీడనకు వ్యతిరేకంగా, మనిషిని మనిషి తాకడమే అపవిత్రంగా పరిగణించే అనాగరికమైన అస్పృశ్యతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి. అటువంటి పోరాటాలకు ఆద్యులైన వారిలో ఒక దళిత యోధుని కథ ఇది:

అది 1881 సంవత్సరం నాటి కథ. ఆరోజుల్లో ఒక చేరుమాన్ ధర 6 నుంచి 9 రూపాయలు. చేరుమాన్ అంటే తక్కువ కులానికి చెందిన అస్పృశ్యుడు అని. అంటే ఎవరైనా చేరుమాన్‌ని కొనుక్కోవచ్చు లేదా అమ్ముకోవచ్చు, అద్దెకు తెచ్చుకోవచ్చు కాదంటే దానం చేయ వచ్చు. ఆరోజుల్లో ఆడపిల్ల అత్తారింటికి వెళ్తుంటే కట్నంగా ఇచ్చి పంపే జీవం లేని వస్తువుల మధ్య చేరుమాన్ కూడా వుండేవాడు. గుళ్ళకు, గోపురాలకు చేరుమాన్‌ను బహుమతిగా ఇచ్చేసే 'దానకర్ణులు' వుండేవారు.

సమాజంలో ఇటువంటి దురన్యాయం రాజ్యమేలుతున్న రోజుల్లో అస్పృశ్య కుటుంబంలో పుట్టాడు అయ్యంకాళి. నిరక్షరాస్యుడైన అయ్యం కాళి తన జాతి ప్రజల జీవితాలలో మార్పు తెచ్చేందుకు వారి పోరాటాలకు నాయకత్వం వహించాడు. అంటరాని ప్రజల చీకటి బ్రతుకు ల్లో వెలుగులు నింపేందుకు తన జీవితాన్నే ఉద్యమంగా మలుచుకున్నాడు.

కేరళ రాష్ట్రంలో తిరువనంతపురానికి ఉత్తరాన 13 కిలోమీటర్ల దూరంలో వెంగనూరు అనే పల్లె ఒకటి వుంది. ఆ ఊరిలో అయ్యన్, మాల దంపతులకు పుట్టాడు కాళి. 1863 ఆగష్టు 28 నాటి మాట. ట్రావెన్‌కూర్ సంస్థానంలో వెంగళూరు వుండేది. పులయా కులానికి చెందిన అయ్యన్ కుటుంబంలోని ఏడుగురి సంతానంలో కాళి ఒకడు. ఆ తరువాత అతనే అయ్యంకాళి అయ్యాడు.

అయ్యంకాళి పొడుగ్గా కండలు తిరిగిన యువకునిగా ఎదిగాడు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం వల్ల ఆ ప్రాంతాలకు ఆయన సుపరిచితుడయ్యాడు. కోడెకారు వయసులో అయ్యంకాళి తన తోటివారితో ఫుట్‌బాల్ ఆడేవాడు. ఫుట్‌బాల్ ఆడుతుండగా ఆయన తన్నిన బంతి ఒక నాయర్ ఇంటి కప్పు మీద పడింది. ఆ నాయర్ అయ్యాంకాళిని అగ్రకుల పిల్లలతో నువ్వెప్పుడూ ఆడకూడదు అని హెచ్చరించాడు. అది ప్రారంభం.

అయ్యంకాళి తండ్రి ఒక భూస్వామి వద్ద పని చేసేవాడు. ఆ భూస్వామి అయ్యంకాళి తండ్రితో అడవులను నరికించి సేద్యపు భూములుగా మార్చాడు. దయగల భూస్వామి చదును చేసిన ఆభూమిలో కొంత భాగాన్ని అయ్యంకాళి తండ్రికి ఇచ్చాడు. అది అప్పుడు ఒక పెద్ద సంచలనం. ఒక పులయకు కొద్దిపాటి భూమి ఉండటం కూడా భూస్వాములకు



అశాంతిని కలిగించేది. వయసులో వున్న అయ్యంకాళి తన తోటివారితో కలసి హరిశ్చంద్ర లాంటి నాటకాలు ఆడేవారు. అప్పుడప్పుడు సొంతంగా నాటకాలు తయారు చేసి ఆడే వాడు. సహజంగానే ఇవి అంటరాని వారిని మేల్కొలిపేవిగా వుండేవి. అంటరాని వారిపై జరుగుతున్న దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తుం డేవి. ఒక సామాజిక నిరసనగా వుండేవి. కొచ్చి, మలబార్ ప్రాంతాలలో అంటరాని వాళ్లలో ఇవి చైతన్యం నింపేవి.

అతడు రెండు తెల్లని ఎడ్లను కొన్నాడు. వాటి మెడలో రెండు పెద్ద పెద్ద గంటలు కట్టాడు. శుభ్రంగా ధోవతి ధరించాడు. భుజం మీద తువాలు వుండేది. నెత్తిన రుమాలు, మార్కెట్లో గంటల సవ్వడి బండితో బోర విరుచుకొని వెళ్ళే ఈ పులయ యువకుడి వైపు అగ్రవర్ణాలు భయం భయంగా చూసేవారు. పని చూసుకొని తిరిగి ఇంటికి వెళ్ళేటప్పుడు అగ్రకుల యువకులు దర్పంతో మల్‌మల్ ధోవతి కట్టావేంటి అని అడిగేవారు. దానికి ఆయన, పొడవాటి బాకు తీసి ఖంగున మోగే గొంతుతో నాకు ఎవడైనా అడ్డు వస్తే ఈ పిడిబాకు మజా రుచి చూపిస్తా అనేవాడు. అది అతని ధిక్కారం. అయ్యంకాళి ఎడ్లబండిపై తిరిగినా ఎవరూ అసలు ప్రశ్నించేవారు కాదు. అతనిలా ఇతరులు మాత్రం ఆ వీధుల్లో నడవటానికి వీలు లేదు. అప్పుడే అయ్యంకాళి స్వేచ్ఛ కోసం నడక అనే ఉద్యమం ప్రారంభిం చాడు. బలరాంపురంలోని చెలియార్ బజారుకు దళితుల బృందం చేరుకునేసరికి అగ్రవర్ణాల గుంపు వారిని నడవకుండా నిరోధించింది. ఇకనేం కొట్లాట. ఇరువర్గాల రక్తం చిమ్మింది. ఆ రకంగా అది మొదటి దళితుల సాయుధ తిరుగుబాటు ఉద్యమం అయ్యింది.

**చదువు కోసం పోరాటం**

అయ్యంకాళి పిల్లాడిగా వున్నప్పుడు దళితులకు బడిలోకి ప్రవేశం లేదు. కనీసం తన తరువాత తరమైనా చదువు నేర్చుకోవాలని అతనికి వుండేది. 1904 ప్రాంతంలో దళితులను సర్కారీ బడిలోకి రానివ్వనందు వలన సొంత పాఠశాలలు నెలకొల్పే ప్రయత్నం చేశారు. ఈ స్కూళ్లల్లో కనీసం నల్లబల్లలు కూడా వుండేవి కావు. ఇసుకే వారికి బ్లాక్ బోర్డు. వాళ్ళ వేళ్ళే వాళ్ళకు పెన్సిళ్లు. ఈ విధం గా దళితులు బహిరంగంగానే చదువు కుంటూ అగ్రవర్ణ పెత్తందార్ల నియమాలను ధిక్కరిం చారు. అన్నింటికన్నా ముందు వెంగనూరులో బడి ఏర్పాటు అయ్యింది. కానీ దాన్ని అగ్రకుల పెత్తందార్లు ధ్వంసం చేశారు. కదులుతున్న తమ పునాదులను కాపాడుకో వడానికి అగ్రవర్ణ పెత్తందార్లు దళితుల మీద భౌతికదాడులకు దిగేవారు. రక్షించుకోవడానికి దళితులు కూడా చిన్న చిన్న పోరాట బృందాలుగా ఏర్పడేవారు.

**రాజదర్శనం**

అప్పటికాలంలో మహారాజు అంటే కనిపించే దేవుడు. కనుక ఆయనను దళితులు చూడకూడదు. ఈ పరిస్థితి మారాలని అయ్యం కాళి నిర్ణయించారు. మహారాజావారి దర్శనానికి దొరికే దారులు తెరచి లేవు. ఇంకేంచేయాలి. అప్పుడు ఒక ఉపాయం

*(మిగతా 34వ పేజీలో)*

## ఈ సంచికలో...


1. ఒక దళిత యోధుని సమరగాథ

గుండు నారాయణరావు.........2

2. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి ప్రచారాలు - వాస్తవాలు

బివి రాఘవులు.....4

3. సోషలిస్టు పరివర్తనకోసం తహతహ లాడుతున్న ప్రపంచం

విజయ ప్రసాద్......10

4. పోర్చుగీసు వారి రాక

ఎంవిఎస్ శర్మ.....15

5. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రేమ

క్రిస్టెన్ ఘోడ్సీ.....18

6. దైవ స్వరూపుడైన మోడీ గారు

బద్రీ రైనా .........22

7. పెరుగుతున్న నియంతృత్వ ధోరణులు

ఎ కోటిరెడ్డి .......23

8. అమెరికా ఆర్థికాధిపత్యానికి అంతిమ ఘడియలు?

అమన్ చౌదరి ........25

9. భారతీయ పాఠశాలల్లో లోపించిందేమిటి?

దివ్య కన్నన్ .....29



**సంపాదకుడు :**

**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# ఉపాధికి ఉరి

**భూ**గోళంలోనే అతిపెద్ద చట్టబద్ధ ఉపాధి పథకమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ రెగా) ఉరిపిరితీయడాన్ని ప్రపంచప్రఖ్యాతి గాంచిన విద్యావేత్తలు, న్యాయవేత్తలు, పౌరసమాజ కార్యకర్తలు ఖండించారంటే ఈ పథకాన్ని రద్దు చేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్య ఎంతటి దుర్మార్గమైనదో అర్ధమవుంది. దేశంలో దాదాపు 8 కోట్ల గ్రామీణ పేదలకు కరువుకాలంలో కూడా పనికల్పిస్తున్న ఈ పథకాన్ని రద్దు చేయడమంటే ఆ ప్రజల పొట్టగొట్టడమేనని దేశంలోని ప్రతిపక్షాలు, వ్యవసాయ కార్మిక, రైతు, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. దేశవ్యాపిత ఆందోళనకు పిలుపునిచ్చాయి. రాజకీయాలకతీతంగా ప్రజాతంత్ర వాదులంతా ఎన్డీఏ ప్రభుత్వ చర్యను తీవ్రంగా తప్పుపడుతున్నారు.

స్వాతంత్ర్య భారత చరిత్రలో ఒకానొక రాజకీయ నేపథ్యంలో 2004లో వామపక్షాల చొరవతో వచ్చిన ఈ ఉపాధి పథకం గ్రామాల్లో పేదలకు 100 రోజుల పనిని రాజ్యాంగ బద్ధంగా గ్యారంటీ చేసింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు గ్రామీణ పేదలకే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థకు కూడా ఈ పథకం ఎనలేని మేలు చేసింది. మొదటిది, గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు పనుల్లేని కాలంలో గ్యారంటీ పనులు కల్పించడం ద్వారా ఆకలినుండి వారిని కాపాడింది. ఈ పథకంలో దాదాపు 40 శాతం మంది ఎస్టీ, ఎస్సీ ప్రజలున్నారంటేనే ఇది అణగారిన వర్గాల ఆశాజ్యోగా మారిందని అర్ధమవుతుంది. కరోనా సమయంలో గ్రామీణ పేదల ప్రాణాలు కాపాడ్డం, కరువు కాటకాల్లో పేదలకు అన్నం పెట్టడం ద్వారా ఇది అన్నపూర్ణ పథకంగా మారింది. రెండవది, ఇది గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములు, ధనిక రైతుల వద్ద వ్యవసాయ కార్మికుల బేరసారాల శక్తిని పెంచడం ద్వారా వారి ఆదాయాలు, కొనుగోలు శక్తి కొంతమేరకు పెంచగలిగింది. ఇది మొత్తం దేశార్ధిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపించింది.

మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చింది మొదలు ఈ పథకానికి నిధులు ఎండగట్టడం ద్వారా దాని పీకనులమడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఇప్పటికీ అది గ్రామీణ పేదలకు రూ. 8,000 కోట్ల బకాయిపడిందంటే పేదలపై దీని అక్కసు ఎంతో అర్ధమవుతుంది. చివరికి ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేసి దాని స్థానంలో వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి–జి రామ్ జి) పేరుతో ఒక కొత్తం చట్టం తెచ్చింది. పాత చట్టం అమలులో అవినీతి పెరిగిందని చెబుతూ కొత్త చట్టాన్ని కేంద్రం సమర్థించుకుంది, కానీ దాని అసలు ఉద్దేశం అది కాదని కొత్త చట్టంలో చేసిన మార్పులు చూస్తే అర్ధమవుతుంది. గతంలో 90 శాతం నిధులు సమకూర్చే బాధ్యత కేంద్రానిది, అమలు చేసే బాధ్యత ప్రధానంగా రాష్ట్రాలకు ఉండేది. కానీ ఇప్పుడు రాష్ట్రాలకు పథకం అమలుపై అధికారాలు తొలగించి కేంద్రం గుప్పెట్లో పెట్టుకుంది, రాష్ట్రాలు 40 శాతం నిధులు చేకూర్చాలని నిర్దేశించింది. అసలే నిధుల కొరతతో రాష్ట్రాలు అలమటిస్తున్నందున పథకం అటకెక్కుతుందని తెలిసే కేంద్రం ఈ ఎత్తుగడ వేసింది. రెండవది, గతంలో ఏడాదికి 100 రోజుల వరకు ఎన్నాళ్లు కావాలంటే అన్నాళ్లు గ్రామీణ పేదలకు ఉపాధికల్పించాలి. అయినా దేశ వ్యాపితంగా సగటున 50 రోజుల పని దినాలు కల్పించబడ్డాయి. కానీ, కొత్త చట్టంలో ఎన్నాళ్లు అవసరమైతే అన్నాళ్లు అనే నిబంధన తీసేసి నిదులున్నంతవరకే అన్న నిబంధన చేర్చారు. కాబట్టి నిధుల కొరత పేరుతో పథకానికి తిలోదకాలిచ్చే ప్రమాదముంది. మూడవది, పాత చట్టం ప్రకారం ఏడాది పొడుగున ఎప్పుడైనా గ్రామీణ పేదలు ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు. దాని వల్ల పనుల సీజన్లో కూలీలకు ఎక్కువ కూలీ వస్తే కూలి పనులకు పోయేవారు, కూలి తక్కువ వస్తే ఉపాధి పనులకు పోయే వారు. అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూలి రేట్ల విషయంలో దోపిడీ కొంతమేర తగ్గింది. పైగా స్త్రీ, పురుషులకు సమానవేతం ఇస్తారు గనుక పనుల సీజన్లో కూడా మహిళా కూలీలకు సమానవేతనం గిట్టేది. కానీ, కొత్త చట్టంలో వ్యవసాయపనుల సీజన్లో ఈ పథకం అమలును నిషేధించారు. దాంతో ఆ కాలంలో పనుల లభ్యత ఉండదు కాబట్టి వ్యవసాయ కార్మికులు భూస్వాములు ఎంత కూలి ఇస్తే అంత కూలికి వెళ్లాల్సిన అగత్యం ఏర్పడుతుంది. మహిళలకు తక్కువ వేతనం ముడుతుంది.

అందువల్ల, ఏ విధంగా చూసినా గ్రామీణ ఉపధికి ఉరి వేసేందుకే బిజెపి–ఎన్డీఏ ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టం తెచ్చిందని అర్ధమవుతుంది. ఇంతటి ప్రజావ్యతిరేక చట్టం గనుకనే దాన్ని ఎక్కడా చర్చకు కూడా పెట్టకుండా పార్లమెంటులో నిరంకుశంగా నెగ్గించుకున్నది. బిజెపితో పాటు చట్టాన్ని సమర్థించిన తెలుగు దేశం తదితర ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు కూడా దీనికి బాధ్యవహించాల్సి ఉంటుంది. ఈ నిరంకుశ, పేదల వ్యతిరేక చట్టాన్ని తుదకంటా తిప్పికొట్టాలి. దీనికోసం ప్రతిపక్షాలు, సకల ప్రజాసంఘాలు చేస్తున్న ఉద్యమాల్లో దేశభక్తియుత ప్రజలంతా పాల్గొనాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి ప్రచారాలు - వాస్తవాలు

బివి రాఘవులు



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

(భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేతల్లో ఒకరైన మాకినేని బసవపున్నయ్య 111వ జయంతి సందర్భంగా విజయవాడలో గత నెల జరిగిన సభలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు చేసిన స్మారకోపన్యాసం సంగ్రహ పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం....సంపాదకుడు)

**2014** అనంతరం ఆంధ్ర రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలను చర్చించడానికి నేపథ్యంగా ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన పారిశ్రామికాభివృద్ధి ముఖ్య లక్షణాలను, ప్రత్యేకతలను మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

**రాష్ట్ర అవతరణకు ముందు కాలం**

రాష్ట్ర అవతరణకు ముందు సాగిన వలస పాలన కాలంలో తీవ్ర ప్రాంతీయ అసమానతలు నెలకొన్నాయి. మచిలీపట్నం, విశాఖపట్నాలలో నౌకా రవాణా మౌలిక సౌకర్యాలు, వ్యవసాయానికి అనువైన సారవంతమైన నేల, సాగు నీటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున కోస్తాంధ్ర ప్రాంతాలు లబ్ధి పొందాయి. ఈ పరిస్థితులు బడా రైతులు, వ్యాపారవేత్తలతో కూడిన వాణిజ్య పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భావానికి దారి తీసాయి. మిగులు పెట్టుబడిని వ్యవసాయ, వ్యవసాయానుబంధ రంగాలలోనూ, విద్యారంగంలోనూ మదుపు చేయడం పట్టణీకరణ పెరుగుదలకు దోహదం చేసింది. రాయలసీమ ప్రాంతం ఇందుకు పూర్తిగా భిన్నంగా అర్థఫ్యూడల్ భూస్వామ్యంలో చిక్కుకు పోయింది. వరుస కరువులు, సాగునీటి సౌకర్యాల లేమి, అరకొర రవాణా సౌకర్యాల వల్ల పెట్టుబడి సంచయం నామ మాత్రం కావడంతో మొరటు వ్యవసాయ ఆధిపత్యం నెలకొన్నది. తదనంతర కాలంలో పారిశ్రామిక పెట్టుబడి కూడా ఈ అసమాన పునాదిగానే రూపుదిద్దు కున్నది. ఆంధ్ర రాష్ట్రం లో వాణిజ్య పెట్టుబడి, మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి రాగా రాయలసీమలో ఆ రెండిటి కొరత వల్ల భూస్వా మ్య అవశేషాలు మిగిలిపోయాయి.

**రాష్ట్ర ప్రాయోజిత ప్రణాళిక కాలం**

1950 నుండి 1970 మధ్యకాలంలో తొలి దశ పారిశ్రామికీకరణ ప్రధానంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపన ద్వారా జరిగింది. అయితే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అభివృద్ధి అసమానంగానే కొనసాగింది. నౌకాశ్రయం ఉన్నందున కోస్తాంధ్రలో విశాఖపట్నం ప్రధాన పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందింది. ఈ కాలంలో విశాఖ పట్నం పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డ్ (1952) బి.హెచ్.పి.వి (1962) తదనంతరం మచిలీపట్నంలో బి.ఇ.ఎల్, కొండపల్లిలో ఎ.పి. హెచ్.ఎం.టి.ఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పారు. 1950లలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్, హిందూస్తాన్ జింక్, హెచ్.వి.సి.ఎల్ (కోల్‌టెక్స్) వంటి భారీ పరిశ్రమలు నెలకొల్పారు. 1970లలో వీటిని జాతీయం చేశారు. తద్వారా పారిశ్రామిక పునాదిని పటిష్ట పరిచారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, తూర్పు, పశ్చిమగోదావరి, విజయనగరం వంటి జిల్లాల్లో పొగాకు, టెక్స్‌టైల్స్, బియ్యం, జనపనార, పంచదార వంటి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు వెలిశాయి. కృష్ణా, గోదావరి డెల్టాలలో పంచదార, జనపనార, సముద్రపు ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమలు బాగా విస్తరించాయి. ఈ దశలో రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి చాలా ఈడికగా కొనసా గింది. నీటి కొరత, రవాణా అనుసంధానం అరకొరగా ఉండడం, పరిమిత పట్టణీకరణల వల్ల ఈ ప్రాంత పారిశ్రామికీకరణ ప్రధానంగా వ్యవసాయాధారిత చిన్న తరహా పరిశ్రమలకే పరిమితం అయింది. అనంతపురం, కర్నూల్, కడప ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో జిన్నింగ్, ఆయిల్ మిల్లులు ఇతరత్రా చిన్న పరిశ్రమలు నెలకొన్నాయి.

**సరళీకరణ ముందు నాటి కాలం**

1980-90లలో ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ చాలా వైవిధ్యభరితంగా సాగింది. ప్రాంతీయ అసమానతలు ఉన్నప్పటికీ, కొండకచో, ఇవి మరింత తీవ్రమైనప్పటికీ ప్రైవేటు పెట్టుబడి పెరిగింది. ఆంధ్ర ప్రాంతం లో 1970లో అనుమతులు ఇచ్చిన విశాఖపట్టణం ఉక్కు కర్మాగారం 1991 నాటికి నిర్మాణం పూర్తి చేసుకొని ఉత్పత్తి ప్రారంభించింది. విశాఖపట్నం, విజయవాడ చుట్టుప్రక్కల ప్రాంతాలలో మందుల (ఫార్మా) పరిశ్రమలు విస్తరించాయి. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఎగుమతి ఆధారిత రొయ్యల సాగు, ఫుడ్‌ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు వేగంగా విస్తరించాయి. గుంటూరు, విజయవాడ, కాకినాడ, ఒంగోలు ప్రాంతాల్లో ఎ.పి.ఐ.ఐ ద్వారా ఇండస్ట్రియల్ ఎస్టేట్లు నెలకొల్పడం ద్వారా ప్రాంతీయ పారిశ్రామిక పునాది బలోపేతం చేశారు.

రాయలసీమలో పారిశ్రామికీకరణ పరిమితంగానూ, అసమానంగానూ సాగింది. అనంతపూర్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ నెలకొల్పారు. సున్నపురాయి నిల్వల వల్ల కడప జిల్లా సిమెంటు ఉత్పత్తి పరిశ్రమలకు కేంద్రంగా మారింది. ముద్దనూరులో రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ నెలకొల్పారు. కానీ మౌలిక సౌకర్యాల కొరత, వరుస కరువుల వల్ల ఇక్కడ పారిశ్రామికాభివృద్ధికి తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి.

ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపన కేంద్రంగా సాగిన ఈ పారిశ్రామికీకరణలో అంతర్గతంగా ప్రాంతీయ పక్షపాతాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ పెట్టుబడులు అధికధికంగా విశాఖపట్నంలోనూ, ఒక మోస్తరుగా కాకినాడ, విజయవాడ ప్రాంతాలలోనూ పెట్టారు. పెట్టుబడికి కావలసిన మౌలిక సదుపాయాలు, లేబరు ఈ ప్రాంతాలలో అందుబాటులో ఉండడంతో పాటు ఆధిపత్య కులాలు, వర్గాల రాజకీయ పలుకుబడి కూడా ఇందుకు దోహదం చేసింది. అదే రాయలసీమ విషయానికి

వచ్చేసరికి ప్రభుత్వరంగ పరిశ్రమల కేటాయింపు స్వల్పమే. అవి కూడా ఖనిజ లభ్యత వల్ల నెలకొల్పిన సిమెంట్ పరిశ్రమలకే పరిమితం అయింది. పారిశ్రామికీకరణలో ఉన్న ఈ తరతమ బేధాల కారణంగా ఆంధ్ర ప్రాంతంలో కార్మిక వర్గం అభివృద్ధి చెందింది. రాయలసీమ లో అక్కడక్కడ పరిమితంగా ఏర్పడి, భూస్వామ్య శక్తులు ఆధిపత్యానికి లొంగి ఉన్నది.

వ్యవసాయరంగం ఈ రెండు ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను మరింత బలోపేతం చేసింది. డెల్టా జిల్లాలలో సాగునీటి పారుదల కాల్వల సౌకర్యం ఉండడంతో ఇక్కడ వాణిజ్య పంటల సాగు పెద్ద ఎత్తున సాగింది. పర్యవసానంగా మిగులు పెట్టుబడి, విద్యాధిక పెటీ – బూర్జువావర్గం, విస్తరిస్తున్న మార్కెట్‌లు, పట్టణీకరణ, మధ్యతరగతి రైతులు మరింత పైస్థాయికి (ధనిక భూస్వాములుగా) ఎదగడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవసాయ బూర్జువావర్గం వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పి, సహకార సంఘాల్లో పెత్తనం చలాయిస్తూ క్రమేపీ స్థానిక పెట్టుబడి దారీవర్గంగా ఎదిగింది. రవాణా, నిర్మాణ, రియల్‌ఎస్టేట్ రంగాలలో పెట్టుబడులు పెట్టింది. రాయలసీమలో భూకేంద్రీకరణ, కౌలు ద్వారా మిగులు పోగవేత, కులాధిపత్యాల వల్ల పరిశ్రమలలో తిరిగి పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదు. అర్ధ – భూస్వామ్య సామాజిక సంబంధాల వల్ల పారిశ్రామిక వెనుకబాటుతనానికి లోనయ్యింది. విశాల ప్రాతిపదికన పారిశ్రామిక కార్మికవర్గ ఆవిర్భావానికి ఆటంకం ఏర్పడింది.

### సరళీకరణ దశ

1991– 2010 మధ్యకాలంలో సాగిన సరళీకరణ తొలిదశలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి ప్రధానంగా ప్రైవేట్ పెట్టుబడి, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం, భారీ మౌలిక సౌకర్యాల కల్పనల ఆధారంగా జరిగింది. ఈ క్రమంలో ప్రాంతీయ అసమానతలు మరింత తీవ్రతరం అయ్యాయి. హైదరాబాదులో ఐటీ రంగం విస్తృతంగా అభివృద్ధి కావడంతో కోస్తాజిల్లాలలో ఆ రంగానికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థల పెంపుదలకు దోహదపడింది. ఈ కాలంలోనే పోర్టుల ఆధారంగా పారిశ్రామిక కారిడార్‌ల ఏర్పాటు జరిగింది. కృష్ణపట్నంపోర్టు (2008), పిపిపి పద్ధతిన గంగవరం ఫోర్టు (2009) నెలకొల్పడంతోపాటు విశాఖ ఓడరేవును కూడా విస్తరించారు. ఎపిఐఐసి ఆధ్వర్యంలో పారిశ్రామిక కారిడార్లు నెలకొల్పడంతోపాటు కాకినాడలో సెజ్ ఏర్పాటు చేశారు. విశాఖపట్నం పరవాడ ప్రాంతంలోనూ, రణస్థలంలోనూ ఫార్మారంగం భారీ ఎత్తున విస్తరించింది. కృష్ణా జిల్లాలో టెక్స్‌టైల్స్ వస్త్రాల ఉత్పత్తితోపాటు నెల్లూరు జిల్లాలో స్పెషల్ పర్పస్ వెహికల్ స్కీమ్ కింద వస్త్ర పరిశ్రమలు నెలకొల్పారు. నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల నుండి ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్‌లతో అనుసంధానం అయ్యాయి.

> ❝ ఆంధ్రరాష్ట్రం 2014లో విభజించబడింది. అప్పటి నుండి అటు కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధానిగా బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతూ వచ్చింది. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలయిన టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి పార్టీలు అధికారం చలాయించాయి. ఈ రెండు పార్టీలు కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి రాజకీయంగా మద్దతును ఇస్తూ వచ్చాయి. ఇలా కేంద్ర బిజెపి ప్రభుత్వంతో అంటకాగినా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి అర్థవంతమైన తోడ్పాటును రాబట్టలేకపోయాయి. ❞

రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధి పాక్షికంగా, ఓ మోస్తారుగా జరిగింది. కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలలో సిమెంట్ పరిశ్రమ క్లస్టర్లు ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాలోని హిందూపూర్, పెనుగొండ ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలు అభివృద్ధి చేశారు. ప్రకాశం, కడప జిల్లాలలో గ్రానైట్ పరిశ్రమ విస్తరించింది. రహదారుల సౌకర్యాల పెంపు ముఖ్యంగా నేషనల్ హైవే – 44 విస్తరణ వల్ల రాయలసీమ ప్రాంతానికి కనెక్టివిటీ ఒక మోస్తరుగా పెరిగింది.

సరళీకరణ విధానాల వల్ల అప్పటికే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లతో అనుసంధానమై ఉన్న ప్రాంతాలు మరింతగా పారిశ్రామికాభివృద్ధికి నోచుకుని మిగిలిన ప్రాంతాలలో అభివృద్ధి పరిమితులకు లోనవడంతో అసమాన అభివృద్ధి నెలకొన్నది. ఆంధ్రప్రాంతం అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహానికి నెలవయ్యింది. విశాఖపట్నం ఫార్మా, బల్క్ డ్రగ్ తయారీ పరిశ్రమలు, డెల్టా ప్రాంత ఆక్వా సాగుదారుల ఎగుమతుల కేంద్రం కావడంతో పోర్టు ఆధారిత పారిశ్రామిక నగరంగా బలోపేతం అయింది. ఇదే కాలంలో కాంట్రాక్టు పనివిధానం పెరగడం, కార్మిక సంఘాలు బలహీనం కావడం, పోర్టు – ఫార్మా – ఇతర లాజిస్టిక్ రంగాలలో పని పరిస్థితులు దుర్భరం కావడం, పట్టణ ప్రాంతాలకు శ్రామికుల వలస పెరగడం వల్ల కార్మికవర్గ సంబంధాలలో మార్పులు చోటు చేసుకున్నాయి. రాయలసీమలో ఇందుకు భిన్నంగా సిమెంటు, గ్రానైట్ తవ్వకాలు, పునరుత్పాదక ఇంధన పరిశ్రమల క్లస్టర్‌లు వంటి పెట్టుబడిచోదక రంగాలు అభివృద్ధి చెందాయి. ఉపాధి అవకాశాలు పరిమితం కావడం, పని పరిస్థితులు ముఖ్యంగా మైనింగ్ దుర్భరం కావడం, నిలకడయిన ఉపాధి అవకాశాలు కల్పించకుండా పెద్ద ఎత్తున భూమిపై ఆధారపడ్డం వల్ల రాయలసీమ ప్రాంతం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో చివరిస్థాయికే పరిమితం అయింది.

### విభజనానంతరం కాలం

ఆంధ్రరాష్ట్రం 2014లో విభజించబడింది. అప్పటి నుండి అటు కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధానిగా బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతూ వచ్చింది. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలయిన టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి పార్టీలు అధికారం చలాయించాయి. ఈ రెండు పార్టీలు కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి రాజకీయంగా మద్దతును ఇస్తూ వచ్చాయి. ఇలా కేంద్ర బిజెపి ప్రభుత్వంతో అంటకాగినా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి అర్థవంతమైన తోడ్పాటును రాబట్టలేకపోయాయి.

అమరావతి రాజధాని ప్రాంత ప్రాజెక్టు ప్రకటన వల్ల ఆంధ్ర ప్రాంతంలో నిర్మాణరంగ పరిశ్రమ ఊపందుకున్నది. ఐదేళ్ల అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ ఊపు తగ్గిపోయింది. వైసిపి ప్రభుత్వం విశాఖను కార్య నిర్వాహక రాజధానిగా ప్రకటించడంతో పారిశ్రామిక విస్తరణకు కేంద్రంగా మారింది. ఈ కాలంలో విశాఖ, కాకినాడ ప్రాంతాల్లో ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమలు మరింత విస్తరించాయి. నెల్లూరులోని కృష్ణపట్నం, కాకినాడ, గంగవరం ప్రధాన పోర్టుల తో పాటు మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల విస్తరణ పారిశ్రామికాభివృద్ధికి ఊతం ఇచ్చే కేంద్రాలుగా మారాయి. తిరుపతి, నెల్లూరు ప్రాంతాలు ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల క్లస్టర్లుగా అభివృద్ధి చెందసాగాయి. సాంకేతికంగా చూస్తే ఇవి రాయలసీమ సరిహద్దు ప్రాంతాలు. విశాఖ – కాకినాడ పెట్రో కెమికల్ కారిడార్ ఈ కాలంలో ప్రాధాన్యత సంతరించుకున్నది.

**"రాష్ట్ర విభజన ప్రాంతీయ వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేసిందని చెప్పుకోవాలి. కోస్తా ఆంధ్ర ప్రాంతం అభివృద్ధి పరంగా మరింత బలపడింది. కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం ప్రాంతాల్లో పోర్టు ఆధార పారిశ్రామి కాభివృద్ధి వేగవంతమైంది. ఫార్మా, పెట్రో కెమికల్స్, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు విశాఖపట్నం, చెన్నై పారిశ్రామిక కారిడార్‌తో గాఢంగా పెనవేసుకుపోయాయి. ఈ అభివృద్ధి నమూనా అంతర్జాతీయ పెట్టు బడుల మీద ఎక్కువ ఆధారపడాల్సిన బలహీనతను తీవ్రతరం చేస్తుంది."**

రాయలసీమ ప్రాంతాన్ని వస్తూత్పత్తి కేంద్రంగా, ఇందన ఉత్పత్తి హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం విధానపరంగా నిర్ణయించింది. 2017లో పెనుకొండ - హిందూపూర్ ప్రాంతాల్లో నెలకొల్పిన కియా మోటార్స్ ప్లాంట్, అనంతపురం, కర్నూలు జిల్లాలలో సౌర, పవన పునరుత్పాదక ఇంధన పరిశ్రమల స్థాపనతో పాటు కర్నూలులో ప్రపంచంలోనే అతిపెద్ద మెగా సోలార్‌పార్క్ స్థాపనలతో రాయలసీమ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. సిమెంటు, సున్నపు రాయి, గ్రానైట్ వంటి సంప్రదాయ పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. వేరుశనగ, మామిడి, టమోటా పంటల ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు అంకురార్పణ జరిగింది. అయినప్పటికీ రాయలసీమ ప్రాంతం దీర్ఘకాలికంగా మౌలిక సౌకర్యాల కొరత, నీటి కొరతలతో పాటు పట్టణీకరణ మందకొడిగా సాగడంతో ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే ఇంకా వెనుకబడిన ప్రాంతంగానే మిగిలి పోయింది. అయితే దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చిన అంతరం ఒక మేరకు తగ్గింది.

రాజకీయ, ఆర్థిక దృష్టితో పరిశీలిస్తే రాష్ట్ర విభజన ప్రాంతీయ వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేసిందని చెప్పుకోవాలి. కోస్తాంధ్ర ప్రాంతం అభివృద్ధి పరంగా మరింత బలపడింది. కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం ప్రాంతాలలో పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధి వేగవంతమైంది. ఫార్మా, పెట్రో కెమికల్స్, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు విశాఖపట్నం, చెన్నై పారిశ్రామిక కారిడార్‌తో గాఢంగా పెనవేసుకుపోయాయి. ఈ అభివృద్ధి నమూనా అంతర్జాతీయ పెట్టుబడుల మీద ఎక్కువ ఆధారపడాల్సిన బలహీనతను తీవ్రతరం చేస్తుంది. ఎక్కువగా కాంట్రాక్టు లేబర్, వలస కార్మికుల మీద కేంద్రీకరించడం వల్ల సంప్రదాయ వామపక్ష కార్మిక సంఘాలు బలహీనపడ్డాయి. మిగిలిన ప్రభుత్వ రంగ పరిశ్రమలు బలమైన కార్మికోద్యమ స్థావరాలుగా మిగిలాయి. విశాఖపట్నం, రాష్ట్రంలోని అత్యంత వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్నప్పటికీ పారిశ్రామికాభివృద్ధి అంతా విశాఖ చుట్టుపక్కల ప్రాంతంలోనే కేంద్రీకృతం కావడంతో ఉత్తరాంధ్ర ప్రజానీకానికి ఒనగూడిన వాస్తవలబ్ధి చాలా పరిమితంగా ఉన్నది. దీనికి తోడు విలువైన సహజ వనరులైన భూమి, నీరు, స్వచ్ఛమైన గాలి వేగంగా క్షీణించిపోతూ అటు రైతాంగం ఇటు మత్స్యకార ప్రజానీకం జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిని పోయింది. అలాగే రాయలసీమ ప్రాంతంలో నెలకొల్పిన కియా మోటార్స్, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పరిశ్రమలు, పార్కులు పెట్టుబడి కేంద్రకంగా కొనసాగుతూ ఉండడంతో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు పెద్దగా తోడ్పడడం లేదు. ఈరోజుకీ సాగునీటి పారుదల సౌకర్యాలు ఏమాత్రం అభివృద్ధి కాకపోవడం, పట్టణ పారిశ్రామిక వ్యవస్థ బలహీనంగా ఉండడం, మౌలిక సౌకర్యాల లేమి వల్ల ఈ ప్రాంతం శ్రామికులను ఆకర్షించలేకపోతున్నది. కార్మికులు, ముఖ్యంగా దళితులు ఇతర వెనుకబడిన కులాల జనాభా పొరుగున ఉన్న బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ లేకుంటే గల్ఫ్ దేశాలకు వలస పోవడం పరిపాటిగా మారింది. రాయలసీమ ప్రాంతం శ్రామికుల ఎగుమతుల కేంద్రంగా మారింది. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం మూలంగా చోటు చేసుకునే అసమానతల ప్రతిబింబమే ఇది.

**టిడిపి, వైసిపిల రాజకీయ దావాలు**

2014-19 మధ్య తెలుగుదేశం, 2019-24 మధ్య వైసిపి పాలనలో ఆంధ్ర రాష్ట్రం సాధించిన పారిశ్రామిక, రాజకీయాభివృద్ధి గణాంకాలను బేరీజు వేయడంలో తగు జాగ్రత్తలు పాటించాలి. రెండు పార్టీలూ తమ పాలనలో అద్భుతమైన అభివృద్ధి సాధించాం అని గొప్పలు చెప్పుకోవడానికి ఎవరికి అనువుగా ఉండే గణాంకాలను వాళ్లు ప్రాతిపదికగా తీసుకుంటున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం 2014-19 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ త్వరితగతిన కోలుకొని అత్యధిక వృద్ధిరేటు సాధించింది అని సానుకూల ప్రచారం చేసుకున్నది. 13.49% రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జి.ఎస్.డి.పి) సాధించి దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి సాధించిన రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టామని చెప్పుకుంటుంది. భారీ మౌలిక సౌకర్యాల కల్పన, రాజధాని నగరాభివృద్ధికి ఉద్దేశించిన అమరావతి ప్రాజెక్టు, పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ, పెట్టుబడులకు అనువైన స్నేహపూరిత గమ్యంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రచారంలోకి తీసుకురావడం వంటి విధానాలను అనుసరించింది టిడిపి ప్రభుత్వం. పైకి ఎన్ని గొప్పలు చెప్పుకున్నా సాపేక్షంగా చూస్తే రాష్ట్ర పారిశ్రామిక పనితీరు బలహీనంగానే కొనసాగింది. రిజర్వ్‌బ్యాంకు విడుదల చేసిన గణాంకాల నివేదికలో పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రరాష్ట్రం (2019 నాటికి) 29వ స్థానంలో నిలిచింది. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని టిడిపి అర్భాటంగా ప్రచారం చేసింది. కానీ వాస్తవంగా వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అంతంత మాత్రమే. అలాగే పెట్టుబడుల వల్ల కలిగిన ఉపాధి అవకాశాలూ పరిమితంగానే ఉన్నాయి. ఇక 2019లో అధికారంలోకి వచ్చి 2024 వరకు రాష్ట్రాన్ని పరిపాలించిన వైసిపి గతంలోని టిడిపి ప్రభుత్వం కంటే చాలా మెరుగైన అభివృద్ధి సాధించామని ప్రచారం చేసుకోవడానికి వీలుగా ఎంపిక చేసిన గణాంకాల ఆధారంగా కథనాలు వెలువరించింది. తమ పార్టీ పరిపాలనలో స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి సగటున 10.32 శాతంగా కొనసాగి పారిశ్రామికంగా మంచి పని తీరు సాధించామని ప్రకటించింది. 2021-22లో పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రరాష్ట్రం మూడవ ర్యాంకు సాధించడం ఇందుకు తార్కాణం అని చెప్పుకొచ్చింది. 2019-20, 2020-21 సంవత్సరాల్లో వరుసగా రెండేళ్ల పాటు ఆంధ్రరాష్ట్రం తమ పాలనలో "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" లో మొదటి ర్యాంకులో నిలిచిందని ఉదహరించింది. అయితే ఈ ర్యాంకులు కార్పొరేట్లకు పాలనాపరమైన సౌలభ్యాన్ని సూచించేవే కానీ, ఆ ర్యాంకుల ద్వారా నాణ్యతాపరమైన, నికరమైన పారిశ్రామికాభివృద్ధి చోటు చేసుకున్నది అని చెప్పుకోవడానికి లేదు.

నిజానికి ఈ రెండు పార్టీలు తమకు అనుకూలమైన గణాంకాల ఆధారంగా తప్పుడు కథనాలు సృష్టించి ప్రచారహోరుతో ప్రజలను మభ్యపెట్టడానికి పడరానిపాట్లు పడ్డాయి. ఈ రెండు పార్టీల పాలనా కాలంలో నాణ్యమైన, నికరమైన పారిశ్రామికాభివృద్ధి జరిగి, ప్రాంతీయ అసమానతలను తగ్గాయని చెప్పుకోవడానికి గానీ, వెల్లువెత్తిన పెట్టుబడులు అన్న ప్రచారానికి తగినట్లు ఉత్పాదక శక్తి పెరగడం గానీ, ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం గానీ జరగలేదు.

**"నిజానికి ఈ రెండు పార్టీలు తమకు అనుకూలమైన గణాంకాల ఆధారంగా తప్పుడు కథనాలు సృష్టించి ప్రచారహోరుతో ప్రజలను మభ్యపెట్టడానికి పడరానిపాట్లు పడ్డాయి. ఈ రెండు పార్టీల పాలనా కాలంలో నాణ్యమైన, నికరమైన పారిశ్రామికాభివృద్ధి జరిగి, ప్రాంతీయ అసమానతలను తగ్గాయని చెప్పుకోవడానికి గానీ, వెల్లువెత్తిన పెట్టుబడులు అన్న ప్రచారానికి తగినట్లు ఉత్పాదక శక్తి పెరగడం గానీ, ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం గానీ జరగలేదు."**

ఇతర రాష్ట్రాల పారిశ్రామికాభివృద్ధి సూచికలతో పోల్చి చూస్తే ఇరు పార్టీల నాయకులు సాధించామని ఇల్లెక్కి మరి చెప్పుకుంటున్న అభివృద్ధి ఒత్తిమాటలే తప్ప పారిశ్రామికంగా గట్టిమేలు కలిగిన దాఖలాలు కనిపించడం లేదు.

**గత దశాబ్ద కాలంలో ఆంధ్ర ప్రదేశ్ పనితీరు**

గత పదేళ్ళ కాలంలో వివిధ రాష్ట్రాలు వివిధ రంగాలలో సాధించిన పనితీరుతో ఆంధ్ర రాష్ట్రాన్ని పోల్చి చూద్దాం.

1. రాష్ట్ర విభజనానంతరం ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను జాతీయస్థాయితో గానీ, దక్షిణాది రాష్ట్రాలతో గానీ పోల్చి చూస్తే నిరాశాజనకంగా ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వెల్లువలావచ్చి పడ్డాయి. కానీ ఆంధ్ర రాష్ట్రం ఈ అంతర్జాతీయ పెట్టుబడులలో దక్కించుకున్న వాటా ఒక మోస్తారుకి పరిమితం అయింది. 2004-2014 మధ్యకాలంలో మన దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 308.38 బిలియన్ డాలర్లు. అదే 2014-2025 మధ్యకాలంలో చూస్తే ఈ పెట్టుబడులు 748.38 బిలియన్ డాలర్లకు అంటే 143 శాతం వృద్ధిరేటున పెరిగాయి. ఈ పెరుగుదలతో ఆంధ్రరాష్ట్రం పనితీరును పోలిస్తే చాలా బలహీనంగా ఉన్నది. రాష్ట్రాల వారీగా వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గణాంకాలను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా విడుదల చేస్తోంది. 2019 నాటి నివేదికలను బట్టి చూస్తే ఆంధ్ర రాష్ట్రానికి వచ్చిన ఈ పెట్టుబడులు ఒక మోస్తరుగా ఉన్నాయి. 2019 అక్టోబర్ - 2024 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్రానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 1.27 బిలియన్ల డాలర్లు. ఇది జాతీయ సగటులో 0.2 నుండి 0.7 శాతంగా ఉన్నది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సాధనలో మన రాష్ట్రం 14వ స్థానంలో నిలిచింది.

2019 నుండి లెక్క తీస్తే మహారాష్ట్ర 94 బిలియన్ డాలర్లు, కర్ణాటక 63 బిలియన్ డాలర్లు, గుజరాత్ 46 బిలియన్ డాలర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సాధించాయి. కానీ దక్షిణాది రాష్ట్రాలతో పోల్చి చూస్తే వస్తూత్పత్తి రంగంలో ఆంధ్ర రాష్ట్రం సాధించిన పెట్టుబడులు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, కేరళ రాష్ట్రాల కన్నా చాలా వెనుకబడి ఉంది.

ఈ అనుభవం రీత్యా చూస్తే టిడిపి ప్రభుత్వం ఈ మధ్యకాలంలో పెట్టుబడుల సాధన పేరిట చేసిన హడావుడి, గ్రీన్ ఎనర్జీ, ఆతిథ్య తదితర రంగాలు, గూగుల్ డేటా సెంటర్ల ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చి పడనున్నాయని చేస్తున్న ప్రచారం పసలేనిది. గతంలో ఇదే ప్రభుత్వ నాయకులు పెట్టుబడుల సదస్సులు, దావోస్ పర్యటనలు, భారీ అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) గురించి ఇలానే ఊదరగొట్టుడు ప్రచారం చేశారు. తీరా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణానికి వచ్చేసరికి ఏమాత్రం పొంతనలేని పరిస్థితి ఉంది. కాబట్టి ఇప్పుడు సాగుతున్న ప్రచారం కూడా అందుకు కొనసాగింపే తప్ప మరొకటి కాదు. ఎందుకంటే అంతర్జాతీయంగా టారిఫ్‌ల పేరిట నెలకొన్న ఉద్రిక్తతలు, జాతీయస్థాయిలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితులకు తోడు రాష్ట్ర పారిశ్రామిక రంగం పనితీరు, సంస్థాగతమైన బలహీనతల వల్ల ప్రభుత్వం ప్రచారం చేస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలు వాస్తవ రూపం దాలుస్తాయా లేదా అనేది సందేహాస్పదమే.

**ఎగుమతుల సామర్థ్యం**

జాతీయంగా నెలకొని ఉన్న ధోరణులతో పోల్చి చూస్తే ఆంధ్ర రాష్ట్ర ఎగుమతుల సామర్థ్యం సాపేక్షంగా నికరంగా ఉన్నది. అయితే ఆంధ్ర రాష్ట్రం నుండి జరిగే ఎగుమతుల్లో సింహభాగం వస్తూత్పత్తియేతర సరుకులే. పారిశ్రామికాభివృద్ధి బలహీనంగా ఉండడం, వస్తూత్పత్తి రంగ పునాది పరిమితంగా ఉండడమే దీనికి కారణం.

అంతర్జాతీయంగా నెలకొని ఉన్న పరిస్థితులు కూడా ఇందుకు ఇతోధికంగా కారణమయ్యాయి. 1995-2000 సంవత్సరాలలో అంతర్జాతీయ వాణిజ్యం ఏటా సగటున 7 శాతం వృద్ధి నమోదు చేసింది. 2011-2019 మధ్యకాలంలో వృద్ధి రేటు 2.3 శాతానికి దిగజారింది. అంటే 20వ శతాబ్దం చివరి నాళ్ళు 21వ శతాబ్దం తొలినాళ్లలో ఉధృతిన సాగిన అంతర్జాతీయ వాణిజ్యం ప్రస్తుతం సంస్థాగతంగా మందగమానానికి లోనయ్యిందని స్పష్టమవుతున్నది. అంతర్జాతీయ వాణిజ్యం ఈ విధంగా నెమ్మదించినప్పటికీ 2015లో 416 బిలియన్ డాలర్లుగా ఉన్న మన దేశ ఎగుమతులు 2015-2025 మధ్య పదేళ్ళ కాలంలో సగటున సాలీన 7 శాతం వృద్ధిరేటు నమోదు చేసాయి. కానీ ఈ ఆకర్షణీయమైన వృద్ధిరేటు సంస్థాగతంగా మన దేశం ఎదుర్కొంటున్న బలహీనతలను, ముఖ్యంగా వస్తూత్పత్తి ఎగుమతులు పరిమితంగా ఉండడం, ఎక్కువలో ఎక్కువగా సేవారంగ ఎగుమతుల మీద ఆధారపడి ఉండడం సరుకుల ఉత్పత్తిలో కూడా వైవిధ్యతకు ఆస్కారం లేకపోవడం వంటి బలహీనతలను కప్పిపుచ్చ లేకపోతున్నది.

జాతీయంగా ఎగుమతుల రంగం పరిస్థితి ఇలా ఉండగా ఆంధ్ర రాష్ట్రం 2018-19, 2022-23 మధ్యకాలంలో ఎగుమతులలో 8.97 శాతం కాంపౌండ్ యాన్యువల్ వృద్ధిరేటు (సిఎజిఆర్) నమోదు చేసింది. ఇది జాతీయ సిఎజిఆర్ సగటు రేటు 8.1శాతం కన్నా స్వల్పంగా ఎక్కువ కానీ, రాష్ట్రాల వారి వృద్ధిరేటుతో చూస్తే 6వ స్థానంలో ఉంది. గత దశాబ్దపు దేశీయ వాణిజ్య ఎగుమతులలో ఆంధ్ర రాష్ట్రం వాటా 5 శాతంగా ఉన్నది. ఈ గణాంకాలను బట్టి చూస్తే ఆంధ్ర రాష్ట్రం ఎగుమతుల రంగం నిలకడగా ఉన్నదే తప్ప గుణాత్మకమైన మార్పేమీ సాధించలేదని చెప్పుకోవాలి.

> **"40,121 ఫ్యాక్టరీలతో తమిళనాడు దేశంలోనే ముందంజలో ఉన్నది. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఫ్యాక్టరీలలో ఒక్క తమిళనాడులోనే 15.4 శాతం ఫ్యాక్టరీలున్నాయి. తర్వాత స్థానాలను గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక ఆక్రమించాయి. ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాక్టరీలలో సుమారు 6 శాతం ఫ్యాక్టరీలు ఆంధ్ర లో ఉన్నాయి."**

ఆంధ్రప్రదేశ్ ఎగుమతుల ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ, సముద్ర ఆహార ఉత్పత్తులు వెన్నముకగా ఉన్నాయి. బియ్యం, రొయ్యలు, మిరప, మామిడి పండ్లు, ప్రాసెస్డ్ ఫుడ్ – ఇవే మన ఎగుమతులలో సింహ భాగంగా ఉన్నాయి. ఒక రకంగా చెప్పుకోవాలంటే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్ర రాష్ట్రం అగ్రగామిగా ఉన్నది. వీటితో పాటు ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమికల్స్ (క్యాన్సర్ మందులు వంటి) ప్రత్యేకమైన ఫార్మా ఉత్పత్తులు కూడా ఈ మధ్యకాలంలో ముఖ్యమైన ఎగుమతులుగా మారాయి. ఆటోమొబైల్ ఇంజన్లు, కార్లు విడిభాగాల ఉత్పత్తులు కూడా ఈ మధ్యకాలంలో ఎగుమతుల చిట్టాలో స్వల్పంగా చోటు చేసుకున్నాయి. కానీ ఆంధ్ర రాష్ట్రం వైవిధ్యంతో కూడిన అత్యధిక విలువలు గల వస్తూత్పత్తులకు బదులు ప్రాథమిక ఉత్పత్తులు, సెమీ ప్రాసెస్డ్ ఉత్పత్తుల ఎగుమతుల మీదనే ప్రధానంగా ఆధారపడి ఉన్న బలహీనత కొనసాగుతూ ఉన్నది.

### ఫ్యాక్టరీల సంఖ్య

40,121 ఫ్యాక్టరీలతో తమిళనాడు దేశంలోనే ముందంజలో ఉన్నది. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఫ్యాక్టరీలలో ఒక్క తమిళనాడులోనే 15.4 శాతం ఫ్యాక్టరీలున్నాయి. తర్వాత స్థానాలను గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక ఆక్రమించాయి. ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాక్టరీలలో సుమారు 6 శాతం ఫ్యాక్టరీలు ఆంధ్ర లో ఉన్నాయి.

### ఉపాధి నాణ్యత

గత దశాబ్ద కాలంలో భారతదేశంలో వస్తూత్పత్తి రంగ ఉపాధిలో క్రమానుగత వృద్ధి కానవస్తుంది. తద్వారా జాతీయస్థాయిలో పారిశ్రామిక ఉత్పత్తి, విలువ జోడింపు పెరిగాయి. కానీ ఆంధ్ర రాష్ట్రంలో వస్తూత్పత్తి రంగ ఉపాధి సాపేక్షంగా స్థంభించిపోయింది. 2022– 23 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం ఆంధ్ర రాష్ట్రంలో ఈ రంగంలో 10.5 శాతం ఉపాధి నమోదు అయింది.

2019–20 నాటికి సంఘటిత ఫ్యాక్టరీ రంగంలో 6.8 లక్షల మంది పనిచేస్తున్నారు. ఇది గణనీయమైన సంఖ్యే. ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఫార్మా తదితర అనుబంధ రంగాల్లో ఈ ఉపాధి కేంద్రీకృతమై ఉన్నది. మధ్యతరహా పరిశ్రమలు, అసంఘటిత వస్తూత్పత్తి రంగాలు అయిన బట్టలు, ఇంజనీరింగ్ సామాగ్రి, అగ్రోప్రోసెసింగ్ తదితర పరిశ్రమలు గణనీయమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వ్యవసాయేతర జీవనోపాధి కల్పించడంలో ఇవే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

అయితే వ్యవసాయం, సేవల రంగాలతో పోలిస్తే వస్తూత్పత్తి రంగ ఉపాధి సాపేక్షంగా చాలా తక్కువగా ఉన్నది. పారిశ్రామిక ఉపాధి సౌకర్యాల కల్పనలో సంస్థాగత బలహీనతలు, ఆటంకాలు కొనసాగుతూనే ఉన్నాయి. పారిశ్రామికాభివృద్ధి రేటు పెరుగుదలకు అనుగుణమైన స్థాయిలో కార్మిక శక్తి విస్తరించడం లేదు. ఈ పొంతన లేని వ్యవహారం శ్రామిక మార్కెట్లలో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నది. ఆంధ్ర రాష్ట్రంలో యువతరంలో నిరుద్యోగిత రేటు అత్యధికంగా 17.5 శాతంగా ఉన్నది. అంటే పారిశ్రామికాభివృద్ధికి నాణ్యమైన, గణనీయమైన ఉపాధి అవకాశాల కల్పనకు మధ్యన పెద్ద గండి ఉన్నదని అర్థం.

మధ్యతరహా, చిన్న పరిశ్రమలు ఉపాధి అవకాశాల కల్పనలో కీలకమైన పాత్రలు పోషిస్తాయి. స్వభావరీత్యా ఇవి వస్తూత్పత్తి ఉపాధి అవకాశాల వ్యాప్తికి పరిమితులు సృష్టిస్తాయి. ఆంధ్ర రాష్ట్రంలో 16 లక్షల రిజిస్టర్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయి. ప్రధానంగా ఇవి టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రోసెసింగ్, ఇంజనీరింగ్ సంబంధిత రంగాలలో నెలకొని ఉన్నాయి. అయితే ఇందులో 97 శాతం పరిశ్రమలు సూక్ష్మ తరహా పరిశ్రమలే. అంటే తక్కువ పెట్టుబడి, పరిమితి ఉత్పాదకత, అసంఘటిత ఉపాధి అవకాశాలతో కూడుకొన్న పరిశ్రమలు. పర్యవసానంగా స్థిరమైన వస్తూత్పత్తి ఉపాధి అవకాశాల కల్పనకు బదులు అస్థిర, అసంఘటిత, దుర్భర ఉపాధిని కల్పిస్తున్నాయి.

### అవే తప్పుడు విధానాలను అనుసరించిన రెండు ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు

ఈ మొత్తం అంశాలను పరిగణలోకి తీసుకుంటే మనం రెండు కీలకమైన నిర్ధారణలకు రావచ్చు. మొదటిది టిడిపి, వైసిపి పార్టీలు రెండూ వేగవంతమైన, నికరమైన పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి అవసరమైన మౌలిక విధానాల రూపకల్పన జోలికి పోకుండా విలువైన దశాబ్ద కాలాన్ని వృధా చేశాయి. రెండవది, ఇరు పార్టీలు పనికిమాలిన రాజకీయ అంశాలపై ఒకదాని మీదొకటి దుమ్మెత్తి పోసుకుంటూ రాష్ట్ర ప్రగతికి, పారిశ్రామికాభివృద్ధికి ఎంత మాత్రం తోడ్పడని అవే పనికిమాలిన తప్పుడు విధానాలను బీరుపోకుండా అమలు చేశాయి.

టిడిపి, వైసిపి రెండూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంతో మిలాఖత్ అయ్యి రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టాయి. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హెూదా, రాష్ట్ర పునర్విభజన చట్టం ద్వారా రాష్ట్రానికి ఒనగూడాల్సిన ప్రయోజనాలు, రాజధాని నిర్మాణానికి కేంద్రం విడుదల చేయవలసిన నిధులు, పారిశ్రామిక మౌలిక వసతుల రంగాలకు అందాల్సిన తోడ్పాటు, విద్యా, వైద్య, విశ్వవిద్యాలయాల స్థాపన...వంటి ప్రయోజనాల సాధనకు కేంద్ర ప్రభుత్వం మీద ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా మిన్నకుండిపోయాయి. దీని వల్ల రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి రెండింటా రాజీ పడిపోయినట్లయింది.

రెండు పార్టీల ప్రభుత్వాలు పెట్టుబడి-కార్పొరేట్ ఆధారిత నయా–ఉదారవాద అభివృద్ధి వ్యూహాన్ని ఎంచుకోవడం వల్ల వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రయోజనాలు పక్కకి పోయాయి. ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు కర్మాగారంతో సహా ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రయత్నాలను నికరంగా నిలువరించడానికి ఎంత మాత్రం కృషి చేయలేదు. విపరీతమైన ప్రజాధనం ఖర్చు చేసి పెద్దగా ఉపాధి అవకాశాలు కల్పించలేని భారీ మౌళిక సౌకర్యాల ప్రాజెక్టులు చేపట్టాయి. కానీ అంతిమంగా ఇవి రియల్ ఎస్టేట్స్, కార్పొరేట్ రంగాలకే లబ్ధి చేకూర్చాయి. ప్రాంతీయ, సామాజిక అసమానతలు మరింత తీవ్రతరం అయ్యాయి. విశాల ప్రాతిపదికన పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలు చేపట్టాల్సింది పోయి ఈ ప్రభుత్వాలు తలకెత్తుకున్న ప్రాజెక్టులు అసమానతలను మరింతగా పెంచాయి.

*

**"పెట్టుబడుల ఒప్పందాలు, వాటి క్షేత్రస్థాయి వాస్తవిక అమలులో భారీ అంతరాలు ప్రస్ఫుటమవుతున్నాయి. టిడిపి, వైసిపి పార్టీల పాలనలో ప్రకటించిన ప్రాజెక్టులలో అతి స్వల్ప సంఖ్యలో మాత్రమే ఆచరణలోకి వచ్చాయి. యూనిట్లు నెలకొల్పిన చోట కూడా ఉపాధి అవకాశాలు నామమాత్రంగానే ఉన్నాయి. శ్రమ ప్రాధాన్యతా పరిశ్రమలకు బదులు పెట్టుబడి ప్రాధాన్యతా పరిశ్రమలకు పెద్దపీట వేయడంతో రాష్ట్రంలో నెలకొని ఉన్న తీవ్ర నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నది."**

ప్రైవేటీకరణ, పిపిపి విధానం, ఉపాధి అవకాశాల కాంట్రాక్టీకరణ వల్ల ప్రభుత్వ రంగం క్రమేపి కృశించిపోతూ కార్మికులు, పేదలు మరింత అభద్రతకు గురవుతున్నారు. విద్యుత్, రవాణా, విద్య, వైద్య రంగాలలో ప్రభుత్వం తన బాధ్యతలను వదిలించుకోవడానికి ఎంచుకున్న పిపిపి విధానం వల్ల అత్యవసర సేవల నాణ్యత, జవాబుదారీతనం లోపించడం తోపాటు సామాన్య ప్రజానికం మీద మరిన్ని ఆర్థిక భారాలు మోపడానికి దారితీస్తుంది.

పరిశ్రమలను ప్రోత్సహించే పేరిట ప్రభుత్వాలు బలవంతపు భూసేకరణలకు పాల్పడడం ఎక్కువయ్యింది. అలాంటి కుటుంబాలకు తగిన న్యాయమైన పరిహారం చెల్లించక పోవడం, స్థిరమైన ఉద్యోగావకాశాలు కల్పించకపోవడం పరిపాటిగా మారింది. సారవంతమైన వ్యవసాయ భూములను నిర్బంధంగా లాక్కుంటున్నారు. కార్పొరేట్లకూ, రాజకీయంగా తమ పార్టీలకు ప్రయోజనం కల్పించే మద్దతుదారులకూ ఎంతో విలువైన భూములను అణాకాణికి దోచిపెట్టేసి అశ్రిత పక్షపాతం చూపిస్తూ పారదర్శకతకు పాతర వేస్తున్నారు. ఆ విధంగా అశ్రిత పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనాకు పట్టం కడుతున్నారు. ఈ రెండు పార్టీలమధ్య ఉన్న తేడా అంతా ఏ పార్టీ ఎవరికి లబ్ధి చేకూర్చింది అనేదే తప్ప ప్రభుత్వ ఆస్తులను, సహజ వనరులను అస్మదీయులకు కట్టబెట్టడంలో ఇద్దరిదీ ఒకటే బడి.

ఇంతకన్నా విషాదం ఏమిటంటే ఇప్పటికీ వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమల పేరట కట్టబెట్టిన వందలాది ఎకరాల భూములు ఇప్పటికీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రతిపాదిత పరిశ్రమలు పెట్టిందే లేదు. అలాగే ప్రభుత్వం ఆ భూములు తిరిగి స్వాధీనం చేసుకున్నదీ లేదు. పారిశ్రామిక వాడలు, సెజ్‌ల పేరిట కట్టబెట్టిన వేలాది ఎకరాల భూములు పడావుగా పడి ఉన్నాయి. భారీ ఎత్తున పారిశ్రామికాభివృద్ధి సాధించామని పాలకులు చేస్తున్న ప్రకటనలను ఇవి అపహాస్యం చేస్తున్నాయి. అనేక రాయితీలు పొంది చెప్పిన ప్రకారం పరిశ్రమలు నెలకొల్పని వారి మీద ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

రెండు పార్టీల ప్రభుత్వాలు విధానాల రూపకల్పనలో, అమలులో ఏమాత్రం పారదర్శకత లేకుండా అత్యంత అప్రజాస్వామిక పద్ధతులను అవలంబించాయి. గ్రామసభలు, పబ్లిక్ హియరింగ్‌ల నిర్వహణ నామ్‌కేవాస్తేగా మారాయి. అర్థవంతమైన చర్చలకు అవకాశం కల్పించడం లేదు. సమగ్రమైన సామాజిక–ఆర్థిక ప్రభావాల అధ్యయనం గానీ, పర్యావరణ ప్రభావాల అధ్యయనం గానీ నిర్వహించకపోవడం వల్ల కాలుష్యం పెరిగి పోవడం, రైతులు, వ్యవసాయ కార్మికుల, స్థానిక ప్రజల జీవనోపాధి దెబ్బతిని పోవడం వంటి తీవ్ర అంశాలు పరిష్కారానికి నోచుకోకుండా పోతున్నాయి. పారిశ్రామిక విధానం వెనుకబడిన ప్రాంతాలను విస్మరించడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెచ్చరిల్లాయి.

పెట్టుబడుల ఒప్పందాలు, వాటి క్షేత్రస్థాయి వాస్తవిక అమలులో భారీ అంతరాలు ప్రస్ఫుటమవుతున్నాయి. టిడిపి, వైసిపి పార్టీల పాలనలో ప్రకటించిన ప్రాజెక్టులలో అతి స్వల్ప సంఖ్యలో మాత్రమే ఆచరణలోకి వచ్చాయి. యూనిట్లు నెలకొల్పిన చోట కూడా ఉపాధి అవకాశాలు నామమాత్రంగానే ఉన్నాయి. శ్రమ ప్రాధాన్యతా పరిశ్రమలకు బదులు పెట్టుబడి ప్రాధాన్యతా పరిశ్రమలకు పెద్దపీట వేయడంతో రాష్ట్రంలో నెలకొని ఉన్న తీవ్ర నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నది. కాబట్టి ఎంఓయూలు, ఆర్భాటపు ప్రకటనలు కట్టిపెట్టి సరైన పారిశ్రామికాభివృద్ధికి నడుం కట్టాలి.

ప్రభుత్వ అప్పులు అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోవడం, నానాటికి అప్పుల మీద మరింతగా ఆధారపడ్డం, రెవిన్యూ లోటు పెరగడం, బడా పెట్టుబడిదారులకు కల్పిస్తున్న పన్ను రాయితీలు ఆర్థిక వ్యవస్థకు భారంగా మారడం వల్ల సామాజిక, భౌతిక మౌలిక సౌకర్యాల కల్పనకు నిధుల కొరత ఏర్పడుతున్నది. భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు పెంచామన్న ప్రభుత్వ పెద్దల ప్రకటనలు వాస్తవ దూరమైనవి. పెట్టుబడి ప్రాధాన్యతా పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రోత్సహిస్తున్న పారిశ్రామిక విధానాలు అసంఘటిత ఉపాధికి దారితీస్తున్నాయి. ప్రభుత్వ ప్రజా సేవా రంగాలలో కాంట్రాక్టీకరణ, అవుట్‌సోర్సింగ్ విధానం ప్రబలిపోయింది. పర్యవసానంగా యువతలో ఉద్యోగ భద్రత కరువైంది.

### కింకర్తవ్యం

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన ఆంధ్ర రాష్ట్రాన్ని నిలబెట్టాలంటే సంస్థాగత బలహీనతలు, లోటుపాట్లను అధిగమించేలా మౌలికంగానే నూతన అభివృద్ధి దిశను ఆలంబనగా చేసుకోవాలి. అన్నింటికన్నా ముందుగా సంస్థాగతంగా ఉన్న ఆటంకాలను అధిగమించేందుకు తగిన నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. బోర్డు రూముల్లో ప్రణాళికలు రూపొందించడానికి బదులు రాష్ట్రవ్యాప్తంగా ప్రజానీకంలో చర్చ పెట్టాలి. ప్రజాహితమైన, నికరమైన పారిశ్రామికాభివృద్ధి విధానాలు రూపొందించడంలో భాగస్వామ్య పక్షాలు అందరినీ కలుపుకు పోవాలి.

**అందుకు విశాల ప్రాతిపదికన ఈ క్రింది ప్రతిపాదనలు పరిగణలోనికి తీసుకోవాలి:**

1. **సమతుల పారిశ్రామికీకరణకు అనువైన మౌలిక సౌకర్యాల కల్పనను వేగవంతం చేయాలి.** ఇందులో బాగంగా రాయలసీమ ప్రాంతంలో భారీ గ్రీన్ ఫీల్డ్ పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సిటీలను అభివృద్ధి చేయడానికి అనువుగా భౌతిక, సామాజిక, మౌలిక సౌకర్యాలు, లాజిస్టిక్స్ కల్పనకు ప్రభుత్వం పూనుకోవాలి.

2. **నైపుణ్యం గల మానవ వనరుల అభివృద్ధి :-** ప్రభుత్వ విద్య, వైద్య సౌకర్యాలను బలోపేతం చేయాలి. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి.

3. **ఉపాధి కల్పనావకాశాల పెరుగుదలకు దోహదం చేసే పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలి.**

4. **ప్రాజెక్టుల కోసం భూములను, జీవనోపాధిని త్యాగం చేసిన ప్రజల ప్రయోజనాలు పరిరక్షించాలి.** పారిశ్రామికీకరణ వల్ల నష్టపోయే ప్రజలకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలి.

5. **భూస్వామ్య ముఠా సంస్కృతికి అలవాలమైన ఆధిపత్య నిర్మాణాలను ధ్వంసం చేయాలి.** రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో పారిశ్రామికాభివృద్ధికి ఆటంకంగా మారిన భూస్వామ్య, ముఠా సంస్కృతిని రూపుమాపి శ్రామికుల స్వేచ్ఛా గమనానికి అవకాశాలు పెంపొందించాలి. *

# సోషలిస్టు పరివర్తనకోసం తహతహలాడుతున్న ప్రపంచం



విజయ ప్రసాద్

రచయిత అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు, రచయిత

ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు నూతన రూపాలలో తిరిగి రంగంలోకి వచ్చారు. ప్రపంచానికి రక్షకులమని తమకు తావే కితాబులిచ్చుకుంటున్నారు. ఏ విధంగానూ సమర్ధించకూడని నయా–ఫాసిజానికి సమర్ధకులుగా మారుతున్నారు. వారి పూర్వీకులు నయా–ఉదారవాద బురదలో కూరుకుపోయి, సాంకేతిక ఆధిక్యతతో అన్నిటినీ సాధించవచ్చునన్న వాదనలను ముందుకు తెచ్చారు. వారి శత్రువులు పచ్చిమితవాద నినాదాలు ఇస్తున్నారు. తాంత్రికులు శవాన్ని తిరిగి లేపటానికి ప్రయత్నం చేసిన విధంగానే మరణించిన ఉదారవాదాన్ని తిరిగి బతికించటానికి ఈ నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు ప్రయత్నిస్తున్నారు.

నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు ఒక అంశంలో ఐక్యంగా ఉన్నారు. వీరికి తక్షణ మార్గదర్శకులుగా ఉన్నవారు ఉదారవాద విధానాల సాంప్రదాయాన్ని పొదుపు చర్యలు, (జీతభత్యాలు, సంక్షేమానికి కోతలు) రుణాల అగ్నికీలలలో దహనం చేశారు. బ్రిటన్‌లోని లేబర్ పార్టీ నుండి భారతదేశంలోని కాంగ్రెస్ పార్టీ వరకు, పశ్చిమ దేశాలలోని పాత ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు, సామ్రాజ్యవాద వలసవాద విధానానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన ప్రపంచ దేశాలలోని వివిధ కూటములు సోవియట్ యూనియన్ కూలిపోగానే అస్త్ర సన్యాసం చేసి, వారు సృష్టించుకున్న నాలుగు అంశాలకు అనుగుణంగా వ్యవహరించటం ప్రారంభించారు.

**పెట్టుబడిదారి విధాన శాశ్వతం అనే అంశం**

నయా –ఉదారవాద విధానాలు అసమానతలను విపరీతంగా పెంచుతున్నప్పటికీ, సామాజిక లక్ష్యాలను సాధించే మార్గంలో సాగనప్పటికీ ఈ విధానాలను అమలు చేయటం అనివార్యం అని ఉదారవాదులు భావించారు. కొన్ని విధాలైన సామాజిక ఆధిపత్య భావాలను (జాతి, లింగ వివక్ష భావాలు) తొలగించటం ద్వారా మనం సమాజాన్ని అభివృద్ధి చేయటానికి ప్రయత్నించాలనీ, ఏదైనా ఒక దానిని 'కొంచెం' మెరుగు చేస్తే సరిపోతుందనీ, 'ఎక్కువ'గా చేయటం పిచ్చిపని అనీ, ఎక్కువగా చేయటం వలన అది విఫలం కావటం జరుగుతుందని లేదా సోవియట్ యూనియన్‌లో వలె ఏకవ్యక్తి నియంతృత్వానికి, నిరంకుశత్వానికి దారి తీస్తుందని "ది రోడ్ టు సెర్ఫ్‌డం" (1944)లో ఫ్రెడరిక్ హయాక్ చెప్పిన అర్థంలేని హెచ్చరికలను అమలు చేశారు.

నయా–ఉదారవాదపు సంక్షేమ కోతలనూ, రుణాల ఎజెండానూ బహిరంగంగా బలపరుస్తూ, సాంకేతిక పరిజ్ఞానం తమ వద్దనే ఉన్నదని, తమకు మాత్రమే సాంకేతికాభివృద్ధిపై అవగాహన ఉన్నట్లుగా ఉదారవాదులు ప్రజలను మభ్యపెడుతున్నారు. సంక్షేమ కోతల విధానాలలోని ఇబ్బందులను ఉదారవాదులు భుజాన వేసుకొని, ఆ విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న విమర్శలను తోసిపుచ్చుతున్నారు. దాంతో పచ్చిమితవాదులు ప్రజానుకూల వాదనలు చేస్తున్నట్లు నటిస్తూ, ప్రజల ప్రతినిధులుగా ఫోజు పెట్టటానికి అవకాశం కలిగింది. నయా–ఉదారవాద విధానాలకు ఉదారవాదులు లొంగి పోవటంతో పచ్చిమితవాదులు ప్రధానశక్తిగా రంగం మీదికి రావటానికి అవకాశం వచ్చింది. కానీ ఈ పచ్చిమితవాదులు నయా – ఉదారవాద చట్రాన్ని అతిక్రమించలేదు, ఆ విధానాలనే అనుసరిస్తున్నారు. ఆర్థిక జాతీయవాదాన్ని ఎంతగా ప్రచారం చేసినప్పటికీ, పచ్చిమితవాదులకు తమదైన స్వతంత్ర ఆర్థిక ఎజెండా లేదు.

సంక్షేమ కోత, రుణాలపై ఆధారపడిన విధానాలకు పాత ఉదారవాద విధాన సమర్ధకులు లొంగిపోవటాన్ని నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు గుర్తించలేదు. సాంకేతిక అభివృద్ధి గురించి ప్రచారం చేస్తున్న ఉదారవాదులు పచ్చిమితవాదులకు ఏ విధంగా మార్గం సుగమం చేశారన్న అంశాన్ని కూడా వీరు పరిగణనలోకి తీసుకోలేదు. ఏ విధంగా పురోగమనం సాధించాలన్న విషయంలో గత ఉదారవాదులకు భిన్నమైన విధానాలు నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్ల వద్దలేవు. కాబట్టి నూతన ఉదారవాదులు, పచ్చిమితవాదుల నుండి నాగరికతను కాపాడలేరు. నయా–ఉదారవాద ఎజెండా అయిన సంక్షేమ కోతలు, రుణాలపై ఆధారపడిన యథాతథవాద విధానాలను మార్చటానికి ప్రయత్నం చేస్తారన్న విశ్వాసాన్ని కూడా నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు కల్పించటం లేదు. వీరు వామపక్ష వాగాడంబరంతో పాటు ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా కొన్ని ఉద్యమాలు మాత్రమే చేస్తారు. పెట్టుబడిదారీ విధానపు దుర్లక్షణాలకు వ్యతిరేకంగా పోరాటం చేయటంలోనూ, దానిని అధిగమించాల్సి వచ్చినప్పుడూ తీవ్రమైన ఊగిసలాటను ప్రదర్శిస్తారు. నయా–ఉదార వాద విధానాలు అసమానతలను పెంచుతున్నాయి. దానిని సరిదిద్దటానికి అవసరమైన ఆర్థిక విధానాలు వారి వద్ద లేవు. నూతన సోషల్ డెమోక్రాట్ల రాజకీయ ఎజెండా, కార్యక్రమాలను తరచి చూసినపుడు సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా, గౌరవనీయంగా బతకటానికి సంబంధించిన అంశాలు కూడా వాటిలో అరుదుగా మాత్రమే కనిపిస్తాయి. సోషల్ డెమోక్రాట్లకు నిజమైన పునాది అయిన మధ్య తరగతి. వారిని సమీకరించటానికి అవసరమైన యథాతథ పరిస్థితులను కొనసాగించే పున:పంపిణీ విధానాలను మాత్రమే అమలు చేస్తారు. అంతకు మించి ప్రపంచ ప్రజానీకంలో అత్యధికులుగా ఉన్న కార్మికవర్గం, రైతాంగానికి ప్రతినిధులుగా పని చేయటానికి వారు అంగీకరించరు. ఆ వర్గాలను సమీకరించే

> “ యుద్ధానంతర పెట్టుబడిదారీ విధానం కార్మికులను తీవ్రంగా దోపిడీ చేసింది. మూడో ప్రపంచ దేశాల్లోని వనరులను కొల్ల గొట్టుకెళ్లింది. వలసవాద విధానం అంతమైన తర్వాత ఏర్పడిన ప్రభుత్వా ల గొంతునొక్కి సైనిక కుట్రల ద్వారా ఆ దేశాల సార్వభౌ మత్వాన్ని సామ్రాజ్యవాదులు హరిం చారు. “పెట్టుబడిదారీ స్వర్ణ యుగం” (1945-73)లో ప్రపంచంలోని ధనిక దేశాల్లో కార్మికు లు సాపేక్షికంగా స్థిరత్వాన్ని, అభివృద్ధిని సాధించగా, మిగతా ప్రపంచంలోని కార్మికులు అభివృద్ధికి దూరంగా ఉండిపోయారు. ”

కార్యక్రమాలను వానే వదిలేశారు.

కొన్ని నినాదాలు, ఉదాహరణకు టెక్నో ఫ్యూడలిజం (యూనిస్ ఒరోఫకిస్), డెమోక్రటిక్ సెట్‌బ్యాక్స్ (రెడ్ ఫ్యూచరో), ప్రోగ్రెసివ్ క్యాపిటలిజం (జోసెఫ్ స్టిగ్లిట్జ్), రైట్స్ విత్ రెస్పాన్సిబిలిటీస్ (థర్డ్ వే)...వంటివి విభిన్న భావాలకు దారితీసి, పెట్టుబడిదారీ విధానం లో ఒకప్పుడు న్యాయమైన పోటీ, ప్రజాస్వామ్యం వేళ్ళూనుకొని ఉండేదన్న భావాన్ని కలిగిస్తాయి. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అటువంటి స్వర్ణయుగం ఎప్పుడూ లేదు. పెట్టుబడిదారుల మధ్య పోటీ గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. ప్రజలపై ఈ కంపెనీనో, ఆ కంపెనీనో బలవం తంగా రుద్దటం కోసం (తరచూ హింసాత్మ కంగా) వారు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉప యోగిస్తారు. పన్నులు, వేతనాల ద్వారా శ్రామికులకు చెల్లిస్తున్న సంపద భాగాన్ని తగ్గించటానికీ పెట్టుబడిదారీ వర్గం మరింత ఆదాయాన్నీ, సంపదనూ పోగేసుకునేందుకుగాను తమ ఆధిపత్యాన్ని కొనసాగించుటానికీ, మరింత పెట్టుబడిని సమీకరించుకోవటానికీ ప్రయత్నం చేస్తారు.

యుద్ధానంతర “పెద్ద మనుషుల తరహా” పెట్టుబడిదారీ విధానం కార్మికులను తీవ్రంగా దోపిడీ చేసింది. మూడవ ప్రపంచ దేశాలలోని వనరులను కొల్లగొట్టుకెళ్లింది. వలసవాద విధానం అంతమైన తర్వాత ఏర్పడిన ప్రభుత్వా ల గొంతునొక్కి, సైనిక కుట్రల ద్వారా ఆ దేశాల సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదులు హరిం చారు. “పెట్టుబడిదారీ విధానపు స్వర్ణయుగం” (1945–73)లో ప్రపంచంలోని ధనిక దేశాల్లో కార్మికులు సాపేక్షికంగా స్థిరత్వాన్ని, అభివృద్ధిని సాధించగా, మిగతా ప్రపంచంలోని కార్మికులు అభివృద్ధికి దూరంగా ఉండిపోయారు. తమ సార్వభౌమత్వాలను అమలు చేసుకోవటానికి ప్రయత్నించిన వర్ధమాన దేశాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు కుట్రలు (1953లో ఇరాన్ నుండి 1973లో చిలీ వరకు) చేశారు. నూతన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని 1974లో ఐక్యరాజ్యసమితిలో ఓటింగ్ ద్వారా చేసిన నిర్ణయాన్ని అమలు జరపటానికి మూడవ ప్రపంచ దేశాలను అనుమతించకపోవటం, నయా–వలసవాద ఆర్థిక నిర్మాణంతో దేశాల హక్కులను దొంగిలించటం తదితరాల ద్వారా సామ్రాజ్యవాదులు ఈ ‘‘స్వర్ణయుగాన్ని’’ నిర్మించారు. నయా–వలసవాదం ఈ “సర్ణయు గానికి” ధనాన్ని అందించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి, బడా బహుళజాతి కంపెనీల ద్వారా ఈనాటికీ అదే ఆధిపత్యం కొనసాగుతున్నది. ప్రపంచంలోని పేద దేశాల నుండి ధనిక దేశాల బ్యాంక్ ఎకౌంట్లలోకి “కప్పం” రూపంలో పెట్టుబడి ప్రవహిస్తూనే ఉన్నది. వారు దానిని పెద్దమొత్తంగా పరిశ్రమలలో పెట్టుబడిగా పెట్టటానికి బదులు అక్రమంగా డబ్బు సంపాదించటం కోసం కేసినో లాంటి అనైతిక కార్యకలాపాలకు మళ్ళిస్తున్నారు (మౌలిక సదుపాయాల రంగాలలో వారు అసలేమీ పెట్టుబడులు పెట్టటం లేదనేది దీనర్థం కాదు. కృత్రిమ మేధ, ఆయుధ ఉత్పత్తి తదితరాలలో పెట్టుబడిదారీ వర్గం భారీగానే పెట్టుబడులు పెడుతున్నారు).

అమెరికా జోక్యందారీ విధానాలతో విచ్ఛిన్నమయిన జాతీయ ఆర్థిక ఎజెండాలను పునర్నిర్మించుకోవాలని ప్రపంచంలోని పేద దేశాలు కోరుకుంటున్నాయి. అయితే యూరో పియన్ సంక్షేమ ప్రభుత్వాలు, అమెరికా న్యూ డీల్‌లను గురించిన ఊహాలోకంలో విహరిస్తున్న కొత్త ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్ల ప్రతిపాదనలలో మాత్రం ఈ అంశం లేనేలేదు. ప్రపంచ ప్రజలు స్వీకరించని “పెట్టుబడిదారీ విధాన స్వర్ణయుగానికి తిరిగి వెళ్ళటం”, “మానవ ముఖంతో పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించటం” అనే భ్రమలలో వారు ఉన్నారు.

‘అలయెన్స్ ఆఫ్ డెమోక్రసీస్’ 2024లో ప్రచురించిన ముఖ్యమైన సర్వే “ప్రజాస్వామిక భావాల సూచి”లో ప్రజాస్వామ్యానికి ఎదురౌ తున్న మూడు ప్రమాదాలను గురించి విశ్లేషిం చింది. సంపద, ఆదాయం కేంద్రీకృతం కావటం, రాజకీయ రంగంలో కార్పొరేట్ల ఆధి పత్యం పెరగటం అనేవి ఈ మూడు ప్రమా దాలు. ఏ పశ్చిమ దేశంలో కన్నా ఎక్కువగా చైనా ప్రజలలో 79 శాతం మంది తమది ప్రజాస్వామిక దేశం అని చెప్పటం ఆసక్తికరమైన విషయం. పశ్చిమ దేశాలకు అనుకూలమైన మేధావుల సంస్థ ఈ సర్వేను నిర్వహించింది. ప్రపంచంలో ఉన్న పెట్టుబడిదారుల కోర్కెల కన్నా విస్తారమైన ప్రజల అవసరాలను తీర్చటానికి తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నదని చైనా ప్రజలు విశ్వసిస్తున్నారని ఈ సర్వే స్పష్టం చేసింది. ఒకవైపు ప్రపంచంలో సోషలిజం పట్ల ప్రజలకు ఆసక్తి పెరుగుతున్నది, మరోవైపు సామ్రాజ్యవాదులపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించగమని పేద దేశాలకు చైనా అనుభవాలు చెబుతున్నాయి. ఇలాంటి తరుణంలో “అభ్యుదయ పెట్టుబడిదారీ విధానాని”కి తిరిగిరావటం అనే బలహీనమైన సోషల్ డెమోక్రటిక్ భావజాలం ప్రజలను తప్పుదారి పట్టిస్తుంది. మరణశయ్యపై ఉన్న ఉదారవాదం ద్వారా కాలం చెల్లిన ఉదారవాద ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధానాలను తిరిగి తీసుకురావలసిన అవసరం లేదు.

సోషలిజం మనకు ఒక అవకాశంగా వచ్చింది. సామాజిక శ్రమ ఉత్పత్తి చేసిన విస్తారమైన సంపదలను సమాజంలోని ప్రతివారినీ ధనికులుగా చేయటానికి ఉదారవాదులు ఉపయోగిస్తారని మనం భావిం చాం. ఉత్పత్తిని మానవత్వం ప్రాతిపదికగా నిర్వహిస్తూ, ప్రజలను గౌరవంగా, దయగా చూస్తారనీ, ప్రపంచాన్ని సక్రమంగా అర్థం చేసుకోవటానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సామాజిక సంపదలను వినియోగిస్తారని కూడాడవిశ్వసించాం. మనం జరగాలని భావించిన చరిత్ర ఇది. కానీ అది జరగలేదు. ప్రజల కష్టాలకు స్పందించే ప్రపంచాన్ని, మానవులకు స్వేచ్ఛనిచ్చే ప్రపంచాన్ని నిర్మించా లని వందల సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నారు. కార్మికులు, రైతులు, మట్టి పిసుకుతూ జీవిస్తున్న సామాన్యప్రజలు తమ జీవితాలను మెరుగు చేసుకోవటానికి భూస్వాములు, ధనికులతో పోరాడుతున్నారు. వలసలకు వ్యతిరేకంగా, సోషలిజం కోసం, ఆకలి, అవమానాలకు వ్యతిరేకంగా వారు ఉద్యమాలను నిర్మించారు. ఇవి ప్రజలు చైతన్యంతో నిర్మించిన ఉద్యమాలు. ప్రస్తుత పరిస్థితి శాశ్వతమని, తమ

> **❝ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు, సామ్రాజ్యవాద దేశాలలోని విప్లవకర శక్తులు, అంటే పారిశ్రామిక కార్మికవర్గం తిరుగుబాటు చేసి చరిత్రను సోషలిజం వైపుకు నడుపుతారని రెండవ ఇంటర్నేషనల్‌లో కార్ల్ కౌట్‌స్కీ వాదించాడు. ఈ సిద్ధాంతం వాస్తవ రూపం దాల్చలేదు. దీనికి బదులుగా అభి వృద్ధి చెందిన పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలలో విప్లవాలు విఫలమయాయి. ❞**

స్థితిగతులు యథాతథంగా ఉంటాయని వారు అంగీకరించబోరు. వారు భూస్వాముల ఇళ్ళు, పెట్టుబడిదారుల ఫ్యాక్టరీ గేట్ల వైపే కాక, తమ భవిష్యత్ వైపు కూడా కదులుతున్నారు,

1911 విప్లవాలను (చైనా, ఇరాన్, మెక్సికో), 1917 విప్లవం (జార్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా రష్యాలో ), 1949 విప్లవం (చైనా), 1959 (క్యూబా), 1975 (వియత్నాం) విప్లవాలతో పాటు ఇంకా అనేక విప్లవాలను ఈ ఉద్యమాలు జయప్రదం చేశాయి. ప్రతి విప్లవం కొన్ని హామీలు ఇచ్చింది. తమ ఆకాంక్షల చుట్టూ ప్రజలు సమీకృతం అయిన పుడు, బూర్జువా వర్గ ఆలోచనలకు అను గుణంగా ప్రపంచాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం లేదు. ఇప్పటి కన్నా మరింత మంచి జీవితం, ధైర్యంగా బతకటం లక్ష్యం కాగా, ప్రపంచంలోని ప్రజలు కొద్దిమంది ధనికుల సంపదలను పెంచటం కోసం తమ జీవితాలను ఫణంగా పెట్టి ఎందుకు పని చేయాలి?

జర్మనీలో 1919లో విప్లవం ఓడిపోవ టంతో బోల్షివిక్కు విప్లవానుభవ ఉదాహరణను యూరప్ దేశాలు అనుసరించటానికి అవకాశం లేకుండాపోయింది. సాంకేతికంగా, పారిశ్రా మికంగా వెనుకబడిన ఆసియా, యూరప్‌లలోని అనేక దేశాలను వలసలుగా చేసుకున్న జార్ సామ్రాజ్యంలో విప్లవం జయప్రదం అయింది. దాని తర్వాత 1921లో మంగోలియాలో విప్లవం జయప్రదం అయింది. అదే సమయంలో మాజీ జారిస్టు సామ్రాజ్యంలోని అనేక ప్రాంతాలలో విప్లవ తరంగాలతో యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌గా రూపొందింది.

ప్రజాస్వామ్యం, ఉదారవాదాలను పక్కన పెట్టి, సోషలిస్టు దృక్పథంగల ప్రభుత్వం ద్వారా సామాన్య ప్రజలు తమను తాము పాలించుకోగలరని 1917 అక్టోబర్ విప్లవం స్పష్టం చేసింది. ఇతర ఏ అంశం కన్నా ఎక్కువగా వి.ఐ. లెనిన్ సిద్ధాంతం సరైనదేనని అక్టోబర్ విప్లవంతోపాటు 1945లో వియత్నాంలో, 1949లో చైనాలో, 1959లో క్యూబాలో జరిగిన విప్లవాలు కూడా రుజువు చేశాయి. ఈ సిద్ధాంతాలు (అంటే, ఉదార వాదం విప్లవకర మార్పులు తీసుకురాలేదని, వలస విధానాన్ని అంతం చేయవచ్చునని, ఉత్పాదక శక్తులు పూర్తిగా అభివృద్ధి కాని దేశాలలో కూడా విప్లవాలను జయప్రదం చేయవచ్చుననే సిద్ధాంతాలు) వలస దేశాలలోని కొన్ని తరాల విప్లవకారులను ఉత్తేజపరిచి, లెనినిస్టులుగా, తర్వాత మార్క్సిస్టు–లెనినిస్టులుగా మార్చాయి. అటువంటి వారిలో జోస్ కార్లోస్ మెరియాటెగి, మావో జెడాంగ్, హొ చిమిన్, క్వామే ఎన్‌క్రుమా, ఇఎంఎస్ నంబూద్రిపాద్, పి. సుందరయ్య, ఫైడల్ కాస్ట్రో లాంటి వారున్నారు. మూడవ ప్రపంచ దేశాలలో సోషలిజం నిర్మాణంలో మౌలికంగా వచ్చిన అనుభవాలతో మార్క్సిజం–లెనినిజపు సాధారణ సూత్రాలను ఈ దిగువ విధంగా సిద్ధాంతీకరించవచ్చు.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు, సామ్రాజ్యవాద దేశాలలోని విప్లవకర శక్తులు, అంటే పారిశ్రామిక కార్మికవర్గం తిరుగుబాటు చేసి చరిత్రను సోషలిజం వైపుకు నడుపుతారని రెండవ ఇంటర్నేషనల్‌లో కార్ల్ కౌట్‌స్కీ వాదించాడు. ఈ సిద్ధాంతం వాస్తవ రూపం దాల్చలేదు. దీనికి బదులుగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలలో విప్లవాలు విఫలమయాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గంలోని పై తరగతి కార్మికులు (లెనిన్ వారిని కార్మికుల లోని ఉన్నతవర్గం అని పిలిచాడు) బూర్జువాలుగా మారి, పెట్టుబడిదారీ వర్గంతో జత కట్టటం ఈ పరిణామాలకు దారితీసింది. ప్రత్యేకంగా "కార్మికవర్గ నాయకులు" సామ్రాజ్య వాదం ఇచ్చే వేతనాలతో లాభపడ్డారని, సామ్రాజ్యవాదానిది ఉదారవాద సంస్కృతి అనే సిద్ధాంతాన్ని జీర్ణం చేసుకొని వ్యవహరిస్తున్నారని లెనిన్ వివరించాడు.

దీనికి భిన్నంగా వలసవాద పాలకులను, వలస విధానంపై ఆధారపడి అభివృద్ధి అయిన వర్గాలను అధికారం నుండి తొలగించటానికి వలస, అర్థ వలస దేశాలలోని కార్మికులు, రైతులు సంఘటనగా ఏర్పడి చేసిన కృషి ఫలించింది. అయితే వలసవాద ఆధిపత్యానికి భిన్నంగా తమ సమాజాలను ముందుకు నడపటానికి అవసరమైన కార్యక్రమం గానీ, శక్తిసామర్థ్యాలు గానీ, స్వయం సమృద్ధిని సాధించటానికి అవసరమైన ఎజెండా గానీ, వలస పాలకులకు ప్రతినిధులుగా వ్యవహరించిన ఉదారవాద వర్గాలకు లేవు. సామ్రాజ్యవాదంతో వారు విడగొట్టుకోలేదు. కేవలం ప్రత్యక్ష వలస పాలనతో మాత్రమే విడగొట్టుకున్నారు.

ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా దేశాలలోని అనేక వలస, అర్థ వలస దేశాలలో పాలకులు ప్రజలకు ఆధునిక విద్య, వైద్యం, ఇళ్ళు తదితరాలను సమకూర్చడం ద్వారా ఆ దేశాలలో సాంస్కృతిక అభివృద్ధిని సాధించలేకపోయారు. అలాగే వారు ఈ దేశాల సంస్కృతిలో రాజకీయ, న్యాయ సంస్థలను అభివృద్ధి చేయటానికి తగిన ఉదారవాద భావజాలాన్ని పెంపొందించలేకపోయారు. అందువలన కార్మికులు, రైతుల ఆధిపత్యంలో ఉన్న దేశాలు ఉదారవాదాన్ని తమ వారసత్వంలో భాగంగా చేనుకోలేదు. అందువల్ల ఇటువంటి ఉదారవాదాన్ని కార్మిక కర్షక నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పరిచిన దేశాలు తిరస్కరించాయి. కానీ కరీబియన్, మధ్య అమెరికా దేశాలలో ఉదారవాద విధానాలకు పరిమితులు ఏర్పడటంతో పాటు, వలసవాద విధానంలోనే పాలన సాగింది. దక్షిణ ప్రాంతంలోని అర్జెంటీనాలో జువాన్ బౌటిస్తా అల్‌బర్డి (1810–1884), చిలీలో జోస్ విక్టోరినో లాస్టారియా (1817–1888) లాంటి మేధావులు ఉదారవాదం గురించి రాశారు. కానీ తమ సమాజాలలోని స్థానిక ప్రజలు, కార్మికవర్గం, రైతాంగం గురించి ఏమీ చెప్ప లేదు. తర్వాతి తరం ఉదారవాద సిద్ధాంత వేత్తలు, వెనిజులాకు చెందిన సాల్వడార్ డి లా ప్లాజా (1896–1970), పెరులో మారియా టెగి (1894–1930) మార్క్సిస్టుల అభిప్రాయాలతో ప్రత్యక్షంగా విభేదించారు.

నూతన విముక్తి దేశాలు ఆధునిక పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి చేసుకుని ఆధునిక ఆర్థికవ్యవస్థను నిర్మించుకొనే ప్రయత్నాలకు సామ్రాజ్యవాదం విఘాతం

కలిగించింది. తమ దేశాలలోని ముడి సరుకులను ఎగుమతి చేయటానికీ, ఉత్పాదక సరుకులను దిగుమతి చేసుకోవటానికీ నూతన విముక్తి దేశాలను పరిమితం చేశారు. దీనర్థం విప్లవాత్మకంగా ఏర్పడిన నూతన ప్రభుత్వాలు కొద్దిపాటి సాంకేతిక నైపుణ్యం, శాస్త్రీయ అభివృద్ధికి పరిమితమై, ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థలకు నాయకత్వం వహిస్తూ, సామ్రాజ్య వాదులపై ఆధారపడటాన్ని కొనసాగించాయి.

సోవియట్ యూనియన్, చైనా ప్రజా రిపబ్లిక్ నుండి క్యూబా వరకు విప్లవాత్మకంగా ఏర్పడిన ప్రభుత్వాలు ఈ పరిస్థితిని, పరిమితులను అర్థం చేసుకున్నాయి. అయితే వామపక్ష నినాదాలకు పరిమితమైన నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు మాత్రం వీటిని అర్థం చేసుకోలేకపోయారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ కేంద్రాలలో కాకుండా వెనుకబడిన దేశాలలో సోషలిజం నిర్మించటం అత్యంత కష్టాలతో కూడుకున్నది. ఈ ప్రత్యక్ష అనుభవం నుండి ఉదారవాదులు దూరంగా ఉన్నారు. ఏకపార్టీ పాలనను నియంతృత్వం అని తెగనాడటం, ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఉదారవాద భాషను మాట్లాడటం చాలా సులభం. కానీ ఉదారవాద సిద్ధాంతవేత్తల భావాలకు భిన్నంగా పేద దేశాలలోనే ఈ విప్లవకర పరిణామాలు ఎందుకు జరిగాయన్నది అర్థం చేసుకోవటం చాలా కష్టమైనది. ఈ దిగువ పేర్కొన్న వాటితో సహా పేద దేశాలలో సోషలిజాన్ని నిర్మించటం కోసం జరుగుతున్న కృషి అత్యంత ముఖ్యమైన కర్తవ్యాలను నెరవేర్చాల్సి వచ్చింది.

అంతర్గత, బహ్య శత్రువుల దాడుల నుండి విప్లవాన్ని కాపాడుకోవాల్సి వచ్చింది. సైనికదళాలను వినియోగించటంతో పాటు ప్రజలను సాయుధులను చేయవలసి వచ్చింది. దేశంలోని విప్లవ వ్యతిరేకులు కూటమిగా ఏర్పడి విప్లవాభివృద్ధిని ప్రతిఘటించకుండా నిరోధించాల్సి వచ్చింది. వీటితో పాటు స్వేచ్ఛ లాంటి మాటల ముసుగులో ఉదారవాదులు తిరిగి అధికారంలోకి రావటానికి చేస్తున్న ప్రయత్నాలను, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను విస్తారమైన ప్రజలపై రుద్దటానికి చేస్తున్న కుట్రలను ప్రతిఘటించాల్సి వచ్చింది. ఇవి సైద్ధాంతిక చర్చలు కాదు. 1918లో సోవియట్ యూనియన్‌పై దాడి చేశారు. 1962 ప్రారంభం నుండి క్యూబాను దిగ్బంధం చేస్తున్నారు. సామ్రాజ్యవాదులు ఇప్పుడు చైనా తీరంలో కుతంత్రాలు చేస్తున్నారు. ఈ ప్రభుత్వాలు ఉనికిలోకి వచ్చినప్పటి నుండి వాటి గొంతు

“ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ కేంద్రాలలో కాకుండా వెనుకబడిన దేశాలలో సోషలిజం నిర్మించటం అత్యంత కష్టాలతో కూడుకున్నది. ఈ ప్రత్యక్ష అనుభవం నుండి ఉదారవాదులు దూరంగా ఉన్నారు. ఏకపార్టీ పాలనను నియంతృత్వం అని తెగనాడటం, ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఉదారవాద భాషను మాట్లాడటం చాలా సులభం. కానీ ఉదారవాద సిద్ధాంతవేత్తల భావాలకు భిన్నంగా పేద దేశాలలోనే ఈ విప్లవకర పరిణామాలు ఎందుకు జరిగాయన్నది అర్థం చేసుకోవటం చాలా కష్టమైనది. ”

నులమటానికి ఉదారవాద ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయి.

**ప్రజలు అత్యవసరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి:** ఆకలి, దరిద్రం, ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొనే అవమానాలను సాధ్యమైనంత త్వరగా అధిగమించాలి. గతంలో పాలించిన నిరంకుశ ప్రభుత్వాలు సమాజంలో పరిమితంగా ఉన్న వనరులను తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకొనేవి. విప్లవకర ప్రభుత్వాలు సమాజంలోని ప్రజలందరి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు చేయాలి. సమాజ శ్రేయస్సు కోసం, సమాజానికి అవసరమైన సరుకులన్నింటినీ ఉత్పత్తి చేయటం కోసం కార్మికవర్గంలోని కొందరు కొద్దికాలం పాటు అత్యధికంగా కష్టపడి పని చేయాలి.

**సమాజంలో ఉత్పత్తిశక్తులను అభివృద్ధి చేయటం కోసం:** వలస విధానం నుండి బయటపడిన పేద దేశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు (ముఖ్యంగా విద్యుత్, రవాణా వ్యవస్థ), ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటం కోసం సరుకులను ఉత్పత్తి చేయటానికి అవసరమైన పరిశ్రమలు కూడా లేవు. పరిశ్రమలు నిర్మించటానికి, మౌలిక సదుపాయాలు కల్పించటానికి శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు కావాలి. ఈ దేశాలకు వీటిని నిరాకరించారు. అందువలన వీటిని నిర్మించుకోవటం కోసం అంతర్జాతీయ సహకారం, అతి వేగంగా ఉన్నత విద్యను అభివృద్ధి చేసుకోవటం, ముడి సరుకులను ఎగుమతి చేయటం ద్వారా వచ్చిన ధనాన్ని పారిశ్రామికీకరణ కోసం పెట్టుబడిగా వినియోగించటం చేయాలి.

**ప్రజల కోసం సాంస్కృతిక ప్రపంచాన్ని నిర్మించటం:** నిరక్షరాస్యతను నిర్మూలించటం కోసం విద్య, సాంస్కృతిక సంస్థలను నిర్మించాలి. తమ సమాజాన్ని తామే నడపగలమన్న విశ్వాసాన్ని కార్మికులు, రైతులలో కల్పించటం దీర్ఘకాలిక కార్యక్రమం. అందులో ఉన్న సమస్యలను తక్కువ అంచనా వేయరాదు. ఈ మొత్తం విప్లవకర అనుభవాలలో ప్రజలకు స్పష్టత కల్పించటం, విశ్వాసం నింపటం, వారి గౌరవాన్ని పెంచే విధంగా వ్యవహరించటం అత్యంత కష్టమైనది. తమ స్వంత చరిత్రకు తామే ప్రతినిధులు కావటం, ప్రభుత్వ కార్యక్రమాలకు బాధ్యత వహించటం, మనకాలంలోని క్లిష్టమైన డిజిటల్ ఆర్థికవ్యవస్థలను నడపటానికి బహుముఖ ప్రతిభాశాలురతో ఉన్న సంస్థలు అవసరం.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత సాంకేతిక దాడులు తీవ్రం కావడంతో సాంకేతికాభివృద్ధి తక్షణం చేయాల్సిన కర్తవ్యంగా ఉన్నది. సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో జరుగుతున్న అంతర్గత తిరుగుబాట్లు, ప్రత్యక్ష సైనికదాడులు సర్వసాధారణంగా మారాయి. విముక్తి చెందిన దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవటానికి సామ్రాజ్యవాదులు ఏ మాత్రం సందేహించటం లేదు.

చిలీలో 1973లో పాపులర్ యూనిటీ ప్రభుత్వాన్ని సామ్రాజ్యవాదులు హింసాత్మకంగా కూలదోసిన తర్వాత కూడా ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు దానిని సరిగా అర్థం చేసుకోకపోవటం ఆసక్తికరమైన విషయం. 1970-73 మధ్య పాపులర్ యూనిటీ ప్రభుత్వాన్ని పూర్తిగా బలపరచటంతో పాటు, సైనిక తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి కూడా క్యూబా పూర్తి మద్దతు ఇచ్చింది. అది ఈ కాలమంతటిలోనూ, ముఖ్యంగా ఇప్పుడు అమెరికా దిగ్బంధాన్ని ఎదుర్కొంటున్నది. దీనిని ఫ్రెంటో ఆంప్లియో మాత్రమే కాకుండా, కమ్యూనిస్టులలోని కొన్ని తరగతులు కూడా సక్రమంగా అర్థం చేసుకోవటం లేదు. హన్నా అరెండ్ లాంటి ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి ఉదారవాద మేధావుల భాషలో మాట్లాడటం చాలా సులభం. కానీ ఒక పేద

> **“అగౌరవకరమైన పరిస్థితుల నుండి పెట్టుబడిదారీ విధానం మానవులందరినీ విముక్తి చేస్తుందనే వాదనకు ఆధారం లేదు. పెట్టుబడిదారీ విధానం సహజంగానే అసమానతలను, అగౌరవాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి అందరికీ గౌరవాన్ని కల్పించే కార్యక్రమాలన్నీ సోషలిస్టు కార్యక్రమాలుగానే ఉంటాయి.”**

దేశంలో విప్లవోద్యమాన్ని నిర్మించటం చాలా సంక్లిష్టమైనదన్న అంశాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం.

రష్యా నుండి క్యూబా వరకు మార్క్సిస్టు విప్లవాలు స్వేచ్ఛ కోసం కాక, అవసరం కోసం జరిగాయి. ఈ దేశాలన్నీ దరిద్రంలో ఉన్నవే. ప్రతి కొత్త ప్రభుత్వానికీ సోషలిజం నిర్మించటానికి అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకోవటం కష్టంగా మారింది.

వాటిలో ఒకటైన వియత్నాంపై అమెరికా బాంబు దాడులు చేసింది. ఆ దేశంలోని మౌలిక సదుపాయాలు నాశనమైపోయే వరకు, భూమి అంతా విషపూరితం అయే వరకు బాంబులు వేసింది. వియత్నాం లాంటి దేశం సులభంగా సోషలిజంలోకి పరివర్తన చెందుతుందని భావించటం అమాయకత్వం అవుతుంది. వీటిలోని ప్రతి దేశం వనరులను సమీకరించుకోవటం కోసం తమను తాము పీల్చిపిప్పి చేసుకున్నాయి. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా అనేక తప్పులు కూడా చేశాయి. సోషలిజాన్ని నిర్మించటం కోసం జరిగిన పోరాటంలో ఈ తప్పులు చేశాయి. ఈ దేశాలలో జరిగిన తప్పులకు సోషలిజాన్ని నిందించటం భావ్యం కాదు. ప్రతి దేశంలోనూ పెట్టుబడిదారీ విధానం తర్వాత ఏ విధంగా అభివృద్ధి చెందాలన్న పరిశోధన జరిగింది. వాటి నుండి మనం అనేక విషయాలు నేర్చుకోవచ్చు.

ఈ విప్లవాల తర్వాత అన్ని దేశాలలోనూ మానవత్వాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టారు. సార్వత్రిక విద్య, ప్రజలందరికీ వైద్యం అందించటం, సహకార సంఘాలుగా ఏర్పడి పని చేయటం, ప్రజలను దరిద్రులుగా చేయటం కాకుండా సంపద్వంతులుగా చేయటానికి కార్యక్రమాలు తీసుకున్నారు. ప్రతి విప్లవమూ ప్రజలలో ఉన్న సహజమైన భావోద్వేగాలను ప్రజల కోసం వినియోగించటానికి పరిశోధన చేశాయి. దురాశ, సంకుచిత భావాల చుట్టూనే పెట్టుబడిదారీ విధానం నిర్మితమైంది. కానీ ఈ దేశాల్లోని ప్రభుత్వ సంస్థలు ఇటువంటి సంకుచిత భావాలతో సామాజిక జీవితాన్ని నిర్వహించటానికి తిరస్కరించాయి. ఇతరుల పట్ల శ్రద్ధ తీసుకోవటం, సహోదర భావంతో వ్యవహరించటం మానవుల భావోద్వేగాలలో భాగమేనా? దురాశ, విద్వేషాలు లేకుండా చేయటం సాధ్యం కాదా?

### స్పష్టమైన అవగాహనతో వర్గ పోరాటాల ఆవశ్యకత

ప్రస్తుత సంధికాలంలో సార్వభౌమత్వం, గౌరవం, ఈ రెండు రాజకీయ భావాల మధ్య సంఘర్షణ ఉండాలి. మనకాలంలో ఈ రెండూ పరస్పరం ముడిపడిన భావాలుగా ఉన్నాయి. ప్రతిదానికీ కట్టుబడి, వివిధ స్థాయిలలో ఉద్యమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

జాతీయ సార్వభౌమత్వం అనేది ప్రభుత్వ ప్రాజెక్టు. విదేశీ ప్రభుత్వాలు అనుసరించే జోక్యందారీ విధానాలను వ్యతిరేకించటం, తమ ప్రజల ఆర్థిక, రాజకీయ హక్కులను పరిరక్షించటం, వారి అవసరాలను తీర్చటానికి తగిన విధానాలను అనుసరించాలి. వలస విధానం నుండి బయటపడిన దేశం సార్వభౌమత్వంతో అనుసరించే విధానాలు ఆ దేశం సామ్రాజ్యవాద జోక్యందారి విధానాలు, వలస విధానాల వత్తిడి నుండి ఏ మేరకు బయటపడిందనేందుకు కొలబద్ధగా ఉంటాయి.


సామ్రాజ్యవాదుల జోక్యానికి వ్యతిరేకంగా సార్వభౌమత్వాన్ని కోరుకోవటం అనేది ఆ దేశంలోని వర్గ సంబంధాలను తెలియజేయదు. కొన్ని దేశాలు సోషలిస్టేతర మార్గంలో, సామ్రాజ్యవాద జోక్యందారి విధానాలకు వ్యతిరేకంగా ముందుకు పోతున్నాయి. (ఉదాహరణకు ఇరాన్ సోషలిస్టు దేశం కానప్పటికీ సామ్రాజ్యవాదం నుండి సార్వభౌమత్వం కోసం పోరాడుతున్నది). సోషలిస్టు దేశాలలోని అన్ని ప్రభుత్వ ప్రాజెక్టులూ జాతీయ సార్వభౌమత్వం కోసం పని చేస్తాయి. కానీ జాతీయ సార్వ భౌమత్వాన్ని కోరుకొనే ప్రాజెక్టులన్నీ సోషలిస్టు ప్రాజెక్టులు కాదు.

గౌరవం అనేది ప్రజలకు సంబంధించిన అంశం. ప్రతివ్యక్తీ తన జీవితంలోని అన్ని రంగాలలో, తను భాగంగా ఉండే సమాజంలో అన్ని విధాలుగా గౌరవంగా జీవించాలని కోరుకుంటాడు. రోజువారీ జీవితంలో గౌరవప్రదంగా ఉండాలని (దరిద్రం, ఆకలి నుండి విముక్తి పొందాలని), గౌరవప్రదమైన సాంస్కృతిక జీవనం గడపాలని (మానవ సంస్కృతిలో భాగంగా తమ స్వంత సంస్కృతిని అభివృద్ధి చేసుకోవాలని) కోరుకుంటాడు. మానవ చరిత్రలో గౌరవం అన్న భావం విస్తృతంగా వ్యాపించింది. బుద్ధిస్టు సాంప్రదాయాల (ప్రతివారిలోనూ సహజంగానే బుద్ధుడు ఉంటాడని) నుండి స్టోయిసిజం (అందరికీ గౌరవం ఇవ్వాలి) వరకు మనుషులందరినీ గౌరవంగా చూడాలని చెప్పాయి. మానవ హక్కులపై ఐక్యరాజ్యసమితి (1948) ఆమోదించిన తీర్మానం మానవ సమాజంలోని ప్రతివారికీ గౌరవం పొందేహక్కు సహజంగానే ఉన్నదన్న మాటలతో ప్రారంభం అవుతుంది. కానీ మానవులకు గౌరవం సహజంగా వచ్చేది కాదు. మనం దారిద్ర్యం, నిరక్షరాస్యతల నుండి బయటపడి, సుఖప్రదమైన జీవితం గడుపుతుంటే గౌరవం లభిస్తుంది. మన గౌరవాన్ని రూపుదిద్దే భౌతికశక్తులు ఉన్నాయి. అనేకమంది సోషలిస్టు కార్యక్రమంలోని ఏవో కొన్ని అంశాలను అనుసరిస్తున్నామని అనుకొంటున్నప్పటికీ, సోషలిస్టు రాజకీయాలే గౌరవాన్ని పెంపొందిస్తాయి. అగౌరవకరమైన పరిస్థితుల నుండి పెట్టుబడిదారీ విధానం మానవులందరినీ విముక్తి చేస్తుందనే వాదనకు ఆధారం లేదు. పెట్టుబడిదారీ విధానం సహజంగానే అసమానతలను, అగౌరవాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి అందరికీ గౌరవాన్ని కల్పించే కార్యక్రమాలన్నీ సోషలిస్టు కార్యక్రమాలుగానే ఉంటాయి.

ప్రస్తుతం సంక్లిష్టంగా ఉన్న ప్రపంచంలో, ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో కల్లోల పరిస్థితులు నెలకొని ఉండగా, ఆగ్నేయ, తూర్పు ఆసియాలలో పరిస్థితి స్థిరంగా ఉన్నది. పాత సామ్రాజ్యవాద దేశాలు ప్రజలను కడగండ్ల పాలు చేసే పొదుపు చర్యలు, రుణాలు, యుద్ధాలను రుద్దుతున్నాయి. ఇజ్రాయెల్

*(మిగతా 21వ పేజీలో)*

# పోర్చుగీసు వారి రాక


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

ప్రాచీన కాలం నుండీ భారత ఉపఖండానికీ, ఐరోపా ఖండానికీ మధ్య సముద్ర మార్గం మధ్యధరా ప్రాంతంలోని సూయజ్ కాలువ గుండా సాగేది. అప్పటి వాణిజ్య కేంద్రాలలో ప్రధానమైనది కాన్‌స్టాంటినోపుల్. 15వ శతాబ్దం తొలి భాగంలో ఈ ప్రాంతం మీద తురుష్కుల ప్రాబల్యం బాగా పెరిగింది. ఒట్టోమన్ సామ్రాజ్యం విస్తరించి మధ్యధరా ప్రాంతాన్నంతటినీ ఆక్రమించుకున్నారు. సిరియా, ఈజిప్టు దేశాలను ఆక్రమించుకున్నారు. ఇవి సూయజ్ కాలువకు ఇరువైపులా ఉన్న రాజ్యాలు. దాంతో ఆనాటి అంతర్జాతీయ వాణిజ్యానికి ఆయువుపట్టు లాంటి సముద్ర మార్గపు ప్రాంతం ఒట్టోమన్ రాజ్యం చేతుల్లోకి పోయింది. 1453లో కాన్‌స్టాంటినోపుల్ కూడా వారి చేతుల్లోకి పోయింది.

ఈ కాలంలోనే యూరప్‌లో యాంత్రిక విప్లవానికి తొలి అడుగులు పడసాగాయి. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి ప్రేరణ నిచ్చిన సాస్కృతిక పునరుజ్జీవనం (రినైజాన్స్) యూరప్ ఖండంలో విస్తరించింది. భాషా, సాంస్కృతిక అభివృద్ధికి, మత మౌఢ్యం నుండి బైట పడి స్వతంత్రంగా మేథో వికాసం జరగడానికి అది ఎంతో దోహదం చేసింది. ముద్రణాయంత్రం కనుగొన్నారు. అది భావ వ్యాప్తికి, విద్యావ్యాప్తికి తోడ్పడింది. లోహ పరిశ్రమ అభివృద్ధిచెందింది. తుపాకుల తయారీకి అది తోడ్పడింది. ఆధునిక పద్ధతులను ఉపయోగించి విస్తారమైన భూములను వినియోగంలోకి తీసుకువచ్చారు. పంటల సాగుతోబాటు పశు పెంపకం కూడా బాగా పెరిగింది. దానితోబాటు మాంసం వినియోగం బాగా పెరిగింది. దానికి కావలసిన మసాలా దినుసులకు గిరాకీ అక్కడ బాగా పెరిగింది. దానితోబాటు భారతీయ, చైనా దేశాల వస్త్రాలకు, మన దేశంలో తయారయే ఔషధాలకు కూడా గిరాకీ పెరిగింది. ఐతే ఆ సరుకులన్నీ రవాణా అయ్యేది సూయజ్ కాలువ ద్వారానే. ఆ ప్రాంతంమీద ఒట్టోమన్ రాజ్యానికి ఉన్న గుత్తాధిపత్యం ఐరోపా దేశాలకు మింగుడు పడలేదు. ఆ రాజ్యంతో సైనికపరంగా తలపడే పరిస్థితి కూడా వాటికి అప్పటికి లేదు. అందుచేత ఐరోపా దేశాలలో సూయజ్ కాలువ మార్గం కాకుండా వేరే సముద్ర మార్గాన భారత, చైనా దేశాలకు రాకపోకలు సాగించి వాణిజ్యాన్ని నడవడానికి ప్రయత్నించాలన్న కోరిక బలపడింది.


అలా భారతదేశానికి దారి కనుక్కోడానికే పశ్చిమ దిశగా బయలుదేరిన కొలంబస్ అమెరికా ఖండం అనేది ఒకటుందని కనుగొన్నాడు. భూమి గుండ్రంగా ఉందని నిర్ధారణ అయినందున, తూర్పు దిశగా పోడానికి ఉన్న ఒకే దారి సూయజ్ కాలువ ద్వారా ఉన్నందున, ఆ దారి కాకుండా వేరే దారిన పోవాలంటే పశ్చిమ దిశగా పోవడమే మార్గం అనుకున్నాడు కొలంబస్. అంతవరకూ ఐరోపా, ఆసియా, ఆఫ్రికా వాసులకు తెలియని అమెరికా ఖండాన్ని ఆ ప్రయత్నంలో కనుగొన్నాడు. ప్రపంచ చరిత్ర గమనాన్నే మార్చివేసిన ఒక కీలకమైన అన్వేషణగా అది నిలిచింది.

పశ్చిమ దిశగా పోతే అమెరికా ఖండం వచ్చింది. మరి భారతదేశానికి మరో దారి ఎలా? అన్న ప్రశ్న కు సమాధానం1487లో బర్తొలవోమ్యూ అనే పోర్చుగీసు నావికుడు కనుగొన్నాడు. అతడు ఆఫ్రికా ఖండాన్ని చుట్టి హిందూ మహాసముద్రంలో ప్రవేశించి అక్కడినుంచి భారతదేశానికి సముద్ర మార్గం ఉందని కనుగొన్నాడు. ఈ సుదీర్ఘ సముద్ర యానానికి అతడు తెరచాపలను, దిక్సూచిని వినియోగించాడు. ఈ సముద్రయాన అన్వేషణలను ప్రధానంగా పోర్చుగల్ పాలకుడు డామ్ హెన్రీ కె ప్రోత్సహించాడు. తురుష్క వ్యాపారులమీద ఆధారపడకుండా నేరుగా ఇండియాతో వ్యాపారం చేయడలిగితే అటు ఐరోపాలోని తోటి దేశాలను పోటీలో వెనక్కి నెట్టవచ్చునని, ఇటు తురుష్కుల ఆధిపత్యాన్ని కూడా దెబ్బ తీయవచ్చునని అతడు భావించాడు. అదే సమయంలో ఆసియా, ఆఫ్రికా దేశాలలో బడుగు వర్గాలలో క్రైస్తవ మతాన్ని వ్యాపించజేస్తే తురుష్కుల విస్తరణను కూడా అరికట్టవచ్చునని అతడు భావించాడు.

వాస్కోడగామా ఒక గుజరాత్ నావికుడి సహాయంతో 1498లో కాలికట్ (కేరళ లోని కోజికోడ్) రేవులో అడుగుపెట్టాడు. వారి రాకను అక్కడ అప్పటికే స్థిరపడిన అరబ్బు వ్యాపారులు వ్యతిరేకించారు. కానీ అక్కడి ముస్లిం పాలకుడు జమోరిన్ వారిని స్వాగతించాడు. వారికి కావలసిన ఔషధాలను, మసాలా దినుసులను ఇచ్చి పంపాడు. భారత్ నుండి వాస్కోడగామా తీసుకుపోయిన ఈ సరుకులను యూరప్‌లో అరవై రెట్లు ఎక్కువ ధరకు అమ్మాడు. అప్పటికి ఆ సరుకులకు గల గిరాకీని ఇది సూచిస్తోంది. అన్నింటికీ తెగించి సముద్ర ప్రయాణం చేయడం వెనుక ఈ అధిక లాభాలార్జించాలన్న కాంక్ష ప్రబలంగా పని చేసిందని మనం తెలుసుకోవచ్చు. ఐనప్పటికీ ఐరోపా, భారత్‌ల మధ్య వ్యాపారం వేగంగా ముందడుగులు పడలేదు. ఒక ముఖ్య కారణం పోర్చుగల్ ప్రభుత్వమే తన గుత్తాధిపత్యం కింద ఈ వ్యాపారం జరగాలన్న పట్టుదలతో ఉండేది. ఆ పాలకులు చివరికి తమ స్వంత దేశపు వ్యాపారులను సైతం ఆ వ్యాపారంలో అడుగు పెట్టనివ్వలేదు.

పోర్చుగల్ ప్రాబల్యాన్ని నిలువరించాలని ఈజిప్టు సుల్తాను భారతదేశానికి ఒక నౌకా దళ బృందాన్ని పంపాడు. వాటికి తోడుగా గుజరాత్ పాలకుడు కూడా కొన్ని దళాలను పంపాడు. మొదట్లో ఈ దళాలు పోర్చుగల్ నౌకలను నిలవరించాయి. పోర్చుగల్ గవర్నర్ కుమారుడు డాన్ ఆల్మైదాని చంపగలిగాయి. ఐతే సాపేక్షంగా ఆధునిక ఆయుధాలు కలిగివున్న పోర్చుగల్ సైన్యాలు ఈ సంయుక్త నావికాదళాన్ని ఓడించాయి. 1509 నాటకికి పోర్చుగల్ నావికాదళం హిందూ మహాసముద్రంలో ఎదురులేని బలమైన శక్తిగా నిలిచింది. వారు తమ ఆధిపత్యాన్ని పర్షియన్ అఖాతంవరకు,

"దక్షిణాసియాలో తమ విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తూ పోర్చుగీసువారు శ్రీలంకలోని కొలంబోలో కోటను నిర్మించారు. సుమత్రా లోని ఆచిన్, మలక్కా ఓడరేవులలో కూడా స్థావరాలు ఏర్పరచుకున్నారు. పర్షియన్ ఆఖాతంలోకి ప్రవేశించేందుకు ఉన్న మార్గాన్ని నియంత్రించే వ్యూహాత్మక స్థానం ఏడెన్‌లో కోటను నిర్మించారు. ఒకటి, రెండు చోట్ల తప్ప భూభాగాలమీద పట్టు సంపాదించకపోయినా, తమ విస్తరణ వ్యూహం ద్వారా పోర్చుగీసు వారు తాము ఒక ప్రబల శక్తిగా ఉన్నాం అన్న భావనను కలిగింగలిగారు."




ఆపైన ఎర్ర సముద్రం వరకు విస్తరించుకున్నారు. ఈ విధంగా తూర్పున తమ ఆధిపత్యాన్ని గట్టిపరచుకోడానికి పోర్చుగీసువారు పూనుకున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో వారు తమ స్వంత కోటలను నిర్మించుకున్నారు. వాటికి తోడుగా నావికాదళాలను మోహరించారు. ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో ఈ విధంగా చాలా కోటలు వెలిశాయి. ఈ ప్రాంతానికి గవర్నర్‌గా ఆల్బుకర్క్ నియమితుడయ్యాడు. అతడి నాయకత్వంలోనే ఈ విస్తరణ వ్యూహం అమలు జరిగింది. 1510లో ఆల్బుకర్క్ బీజాపూర్ నుండి గోవాను స్వాధీనం చేసుకున్నాడు. సహజమైన ఓడరేవుగా, దుర్భేద్యమైన కోటగా గోవా వారికి ఉపయోగపడింది. ఇక్కడినుంచి పోర్చుగల్ పాలకులు మలబార్ ప్రాంతంలో వ్యాపారాన్ని నియంత్రించగలిగారు. గుజరాత్ ఓడరేవులు కూడా అక్కడకు దగ్గరగానే ఉండడంతో అక్కడివరకూ తమ ప్రాబల్యాన్ని పోర్చుగల్ వారు పెంచుకోగలిగారు. గోవాకు సమీపాన ఉన్న భారత ఉపఖండ ప్రధాన భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని అక్కడ ఉన్న దండా-రాజోరి, దాభోల్ ఓడరేవులను దిగ్బంధనం చేసి బీజాపూర్ సముద్ర వ్యాపారాన్ని నిర్వీర్యం చేశారు.

దక్షిణాసియాలో తమ విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తూ పోర్చుగీసువారు శ్రీలంకలోని కొలంబోలో కోటను నిర్మించారు. సుమత్రా లోని ఆచిన్, మలక్కా ఓడరేవులలో కూడా స్థావరాలు ఏర్పరచుకున్నారు. పర్షియన్ ఆఖాతంలోకి ప్రవేశించేందుకు ఉన్న మార్గాన్ని నియంత్రించే వ్యూహాత్మక స్థానం ఏడెన్‌లో కోటను నిర్మించారు. ఒకటి, రెండు చోట్ల తప్ప భూభాగాలమీద పట్టు సంపాదించకపోయినా, తమ విస్తరణ వ్యూహం ద్వారా పోర్చుగీసువారు తాము ఒక ప్రబల శక్తిగా ఉన్నాం అన్న భావనను కలిగింగలిగారు.


మరోవైపు తురుష్కులు, అరబ్బులు సిరియా, ఈజిప్టు, అరేబియా ప్రాంతాలను తమ చెప్పుచేతలలోకి తెచ్చుకున్నా అనంతరం ఐరోపా ఖండం మీద దృష్టి పెట్టారు. మధ్య ఐరోపాకు కేంద్రంగా ఉన్న వియన్నా (ఆస్ట్రియా రాజధాని)ను స్వాధీనం చేసుకునేవరకూ పోయారు. ఇటు తూర్పున పోర్చుగీసువారి నుండి పెరుగుతున్న ముప్పును గమనించిన గుజరాత్ సుల్తాను తురుష్క సుల్తాన్ సులేమాన్‌తో (ఒట్టోమన్ సామ్రాజ్య అధినేత) రాయబారం నడిపాడు. పోర్చుగీసువారిని అరికట్టడంలో తనకు సహకరించవలసిందిగా కోరాడు. అందుకు స్పందించిన సులేమాన్ ఒక భారీ నావికా దళాన్ని గుజరాత్ సుల్తాన్ బహదూర్‌షాకు మద్దత్తుగా పంపాడు. 1529 నాటికి ఎర్రసముద్రం ప్రాంతం నుండి పోర్చుగీసువారిని తరిమికొట్టిన అనంతరం 1531లో డయ్యూ, డామన్ లమీదకు వచ్చిన పోర్చుగీసువారితో గుజరాత్, తురుష్క సైన్యాలు యుద్ధం చేసి వారిని వెనక్కి తరిమికొట్టాయి. డయు, డామన్ లలో గుజరాత్ సుల్తాను తన గవర్నర్లను నియమించాడు.

ఈ లోపు ఉత్తరాన మొగల్ సామ్రాజ్య విస్తరణ జరుగుతూవచ్చింది. హుమాయూన్ సైన్యాలు గుజరాత్ మీద దాడి చేశాయి. మొగల్ సైన్యాల దాడిని తట్టుకోడానికి గుజరాత్ పాలకుడు పోర్చుగీసువారితో సంధి చేసుకున్నాడు. వారితో కలిసి ఒక సైనిక కూటమిని ఏర్పాటు చేయడమే కాకుండా డయ్యూలో పోర్చుగీసువారు తమ కోటను నిర్మించుకోడానికి అనుమతిని కూడా ఇచ్చాడు. మొగల్ సైన్యాలు గుజరాత్ నుండి వెనక్కి తగ్గిన తర్వాత గుజరాత్ పాలకుడు తన రాజ్యంలో పెరిగిన పోర్చుగీసువారి ప్రాబల్యాన్ని గమనించాడు. వారిని నియంత్రించడానికి మళ్ళీ ఒట్టోమన్ సుల్తానుల సహకారం కోరాడు. అది అందేలోపే డయ్యూ వద్ద 1536లో జరిగిన ఘర్షణలో గుజరాత్ సుల్తాను మరణించాడు. ఆ తర్వాత వచ్చిన తురుష్క సైన్యాలు 1538లో డయ్యూ కోటను స్వాధీనం చేసుకున్నాయి. కాని ఆ సైనిక దళాల అధిపతి దురహంకార వైఖరి కారణంగా గుజరాత్ సుల్తాను వారికి తన మద్దత్తును ఉపసంహరించుకున్నాడు. ఆ తర్వాత డయ్యూ ను ముట్టడించడానికి గోవా నుండి బలమైన పోర్చుగీసు నావికాదళం బయలుదేరింది. ఆ సమాచారం అందగానే తురుష్క దళాలు అక్కడినుండి ఉపసంహరించుకుని తమ దేశానికి వెనక్కి మళ్ళాయి.

మళ్ళీ కొంతకాలానికి, 1551లో ఒకసారి, 1554లో మరొకసారి పోర్చుగీసువారి ఆధిపత్యాన్ని దెబ్బ తీయడానికి ఒట్టోమన్ పాలకులు ప్రయత్నించారు. కాని ఈ లోపు

ఇక్కడ పోర్చుగీసు వారు పుంజుకున్నారు. డయూతోబాటు డామన్‌ను కూడా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. తమ ప్రయత్నాలు విఫలం కావడంతో ఒట్టోమన్ పాలకులు పోర్చుగీసువారితో 1556లో సంధి కుదుర్చుకున్నారు. అరేబియా జలాల్లో పోర్చుగీసువారితో పోటీ లేకుండా వ్యాపారాన్ని పంచుకోడానికి అంగీకారం కుదిరింది. ఆ విధంగా భారత దేశంలో పశ్చిమ తీరాన పోర్చుగీసువారి ప్రాబల్యం స్థిరపడింది. ఐతే ముందే చెప్పినట్టు గోవా ప్రాంతం మినహా తక్కిన భారత భూభాగం మీద రాజకీయ అధికారం కోసం పోర్చుగీసువారు ప్రయత్నించ లేదు. పశ్చిమ తీరం వెంబడి పలు రేవుల్లో తమ కోటలను, గిడ్డంగులను నిర్మించుకుని వాటి రక్షణ కోసం సైన్యాలను మోహరించారు. వారి దృష్టి ప్రధానంగా ఈ ప్రాంతంతో జరిపే వ్యాపారం పైనే కేంద్రీకరించారు.

> **“ పోర్చుగీసువారు ప్రధానంగా మసాలా దినుసులు, మందు గుండు సామగ్రి, యుద్ధగుర్రాల వ్యాపారం మీద కేంద్రీకరించారు. గోవా రేవును ప్రధాన కేంద్రంగా చేయడానికి చాలా ప్రయత్నించారు. తద్వారా ఆ రేవుగుండా పోయే వ్యాపార నౌకలనుండి సుంకాలు వసూలు చేయడానికి ప్రయత్నించారు. ఐతే విశాలమైన హిందూ మహాసముద్రాల మీద పోర్చుగీసువారి పెత్తనం పెద్దగా చెల్లలేదు. అరేబియా సముద్రం గుండా రవాణా అయ్యే ప్రతీ నౌకనూ తనిఖీ చేసే అధికారాన్ని పోర్చుగీసువారు తమకు తామే కట్టబెట్టుకున్నారు. ”**




**భారతదేశం మీద పోర్చుగీసువారి ప్రభావం**

పోర్చుగీసువారు ప్రధానంగా మసాలా దినుసులు, మందుగుండు సామగ్రి, యుద్ధగుర్రాల వ్యాపారం మీద కేంద్రీకరించారు. గోవా రేవును ప్రధాన కేంద్రంగా చేయడానికి చాలా ప్రయత్నించారు. తద్వారా ఆ రేవుగుండా పోయే వ్యాపార నౌకలనుండి సుంకాలు వసూలు చేయడానికి ప్రయత్నించారు. ఐతే విశాలమైన హిందూ మహాసముద్ర జలాల మీద పోర్చుగీసువారి పెత్తనం పెద్దగా చెల్లలేదు. అరేబియా సముద్ర ప్రాంతం గుండా రవాణా అయ్యే ప్రతీ నౌకనూ తనిఖీ చేసే అధికారాన్ని పోర్చుగీసువారు తమకు తామే కట్టబెట్టుకున్నారు. తనిఖీకి ఒప్పుకోని నౌకలను స్వాధీనం చేసుకోడానికి, లేదా వాటిని నడిసముద్రంలో ముంచేయడానికి పూనుకున్నారు. ఆ నౌకల్లోని వారినందరినీ తమ బానిసలుగా మార్చేవారు. ఈ కిరాతక చర్యల వలన భారత భూభాగం మీద పోర్చుగీసువారి పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. బలవంతంగా వ్యవహరిస్తే తమకు కలిగే లాభం కన్నా నష్టమే ఎక్కువ అని గ్రహించిన పోర్చుగీసువారు వెనక్కి తగ్గక తప్పలేదు.

ఆసియా ప్రాంతంలో అప్పటికే కొనసాగుతున్న వ్యాపార పద్ధతులను పోర్చుగీసువారు ఏమాత్రమూ మార్చలేక పోయారు. భారతీయ, అరబ్బు వ్యాపారులదే మొత్తం మీద వ్యాపారంలో పైచేయిగా ఉండేది. మరోపక్క ఐరోపాలో సైతం పోర్చుగీసువారి మసాలా దినుసుల వ్యాపారపు గుత్తాధిపత్యం ఎక్కువకాలం పాటు కొనసాగలేదు. అలాగే గోవాను ప్రధాన వ్యాపార కేంద్రంగా పెంపొందించాలన్న వారి ప్రయత్నాలూ సఫలం కాలేదు. గుజరాత్‌లోని కాంబే, సూరత్ పట్టణాలదే పైచేయిగా ఉండేది. ఐతే మలబార్ నుండి జరిగే వ్యాపారాన్ని మాత్రం నియంత్రించగలిగారు. చిట్టగాంగ్ నుంచి జరిగే బెంగాల్ సముద్ర వ్యాపారాన్ని కూడా కట్టడి చేయగలిగారు. భారత్ నుండి జపాన్‌కు సముద్ర మార్గాన్ని ప్రారంభించారు. ఈ మార్గం ద్వారా వెండి, రాగి పెద్ద ఎత్తున ఆర్జించగలిగారు.

పోర్చుగీసువారి ప్రాబల్యం పెరగకుండా ఉండిపోడానికి బహుశా పోర్చుగల్ దేశంలో పునర్వికాస ఉద్యమ ప్రభావం చాలా పరిమితంగా పడడం ఒక కారణం అయివుండవచ్చు. కానీ పోర్చుగీసువారిని తరిమికొట్టడానికి చేసిన ప్రయత్నాలు ఏవీ విజయవంతం కాలేదు. ఆనాటికి ఆధునికమైన, బలమైన నౌకాదళాన్ని కలిగివుండడమే పోర్చుగీసువారిని నిలబెట్టింది. మొత్తానికి వారు పశ్చిమ తీరంలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

*(తరువాయి వచ్చే సంచికలో)*

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రేమ

క్రిస్టెన్ ఘోడ్సీ



రచయిత అమెరికాలోని హార్వర్డ్ యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్.

నేను జర్మనీకి వచ్చిన ప్రతిసారి ఒక మగ్గు కొంటుంటాను. సాధారణంగా ఇది దగ్గరలోని TK Maxx కి వెళ్లి, నా హెర్బల్ టీ కోసం 4 యూరోల ధరలో ఒక పెద్ద, గట్టి మగ్గు కొనడం అలవాటయిపోయింది. నా నివాసంలో ముందే అమర్చి ఉండే సున్నితమైన యూరోపియన్ కప్పుల్లో నాకు కావాల్సినంత టీ పట్టదు. నా ఎంపిక సింపుల్: అది పెద్ద దిగా, గట్టిగా ఉండాలి. అది ఎలా కనిపిస్తుంది, దానిని ఎవరు తయారు చేశారు అన్నది నాకు ముఖ్యం కాదు. మార్క్సిస్టు పదజాలంలో చెప్పాలంటే, నాకు దాని ఉపయోగ విలువ (use value) మాత్రమే ముఖ్యం.

కానీ నేను స్టైల్‌గా, ఫ్యాన్సీగా కనిపించాలనుకుంటే 125 యూరోల ధర ఉన్న "హెర్మెస్ హెచ్ డెకో రోగ్ నెంబర్ 1" మగ్ కొనగలను. పింగాణీతో అందంగా తయారయిన ఆ కప్పులో నా అల్లం టీ తాగితే, చూసేవారిలో నా సామాజిక హోదా పెరగవచ్చు. అయినా దాని ఉపయోగ విలువ మాత్రం మారదు. నా టీని పట్టుకోవడమే రెండి పని. మార్క్సిస్టు భాషలోనే చెప్పాలంటే, హెర్మెస్ మగ్గుకి నేను అదనంగా చెల్లించాల్సిన 121 యూరోలు ఈ రెండు వస్తువుల మారక విలువ (exchange value) మధ్య తేడాను సూచిస్తుంది.

కార్ల్ మార్క్స్ ఉపయోగ విలువ, మారక విలువ మధ్య తేడా గురించి మాట్లాడినప్పుడు, మన అవసరాలు, కోరికలను తీరుస్తున్న భౌతిక వస్తువులనే ఉదాహరణగా తీసుకుంటాడు. అవి మార్కెట్‌లో మారకానికి వస్తేనే సరుకులుగా (commodities) మారుతాయి. 1857లో ఆయన గోధుమలను ఉదాహరణగా తీసుకుని ఇలా అన్నాడు:

"బానిసలు పండించినా, అర్ధ బానిసలు పండించినా, స్వేచ్ఛా కార్మికులు పండించినా, గోధుమలకు ఉపయోగ విలువ ఒకటే. అవి మంచులా ఆకాశం నుంచి కురిసినా కూడా వాటి ఉపయోగ విలువ పోదు. అయితే ఉపయోగ విలువ ఎలా సరుకుగా మారుతుంది? అది మారక విలువకు వాహకంగా మారినప్పుడు."

అంటే, పెట్టుబడిదారీ విధానం అనే ఆర్థిక వ్యవస్థ అంతర్గతమైన లక్షణం ఏమిటంటే.. సహజంగా, ఉచితంగా, సమృద్ధిగా ఉపయోగ విలువలతో ఉన్న సరుకుల కొరతను సృష్టించి అధిక ధర కట్టే మారక విలువలుగా మార్చడం.

ప్రేమ ఒక భౌతిక వస్తువు కాకపోయినా, అది కూడా పెట్టుబడిదారీ సమాజాల్లోని మారక సంబంధాలకు బయట ఒక ఉపయోగ విలువను కలిగి ఉంటుంది. మనలో చాలామంది ప్రేమను ఇచ్చి, ప్రేమను పొందినవారమే. సాధారణంగా ఇది కుటుంబాల్లో, చిన్నతనం లోనే మొదలవుతుంది . మన చుట్టూ ఉన్నవారి ద్వారా మనం ఆదరణ, గుర్తింపును పొందుతాము. ప్రేమను ఇవ్వడం, స్వీకరించడం మానవ వికాసానికి ఆహారం, నీరు, నివాసం ఎంత అవసరమో అంతే అవసరం. కాబట్టి, సామ్యవాద మార్పు కోసం రూపొందించే ఏ రాజకీయ కార్యక్రమంలోనైనా ప్రేమ ప్రధాన స్థానంలో ఉండాలి. కానీ ప్రేమకు సంబంధించిన సామ్యవాద విశ్లేషణ, రాజకీయాలు రూపొందించాలంటే, మన ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ మన నుంచి ప్రేమను ఇవ్వడానికి, పొందడానికి కావాల్సిన సమయం, శక్తిని ఎలా లాక్కుంటుందో అర్థం చేసుకోవాలి.

ప్రేమ యొక్క ఉపయోగ విలువ, మారక విలువ మధ్య తేడాను స్పష్టంగా చూడడానికి, "ప్రేమ"లో కనీసం మూడు భాగాలు ఉన్నాయని నేను సూచిస్తున్నాను: ఆసక్తి (attention), ఆప్యాయత (affection), పరస్పర ఆదరణ (reciprocal flow). ప్రేమ యొక్క అన్ని రూపాలూ భౌతిక, అలౌకిక, ఆధ్యాత్మిక అన్న మూడు అంశాల కలయికతోనే ఏర్పడతాయి. ఈ మూడు అంశాలన్నింటికీ మార్కెట్‌కు బయట ఉపయోగ విలువ ఉంది. కానీ వీటిలో రెండు మాత్రమే నేరుగా సరుకులుగా మారగలవు. మూడవది అయిన పరస్పర ఆదరణ మాత్రం మారక విలువ పరిధికి అతీతమైనది. పెట్టుబడిదారీ విధానం మనలో ప్రేమను ఎలా మసకబారుస్తుందో అర్థం కావాలంటే , మారక విలువగా మారలేని ఈ ఒక్క ఉపయోగ విలువను అది ఒకేసారి ఎలా దోపిడీ చేస్తుందో, దాని విలువ ఎలా తగ్గిస్తుందో విశ్లేషించాలి.

**ఆసక్తి (attention)ని కొనుక్కోవడం**

ప్రేమలో మొదటి అంశం ఆసక్తి . అంటే ఒక వ్యక్తి తన మానసిక సామర్థ్యాన్ని మరొక వ్యక్తి లేదా వస్తువుపై కేంద్రీకరించడం. మనుషులు ఇతరుల ఆసక్తిని లేక ఇతరులు తనను పట్టించుకోవాలని తీవ్రంగా కోరుకుంటారు. మనకు చెందినవాళ్లు అనే భావన, ఇతరుల ఆసక్తిని పొందడంపైనే ఆధారపడి ఉంటుంది. ఈ కోరిక అంత బలంగా ఉంటుంది కాబట్టి, చాలా మంది ఆసక్తి లేకపోవడం లేక ఇతరులు తమను పట్టించుకోక పోవడంకన్నా ప్రతికూల ఆసక్తికి అంటే ఇతరులు తమను చూసి అసహ్యించుకోడానికైనా ఇష్టపడతారు. ఉదాహరణకు, 2015లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, పని ప్రదేశంలో నిర్లక్ష్యం చెయ్యడం (ostracism) అనేది నేరుగా అవమానించే లేదా వేధించే ప్రవర్తనలకన్నా మానసికంగా మరింత హానికరం అని నిర్ధారించారు. సహోద్యోగులు పట్టించుకోకపోవడం ఉద్యోగుల శారీరక ఆరోగ్యంపైనా, పని పట్ల దృక్పథంపైనా మరింత ప్రతికూల ప్రభావం చూపింది.

ఆసక్తికి ఉపయోగ విలువ స్పష్టంగా ఉంటుంది. మనల్ని ఇతరులు పట్టించుకోవడం, గుర్తించడం మానసిక అవసరం. మన మాటలు వినటం, అభిప్రాయాలు గౌరవించటం అవసరం. 2010లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, మాట్లాడే సమయంలో ఎదురుగా ఉన్నవారు తమ చూపుని పక్కకు తిప్పేయడమే నిర్లక్ష్య భావనను కలిగించి, ఆత్మగౌరవాన్ని తగ్గిస్తుంది అని నిర్ధారించారు. 2021లో చేసిన పరిశోధనలో సామాజిక నిర్లక్ష్యానికి గురైన

వ్యక్తులు శ్రద్ధగా వినడంలో కూడా మార్పు వస్తుందని తేలింది: నిర్లక్ష్యానికి గురైన వ్యక్తులకు ప్రపంచం మరింత నిశ్శబ్దంగా అనిపిస్తుంది.

నేను గుర్తించిన మూడు ప్రేమ అంశాల్లో ఆసక్తిని అత్యంత సులభంగా సరుకుగా మార్చవచ్చు. డబ్బుతో ఆసక్తిని కొనుగోలు చేయవచ్చు, ఆసక్తిని అమ్మడం ద్వారా జీవనోపాధి సంపాదించవచ్చు. థెరపిస్టులు, లైఫ్ కోచ్‌లు, పర్సనల్ ట్రైనర్లు తమ పూర్తి ఆసక్తిని గంటల వారీగా అమ్ముతారు. టారోట్ కార్డు రీడర్లు, జ్యోతిష్కులు కూడా సెషన్‌కు ఇంత అని వసూళ్లు చేస్తారు. తల్లిదండ్రులు పిల్లల సంరక్షణ కోసం ఇతరులకు డబ్బు చెల్లిస్తారు. అమెరికాలో అయితే 'రెంట్ ఎ ఫ్రెండ్ డాట్ కామ్' అనే వెబ్‌సైట్ ద్వారా అలౌకిక ప్రేమను కూడా కొనుగోలు చేయవచ్చు. మనపై దృష్టి పెట్టే రోబోట్లను కూడా మనమే తయారు చేస్తున్నాం. కృత్రిమ మేథ AI ప్రోగ్రామ్‌ల చాట్ లాగ్స్ నిండా వ్యక్తిగత ఒప్పుకోళ్లే కనిపిస్తాయి.

అదే సమయంలో, సంస్థలు, అల్గోరిథంలు, ఆధునిక జీవన అవసరాలు మనం ఆసక్తి కనబరిచేందుకు వినియోగించే సమయాన్ని విపరీతంగా మింగేస్తాయి. ఉద్యోగాలు మనం మేల్కొన్న సమయమంతా పని మీద ఆసక్తి, శ్రద్ధ చూపాలని కోరుకుంటాయి. మిగిలిన ఆసక్తిని సోషల్ మీడియా వేదికలు గుంజుకుని ప్రకటనదారులకు అమ్మేస్తాయి. ఇలా ఆసక్తి కొరతగా మారుతుండటంతో దాని మారక విలువ పెరుగుతుంది. అలసటతో నిండిన రోజుకు చివర్లో, ఎంతో ప్రేమగల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సగం మాత్రమే పట్టించుకుంటారు. స్నేహితులు మెసేజ్‌లకు స్పందించరు. ప్రేమికులు ఒకరినొకరు మాయ చేసుకుంటారు.

ఆసక్తిని కొనుగోలు చేసే వస్తువుగా చూడడం అలవాటు అయితే, ఉచితంగా ఆసక్తిని పంచుకోవాలనే కోరిక తగ్గిపోతుంది. జీవన వ్యయాలు పెరగడంతో ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తోందని, సామాజికంగా కలుసుకునే సమయం తగ్గిపోతుందని హార్వర్డ్ పరిశోధకులు "స్నేహ మాంద్యం" (friendship recession) గురించి చెబుతున్నారు. అమెరికాలోని మహిళల్లో సుమారు 26 శాతం మంది థెరపీకి వెళ్లని పురుషులతో డేటింగ్ చేయడానికి ఇష్టపడటం లేదు. అంటే, ప్రేమ సంబంధాల వల్ల వచ్చిపడే ఆసక్తి భారాన్ని పురుషులతో పంచుకోవాలనే కోరికను సూచిస్తుంది ఇది. రోజురోజుకీ తమ స్నేహితుల ఆసక్తి ఇతరులపై

> **❝ సమాజంలో ధనికులు ఇతరుల ఆసక్తిని కొనుగోలు చేస్తుండగా, ఆసక్తి దొరకని వర్గం పెరుగుతోంది. దీని ఫలితంగా సామాజిక ఒంటరితనం మహమ్మారిలా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 నివేదిక ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ఆరు మందిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు. ఇది ఏటా దాదాపు తొమ్మిది లక్షల అదనపు మరణాలకు కారణమవుతోంది. ❞**



పెరుగుతూ తమ పట్ల తగ్గుతున్నందున వారి సామాజిక సంబంధాలు కుదించుకుపోతున్నాయి.

సమాజంలో ధనికులు ఇతరుల ఆసక్తిని కొనుగోలు చేస్తుండగా, ఆసక్తి దొరకని వర్గం పెరుగుతోంది. దీని ఫలితంగా సామాజిక ఒంటరితనం మహమ్మారిలా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఆరు మందిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు. ఇది ఏటా దాదాపు తొమ్మిది లక్షల అదనపు మరణాలకు కారణమవుతోంది

**ఆప్యాయత, పరస్పర ఆదరణ**

ప్రేమలో మరో ముఖ్యమైన అంశం ఆప్యాయత (affection) ఇది లైంగికత, స్పర్శ, ఓదార్పు, మృదువైన మాటలు, ప్రశంసలు, దయ, శ్రద్ధ, నిబద్ధతను వ్యక్తపరిచే ఎన్నో రూపాలను కలిగి ఉంటుంది. 1958లో ప్రచురితమైన "ది నేచర్ ఆఫ్ లవ్" అనే ప్రసిద్ధ అధ్యయనంలో, అమెరికన్ మానసిక శాస్త్రవేత్త హ్యారీ హార్లో పిల్ల కోతులను రెండు రకాల కృత్రిమ "తల్లులతో" ఉంచి పరిశీలించాడు. ఒకటి పాలిచ్చే వైర్‌తో చేసిన తల్లి, మరొకటి పాలు ఇవ్వని కానీ మృదువైన వస్త్రంతో కప్పిన తల్లి. ఆశ్చర్యకరంగా, ఆ పిల్ల కోతులు ఆహారంకన్నా "ఆప్యాయ స్పర్శ"ను ఎక్కువగా కోరుకున్నాయి.

ఇటీవలి జీవశాస్త్ర–మానవశాస్త్ర పరిశోధనలు కూడా మానవ స్పర్శ శారీరక ఒత్తిడిని తగ్గించగలదని సూచిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ గురుత్వాకర్షణ, అధిక ఎత్తులు, తీవ్రమైన చలి లేదా వేడి వంటి పరిస్థితులు, వాతావరణ సంక్షోభం మానవ శరీర పరిమితులను మరింత పరీక్షిస్తున్న ఈ కాలంలో ఆప్యాయత యొక్క ఉపయోగ విలువ ఇంకా పెరుగుతుంది.

కానీ ఆసక్తి వలె, ఆప్యాయత కూడా సులభంగా సరుకుగా మారుతుంది. జీవన వ్యయం ఆదాయాన్ని మించిపోయే సమాజాల్లో అధిక పని భారంతో, ఆందోళనతో ఉన్న ప్రజలకు సమయం, శక్తి లోపిస్తుంది. అందుకే తమ ఆప్యాయతను స్వీయ సంరక్షణ (సెల్ఫ్ కేర్) కోసం దాచుకుంటారు. ఎవరైనా ఇష్టమైన భోజనం వండాలంటే అది తమకోసమే. నిరంతర పోటీ, ఆర్థిక అస్థిరత మనల్ని డొల్ల చేస్తాయి. ఆప్యాయత కొరతగా మారుతున్న కొద్దీ, దాని మారక విలువ పెరుగుతుంది. అప్పుడు తక్కువ వేతనాల పరిస్థితుల్లో అనేక మంది తమ ఆప్యాయతను శ్రమశక్తిగా అమ్మడం సహజ నిర్ణయంగా మారుతుంది.

దానికి స్పష్టమైన ఉదాహరణ లైంగిక శ్రమ లేదా వేశ్యావృత్తి (sex work). ఇది పెట్టుబడిదారీ విధానానికి ముందే ఉన్నప్పటికీ, నేడు "క్యామింగ్", "ఫిండమ్" వంటి కొత్త రూపాల్లో కనిపిస్తోంది. డబ్బుతో ఇతర రకాల

> “ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన “సోషలిజమే ఎందుకు?” అన్న వ్యాసం లో వ్యక్తి, సమాజం పరస్పర ఆదరణలోనే సహజీవనం కొనసాగి స్తాయని చెప్పాడు. మన ఆలోచనలు, భావాలు, పని సమాజంపైనే ఆధారపడి ఉంటాయి. సమాజమే మానవునికి ఆహారం, బట్టలు, ఇల్లు, పనిచేసే పరికరాలు, భాష, ఆలోచనలు, ఆలోచన కు కావలసిన వస్తువు అన్నిటినీ ఇస్తుంది. శ్రమ వల్లనే మనిషి జీవనం సాధ్యమైంది. గతంలోనూ, ప్రస్తుతం నివసించే కోట్ల మంది సాధిం చినవీ కలిసి “సమాజం” అనే చిన్న పదంలో దాగి ఉన్నాయి. ”

ఆప్యాయత కూడా కొనుగోలు చేయవచ్చు. జపాన్‌లో వ్యాపారవేత్తలు హొస్టెస్ క్లబ్బుల్లో మహిళలకు డబ్బు చెల్లించి, తమను ప్రత్యేకంగా గౌరవంగా అనిపించే మాటలు వినిపించు కుంటారు. సంపద వృత్తిపరమైన మానవ స్పర్శను కూడా కొనుగోలు చేయగలదు. మసాజ్ థెరపీ, స్పా చికిత్సలు, సౌందర్య సేవలు మొదలైనవి. పై 1 శాతం ప్రజలు, కొనుగోలు చేసే ఆప్యాయతతో తమ క్యాలెండర్లను నింపుకుంటున్న కొద్దీ, ఆప్యాయత ఒక విలాస వస్తువుగా, దాచుకునే, మారకం చేసే, ప్రదర్శించే వస్తువుగా – మారుతోంది.

### పరస్పర ఆదరణ

ప్రేమ సంబంధాల్లో ఆసక్తి, ఆప్యాయత రెండూ కలిసి ఒక మూడవ అంశంతో ముడిపడి ఉంటాయి. దానిని నేను పరస్పర ఆదరణ అని పిలుస్తాను. ఇది ఇవ్వడం, పొందడం మధ్య సహజంగా సాగే చర్య. ఇది సృజనాత్మకమైనది, ఉత్పాదకమైనది. మనం ఎంత ఎక్కువ శ్రద్ధ, ఆప్యాయత పొందితే, అంత ఎక్కువ ఇవ్వాలనే ప్రేరణ కలుగుతుంది. అలాగే విరుద్ధంగా కూడా జరుగుతుంది. అంటే ఎంత తక్కువ శ్రద్ధ, ఆప్యాయత పొందితే, అంత తక్కువ ఇవ్వాలనే ప్రేరణ కలుగుతుంది.

ఇలాంటి పరస్పర ఆదరణ ప్రకృతిలో ఎక్కడ చూసినా కనిపిస్తుంది. భూమి చెట్లను పోషిస్తుంది. చెట్లు తమ ఆకులు, ఫలాలను నేలకి అర్పిస్తాయి. తేనెటీగలు పువ్వుల నుంచి తేనె సేకరిస్తూ, అదే సమయంలో పరాగసం పర్కం ద్వారా మొక్కల జీవనాన్ని కొనసాగి స్తాయి. మనుషులు ఆక్సిజన్ పీల్చి కార్బన్ డయాక్సైడ్ విడిచిపెడతారు. మొక్కలు కార్బన్ డయాక్సైడ్ తీసుకుని ఆక్సిజన్ విడుదల చేస్తాయి. మొత్తం పర్యావరణ వ్యవస్థలే ఈ పరస్పర ఆదరణపై ఆధారపడి ఉంటాయి.

పరస్పర ఆదరణ యొక్క ఉపయోగ విలువ ఏమిటంటే, ఇది సహకారాన్ని సాధ్యం చేస్తుంది, సమతుల్యతను కాపాడుతుంది. సైబీరియాలో తన ప్రయాణాల్లో రష్యన్ భూగోళ శాస్త్రవేత్త ప్యోటర్ క్రోపోట్కిన్, కఠినమైన వాతావరణంలో జంతువులు ఎలా పరస్పరం సహకరించుకుంటాయో గమనించాడు. అలాగే పరిశోధనల ప్రకారం, పిల్లలు కూడా అటువంటి సహకారభావంతోనే జంతువులకు సహాయం చేస్తారు.

నా జీవితంలో కుక్కలతో ఏర్పడిన బంధం లోనూ ఇదే పరస్పర ఆదరణను గమనించాను. 2024లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, పోలీసు పనిలో ఉండే కుక్కలతో గడిపిన అమెరికన్ సైనిక వెటరన్లలో ఆందోళన, డిప్రెషన్ లక్షణాలు గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఒత్తిడి తగ్గించడానికి నా విశ్వవిద్యాలయం థెరపీ కుక్కలను తీసుకువస్తుంది. కుక్కను తాకడం వల్ల కుక్కకు మనకూ కూడా సమానంగా ఆనందాన్ని ఇస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. కుక్క మనల్ని తిరిగి తాకక పోయినా, ఆ అనుభవం పరస్పర ఆప్యాయత అనే శక్తిని సృష్టిస్తుంది.

### మనమంతా కలిసే ఉన్నాం

పరస్పర ఆదరణ అనేది “పరస్పర లావాదేవీ” కాదు. లావాదేవీ అంటే ఎవరు ఎంత ఇచ్చారు, ఎంత పొందారు అనే లెక్క. పరస్పర ఆదరణలో మాత్రం తాత్కాలిక అసమతుల్యతకు అవకాశం ఉంటుంది, ఎందుకంటే ఇది కాలంతో పాటు కొనసాగే సంబంధాల్లో నెలకొంటుంది. పిల్లలతో తల్లి దండ్రుల సంబంధం, పెంపుడు జంతువులతో బంధం దీనికి ఉదాహరణలు.

మంచి సంభాషణ కూడా పరస్పర ఆదరణకు చిన్న రూపమే. చిన్న పిల్లలు అసాధారణమైన ఆదరణ, ఆప్యాయతలను కోరుకుంటారు. తల్లిదండ్రులు కూడా వారిని ఆప్యాయతానురాగాలతో పెంచడంలో ఆనందం పొందుతారు. (ఇది లేకపోతే మన మనుష్య జాతే బ్రతకదు కదా!) ఈ ఆప్యాయ తానురాగాల ఇచ్చిపుచ్చుకోవడాల వల్లనే అనేక దశాబ్దాల పాటు తరాల మధ్య సంబంధాలు కూడా కొనసాగుతాయి.

ఒక గొప్ప చర్చ జరుగుతున్నదంటే అది కూడా ఇచ్చిపుచ్చుకోవడం యొక్క సూక్ష్మ రూపమే. ఇందులో ఆలోచించడం, మాట్లా డ్డం, వినడం, ప్రతిస్పందించడం అన్నీ ఒకరి నుండి మరొకరికి మార్పిడి జరుగుతుంటాయి. మనందరం సంగతులు చెప్పుకుంటుంటాం, కథలు, భావాలు వింటుంటాం. సానుభూతి, సలహాలు కోరుకుంటాం. వీటిలో ఎక్కడా వాటి మారకపు విలువ గురించి పట్టించుకోం. అంటే వాటి వల్ల మనకు ఏం వస్తుంది అని లెక్కలు వేసుకోం.

సృజనాత్మక రంగాల్లో జాజ్ జామ్ సెషన్లు, సామాన్య బాల్‌రూమ్ డ్యాన్సులు కూడా ఇదే ఆనందాన్ని ఇస్తాయి. పిల్లల ఆటల్లో అత్యంత ముఖ్యమైన దశ “సహకార ఆట” లేదా “పరస్పర ఆట”. కలిసి కల్పిత లోకాలలో గంటల తరబడి మునిగిపోవడం ద్వారా పిల్లలు సామాజిక నైపుణ్యాలను నేర్చుకుంటారని పిల్లల మానసిక శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన “సోషలిజమే ఎందుకు?” అన్న వ్యాసంలో వ్యక్తి, సమాజం పరస్పర ఆదరణలోనే సహజీవనం కొనసాగిస్తాయని చెప్పాడు. మన ఆలోచనలు, భావాలు, పని అన్నీ సమాజంపైనే ఆధారపడి ఉంటాయి. సమాజమే మానవునికి ఆహారం, బట్టలు, ఇల్లు, పనిచేసే పరికరాలు, భాష, ఆలోచనలు, ఆలోచనకు కావలసిన వస్తువు అన్నిటినీ ఇస్తుంది. శ్రమ వల్లనే మనిషి జీవనం సాధ్యమైంది. గతంలోనూ, ప్రస్తుతం నివసించే అనేక లక్షల కోట్ల మంది సాధించినవీ కలిసి “సమాజం” అనే చిన్న పదంలో దాగి ఉన్నాయి. అయినా పెట్టుబడిదారీ విధానం మనకు ఈ సహజ బంధాన్ని ప్రమాదంగా అనిపించేలా చేస్తుంది.

స్నేహం, ప్రేమలకు సంబంధించి చూస్తే మనం దీర్ఘకాలం కలిసి జీవించడం, సాన్నిహిత్యాలవల్ల అటువంటి ఇచ్చిపుచ్చుకునే సంబంధాల్లోకి వెళతాము. ఇటువంటి సంబంధాల్లోకి వెళ్లడానికి కారణాలు అనేక ఉండవచ్చు. (భౌతిక ఆకర్షణ, ఒకే రకమైన రాజకీయ అభిప్రాయాలు, ఒకేరకమైన మేధోపరమైన ఆసక్తులు వంటి వాటివల్ల). అయితే పరస్పర ప్రేమానురాగాలు కాలంతోపాటే పెరుగుతుంటాయి. అయితే పెంపుడు జంతువుల్లోనూ, పిల్లలోనూ మాదిరిగా కాకుండా వయోజనుల్లో ఈ

సంబంధాలు కొంత అస్థిరంగా ఉంటాయి. ఈ సంబంధం నుండి ఎవరైనా ఎప్పుడైనా వెనక్కి తగ్గొచ్చు. ఇలా వెనక్కి తగ్గడానికి స్వాతిశయం, దురాశ, హింస వంటి అనేక మానసిక కారణాలు ఉండవచ్చు.

> ❝ ప్రేమలోని ఆసక్తి, ఆప్యాయత సరుకులుగా మారవచ్చు. కానీ పరస్పర ఆదరణ మాత్రం సరుకుగా మారలేదు. దానికి ధర కట్టిన క్షణమే అది నశిస్తుంది. "ఉచిత ఆలింగనం" అని బోర్డు పెట్టి పక్కనే విరాళాల డబ్బా ఉంచినట్లయితే అది ఇక ఉచితం కాదు. ఇదే పెట్టుబడిదారీ విధానానికి పెద్ద సమస్య. ఒకవైపు, పరస్పర ఆదరణ విలువను అంగీకరిస్తుంది. మరో వైపు, దానికి ధర కట్టలేకపోవడం వల్ల దాని ఉపయోగ విలువను తగ్గించడానికి ప్రయత్నిస్తుంది. ❞

**ప్రేమ అమ్మకానికి కాదు**

ప్రేమలోని ఆసక్తి, ఆప్యాయత సరుకులుగా మారవచ్చు. కానీ పరస్పర ఆదరణ మాత్రం సరుకుగా మారలేదు. దానికి ధర కట్టిన క్షణమే అది నశిస్తుంది. "ఉచిత ఆలింగనం" అని బోర్డు పెట్టి పక్కనే విరాళాల డబ్బా ఉంచినట్లయితే అది ఇక ఉచితం కాదు.

ఇదే పెట్టుబడిదారీ విధానానికి పెద్ద సమస్య. ఒకవైపు, పరస్పర ఆదరణ విలువను అంగీకరిస్తుంది. మరోవైపు, దానికి ధర కట్టలేకపోవడం వల్ల దాని ఉపయోగ విలువను తగ్గించడానికి ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా మహిళల సంరక్షణ శ్రమను "ప్రేమ" పేరుతో ఉచితంగా వదిలేయడం దీని ఉదాహరణ.

కఠినమైన, అసమాన సమాజాల్లో మనం ఉదారంగా ఉండటానికి భయపడతాం. దయను బలహీనతగా చూస్తారు. అందుకే "టాక్సిక్" సంబంధాలనుంచి బయటపడమని, అవసరార్థ సంబంధాల కోసం ఎదురు చూసే మనుషులను దూరంగా పెట్టమని నేర్పిస్తారు. ఆసక్తి, ఆప్యాయతకు ధర పెరిగినప్పుడు, వాటిని ఉచితంగా పంచుకోవడం మూర్ఖత్వంగా కనిపిస్తుంది.

**పెట్టుబడిదారీ విధానాన్ని మించిన ప్రేమ**

న్యాయమైన, సమానత్వ సమాజాలే పరస్పర ఆదరణకు అవసరమైన పరిస్థితులను సృష్టిస్తాయి. భద్రత, విశ్రాంతి, సమయమున్నప్పుడే మనం లెక్కలు లేకుండా ఇవ్వగలుగుతాం. అందుకే కుటుంబాలతో, పాత స్నేహితులతో మన సంబంధాలు మెరుగుపడతాయి.

మార్క్స్, ఎంగెల్స్, అలెగ్జాండ్రా కొలంటై, ఐన్‌స్టీన్ అందరూ పెట్టుబడిదారీ విధానం ప్రేమను ఎలా వక్రీకరిస్తుందో గుర్తించారు. ఇది మనల్ని అసురక్షితంగా, ఒంటరిగా, తేలికపాటి ఆనందాలనుంచి దూరం చేస్తుంది.

సోషలిజంలో మనకు ఎక్కువ పరస్పర ఆదరణ లభిస్తుంది. ఆసక్తి, ఆప్యాయతల మధ్య ఉపయోగ విలువ, మారక విలువ మధ్య తేడా తగ్గుతుంది. చివరికి, మనకు కావాల్సింది కొత్త ప్రేమ రాజకీయాలు. లాభం, నిల్వ, పోటీకి వ్యతిరేకంగా నిలిచే ప్రేమ రాజకీయాలు.

పెట్టుబడిదారీ విధానం అనే కొరత వ్యవస్థను దాటి, మనమంతా సమయం, సామీప్యం ఉదారంగా ఇవ్వడం, పొందడం అనే సహజ పరిణామాన్ని ఆస్వాదించగల ప్రపంచం కోసం పోరాడాల్సిందే.

(అనువాదం: కె.సత్యరంజన్)

# సోషలిస్టు పరివర్తనకోసం తహతహ లాడుతున్న ప్రపంచం

*(14వ పేజీ తరువాయి)*

మారణకాండను ఎదుర్కొంటున్న పాలస్తీనీయులు, తమకు వస్తున్న అల్పాదాయంతో జీవితం గడపలేక తమ ఇళ్ళలోనే పస్తులతో మరణిస్తూ వందల కోట్లమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


ఇదే సమయంలో చైనా నుండి స్పష్టమైన సందేశం వస్తున్నది. మానవజాతికి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించటం కోసం మనం శాంతి, అభివృద్ధి కోసం కృషి చేయాలని చెబుతున్నది. ఈ పిలుపు ప్రపంచంలోని ప్రజలందరినీ అంతకంతకూ ఎక్కువగా ఆకర్షిస్తున్నది. నూతన రూపంలో ఉన్న ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు ఈ విషయంలో వాస్తవానికి దూరంగా ఉన్నారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి ఉదారవాద భాష, నియంతృత్వం అన్న భావన నుండి బయటపడలేక పోతున్నారు. అన్ని విధాలైన కడగండ్లను ఎదుర్కొంటూ చైనా, వియత్నాం లాంటి దేశాలు సాధించిన అద్భుతమైన పురోగతిని చూడలేకున్నారు. ఈ దేశాల్లో ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేసి, ప్రజలను దరిద్రం నుండి విముక్తి చేశారు. ప్రపంచీకరణ, నయా-వలస విధానాల భారాల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద దేశాలలో అత్యధికులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంతో పాటు ఆర్థిక, సాంకేతిక రంగాలలో కలిసి పని చేస్తున్నారు. చైనా, ఆసియా దేశాలు మాత్రమే ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేవు. అభివృద్ధికి సిద్ధంగా ఉన్న నమూనాను అవి అందించలేవు. కానీ వారు ప్రపంచానికి శాంతి, అభివృద్ధికి అవసరమైన దృక్పథాన్ని అందించగలరు. పాత ఉత్తర అట్లాంటిక్ దేశాలు ఉదారవాదం, పొదుపు, రుణం, యుద్ధాల పేరుతో అందిస్తున్న వాటి కన్నా ఇవి వారికి అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి.

నూతన ఉదారవాదులు, సోషల్ డెమోక్రాట్లు ప్రజా ఉద్యమాలను నిర్మించటం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించాలని భావించటం లేదు. ఉదారవాద ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికలలో పాల్గొనటం ద్వారా అధికారం సాధించవచ్చునని వారు నమ్ముతున్నారు. మౌలికంగా సోషలిజం లక్ష్యం నుండి, సోషలిజం చరిత్ర నుండి, తమ అభివృద్ధి క్రమంలో సోషలిస్ట దేశాలు సాధించిన అనుభవాల నుండి దూరం కావటం ద్వారా దీనిని సాధించవచ్చునని వారు భావిస్తున్నారు. కానీ అది పైపై రాజ్యాధికారం మాత్రమే. ఒక రాజకీయ పార్టీని, ప్రజా ఉద్యమాలను నిర్మించకుండా, స్పష్టమైన లక్ష్యం, విశ్వాసం, మానవులకు పూర్తి గౌరవం కల్పించే దృక్పధం లేకుండా, పార్టీ వెనుక ప్రజా పునాది లేకుండా అధికారంలో ఉండటం అంటే అది నిజమైన అధికారం లేకుండా, కేవలం ఆఫీసులో కూర్చోవటమే అవుతుంది. ఆశాజనకమైన భవిష్యత్‌ను నిర్మించటానికి వర్గ పోరాటం అసలైన యుద్ధరంగంగా ఉంటుంది. ఇటువంటి వర్గపోరాటం ద్వారానే సోషలిజం వైపు సాగిపోవాలని ప్రపంచం కోరుకుంటున్నది.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

# దైవ స్వరూపుడైన మోడీ గారు

బద్రి రైనా



రచయిత ఢిల్లీ యూనివర్శిటీలో అధ్యాపకునిగా పనిచేశారు, మంచి రచయిత

డొనాల్డ్ ట్రంప్‌కూ నరేంద్ర మోడీకీ మధ్య తేడా ఇదీ: "నేను మొదటి నుండీ నియంతనే" అని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ దాపరికం లేకుండా ప్రకటించారు.

ఆసియా ఖండపు తెలివితేటలను పుణికి పుచ్చు కున్న నరేంద్ర మోడీ మాత్రం తాను రాజ్యాంగ బద్ద పాలనకు కట్టుబడి ఉంటానని నమ్మకంగా చెబుతుంటారు. కానీ ఆయన రోజువారీ పరిపాలనా పద్ధతిని చూస్తే మాత్రం క్రింది స్థాయిలో అధికారాల వికేంద్రీకరణను అడ్డుకోడానికే ప్రయత్నించడం కనిపిస్తుంది.

బీహార్‌లో భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి చెందిన కొత్త హోమ్ శాఖా మంత్రి శ్రీమాన్ సామ్రాట్ చౌదరిగారు అధికారం చేపట్టిన తరువాత ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా ఉత్తర ప్రదేశ్ నుండి బుల్‌డోజర్ రాజ్‌ను దిగుమతి చేసుకున్నారు. పాట్నా, దర్భంగా, బెగుసరాయ్, ముజఫర్‌పూర్, ఛాప్రాలలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇళ్లపైకి బుల్‌డోజర్లు పంపారు. ఈ ప్రాంతాలన్నీ బుల్‌డోజర్ హింసాకాండ కింద నలిగిపోతున్నాయి.

ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను గమనిస్తే ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయో చెబుతాయి.

కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా బీహార్ ప్రభుత్వం ఇటువంటి అగత్యాలకు పాల్పడుతుందని భావించడం కష్టం.

దేశంలో బుల్‌డోజర్ రాజ్‌ను తీవ్రంగా విమర్శించడం తన హయాంలో తాను చేసిన గొప్ప పనిగా పరిగణిస్తున్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ గవాయ్‌గారు తన విమర్శల వల్ల దేశంలో కించిత్ మార్పు కూడా రానందుకు చింతాక్రాంతుడవుతుండవచ్చు.

అయ్యో! మా కొంపలు కూల్చేస్తున్నారే అని బావురు మంటున్న బీహార్ ప్రజలు ముఖ్యంగా మహిళలు మొన్న జరిగిన ఎన్నికల్లో నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ)కు ఎందుకు ఓట్లేశామురా దేవుడా అని చింతవచ్చుగాక కానీ ఇది ఎన్నికలకు ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి ఎన్నికల తరువాత వారిని గాలికొదిలేసిన ఘటనలకు ఒక మంచి ఉదాహరణగా ఉపయోగపడుతుంది.

అంతేకాదు మోడీగారు అనేకానేక మితవాద సంస్థల తోడ్పాటుతో వాగ్దానాలు చేసి, తరువాత వాటిని చెత్తకుప్పలో పడేసే సామర్థ్యాన్ని ఎంతబాగా సంపాదించారో చెప్పడానికి కూడా ఇది గొప్ప ఉదాహరణ.

ఆయన తన పాలనలో పౌరులను భక్తులుగా మార్చగలిగారు. ఇంత ఘనకార్యం ఎలా సాధ్యమైంది? పండుగలు, పబ్బాలను ప్రభుత్వమే ప్రోత్సహించడం, దానికోసం ఏడాదంతా యాత్రలు నిర్వహించడం ద్వారా దీన్ని సాధించగలిగారు.

ఇక దేవుళ్ల మీదా, దేవతలమీదా ప్రజలకు భక్తి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ప్రాయోజిత భక్తి మాత్రం శ్రీ మోడీ గారి మీదనే పెరుగుతోంది. ఆయన దాదాపు దైవ స్వరూపుడైపోయారు. ఆయన సైగ చేస్తే చాలు సుపరిపాలన, చట్టబద్ద పాలన దానికదే వచ్చేస్తుంది.

రాజకీయాల్లో "భక్తి" నిరంకుశత్వానికి రాచమార్గం అని భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హెచ్చరించిన విషయాన్ని మనం ఇక్కడ ఒక సారి మననం చేసుకోవాల్సి ఉంది.

ప్రజల్లో, ముఖ్యంగా హిందీ ప్రాంతంలో దైవ భక్తిని రాజకీయ భక్తిగా మార్చే గొప్ప లాఘవమిది. విశేషమేమంటే అలా మారుతున్నట్లు మారిపోయినవారికి కూడా తెలీదు. "మోడీ గ్యారంటీ" లాంటి నినాదాలను అప్పుడప్పుడూ ఇస్తుండడం ద్వారా దైవ భక్తినీ, రాజకీయ విధేయతనూ కలిపేస్తున్నారు. ఈ విధంగా రాజ్యాంగానికి తెలియకుండానే అన్ని అవతారాలూ ఏకమైపోతున్నాయి.

ఇప్పుడిక సంచార్ సాథీ యాప్ గురించి చెప్పుకుందాం. స్మార్ట్ ఫోన్‌ల ఉత్పత్తి సమయంలోనే వాటిలో ప్రభుత్వప్రాయోజిత సంచార్ సాథి యాప్‌ను తప్పకుండా "ప్రీఇన్‌స్టాల్" చేయాలనీ, ఇప్పటికే పనిచేస్తున్న స్మార్ట్ ఫోన్‌లలో వాటి సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేసేటప్పుడు ఎక్కించాలనీ మోడీ ప్రభుత్వం స్మార్ట్ ఫోన్ ఉత్పత్తిదారులకు రహస్య ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్‌ను ఆపడం గానీ, పరిమితం చేయడం గానీ సాధ్యం కాదు. అంటే వినియోగదారునికి ఈ యాప్‌పై ఎటువంటి అదుపు ఉండదు. అది ఎలా పనిచేస్తే అలా చేస్తుంది. వినియోగదారుడు చూస్తూ ఉండడం మినహా మరేమీ చేయలేడు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఈ విషయాన్ని వెంటనే పసిగట్టింది. విషయం "కోర్టుకు దాకా వెళ్లక ముందే" ప్రభుత్వం వెనక్కు తగ్గాలని హెచ్చరిస్తూ (డిసెంబర్ 3న) సంపాదకీయం రాసింది. వార్త బయటకు పొక్కడంతో గౌరవనీయులైన మంత్రిగారు హడావిడిగా మీడియా ముందుకు వెళ్లి ఈ యాప్ వేసుకోవడం స్వచ్ఛందం మాత్రమేననీ దాన్ని మీ ఫోన్‌లో ఉంచుకుంటారో లేదో మీ ఇష్టం అని చెప్పారు. కానీ దౌర్భాగ్యం ఏమంటే, ఉత్పత్తి దారులకు జారీ చేసిన ఆదేశంలోని సెక్షన్ 7(బి) దాన్ని వినియోగదారులు ఫోన్‌లో వాడడం తప్పనిసరి చేసింది.

దాంతో పెద్ద అలజడి చెలరేగింది. ప్రభుత్వం వెంటనే యాప్‌ను తప్పనిసరిగా ప్రి-ఇన్‌స్టాల్ చేయాలన్న నిబంధనను తొలగించింది.

అదే డొనాల్డ్ ట్రంప్ అయ్యుంటేనా! ఈ యాప్‌ని ప్రజల జీవితాల్లోకి తొంగిచూడ్డానికి అంటే వాళ్ల మెసేజ్‌లు, రికార్డులు, వీడియోలు, ఫోటో గ్యాలరీలు ఒకటేమిటి అన్నిటినీ తనిఖీ చేయడానికి తానే చేయించానని నేరుగా చెప్పేసేవాడు.

కానీ మోడీ ప్రభుత్వం అలా చెప్పదు. చూడండి బాబులూ ఆ యాప్ అమాయకురాలు. అన్ని రకాల మోసాలనుండి వినియోగదారులను రక్షించడానికి మేమే దాన్ని మీ మీద దయతో ప్రి-ఇన్‌స్టాల్ చేయించాము. ఒక వేళ ఈ క్రమంలో పెద్దన్న గారు పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకుంటే మాత్రం ఏమవుతుంది, ప్రమాదమేముంటుంది? అంటుంది.

పౌరుల వ్యక్తిగత సమాచార రక్షణ అనేది "ప్రాథమిక హక్కు" అని సుప్రీం కోర్టు చెప్పి ఉండవచ్చు గాక, కానీ అంధ భక్తులు ఇటువంటి ఇహలోక న్యాయాలు, హక్కులకు అతీతంగా సెక్యులర్ దేవుడు చెప్పే మాటలనే నమ్ముతారు.

*(మిగతా 24వ పేజీలో)*

# పెరుగుతున్న నియంతృత్వ ధోరణులు



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటోరియల్ బాధ్యులు

ఎ.కోటిరెడ్డి

ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఎన్నికల నిర్వహణకు బాధ్యత వహించే ఎన్నికల కమిషన్ పనితీరును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూర్తిగా మార్చివేసింది. గతంలో దేశంలో ఓటర్ల జాబితాను సవరించటం, పంచాయితీ నుండి పార్లమెంటు వరకు వివిధ స్థాయి ఎన్నికలు నిర్వహించటానికి స్వతంత్రంగా పనిచేసే ఎన్నికల కమిషన్‌ను ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనిచేసే తొత్తు సంస్థగా మార్చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న తంతు ఆచరణలో పౌరసత్వ చట్టంలో చేసిన సవరణలకు అనుగుణంగా సాగుతున్నది.

ఓటర్ల జాబితాను సవరించే పద్ధతిని పూర్తిగా మార్చివేశారు. గతంలో అర్హులైన వయోజనులను ఓటర్లుగా చేర్చే బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉండేది. ఓటర్లను నమోదు చేయటం కోసం నియమించిన అధికారులు గ్రామాలు, పట్టణాలు, నగరాలలో ఇంటింటికీ తిరిగి, వయోజనులందరినీ ఓటర్లుగా నమోదు చేసేవారు. ఇప్పుడు ఓటర్లుగా నమోదు చేసుకోవలసిన బాధ్యతను పౌరులపై పెట్టారు. ఎన్నికల కమిషన్ చెప్పిన గుర్తింపు కార్డులు చూపించి, ప్రతివారూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి. ఎటువంటి గుర్తింపు పత్రాలు లేక చాలా మంది పేదలు ఓటర్లుగా నమోదు చేయించుకోలేకపోతున్నారు. బీహార్‌లో శాసనసభ ఎన్నికలకు ముందు జరిగిన సమగ్ర, ప్రత్యేక సవరణలో 65 లక్షల మందిని ఓటర్ల జాబితా నుండి తొలగించారు. జీవనోపాధి కోసం వలసలు వెళ్ళిన వారు, నిరుపేదలుగా ఉన్నవారు, మహిళలు, మైనారిటీలు ఎక్కువ మంది ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేయించుకోలేకపోయారు. లక్షలాది మందిని ఓటర్ల జాబితా నుండి తొలగించటంతో ఎన్‌డిఎ కూటమి ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో విజయం సాధించటం సులభమైందని నిపుణులు విశ్లేషించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా నుండి 58 లక్షల మందిని మినహాయించారు. ఈ విధంగా దేశవ్యాపితంగా కోట్లాది మంది అర్హులైన వయోజనులను ఓటర్ల జాబితాలో చేర్చకుండా మినహాయించటం ద్వారా ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యానికి, ప్రజల ఓటుహక్కుకు విఘాతం కలిగిస్తున్నది.

2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో అక్రమాలు జరిగాయని, వాటిని నివారించి ఉన్నట్లైతే బిజెపికి మరొక 67 స్థానాలు తగ్గేవని నిపుణులు విశ్లేషించారు. ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో కూడా అనేక అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. పోలింగ్ చివరి నిమిషాలలో పెద్దమొత్తంలో ఓట్లు పోలైనట్లు, ఏ విధమైన అక్రమాలు జరగకపోతే అంత తక్కువ సమయంలో, అంత ఎక్కువ శాతం ఓట్లు పోలయే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ ఇచ్చిన సమాచారం స్పష్టం చేస్తున్నది. ఎన్నికల ప్రచారంలో ప్రధాని, హోంమంత్రి, ఇతర బిజెపి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, నాయకులు కులాలు, మతాలను రెచ్చగొడుతూ ప్రచారం చేశారు. అయినా ఎన్నికల సంఘం వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ప్రతిపక్షాల నాయకులపై అధికారపక్షం చేసిన ఆరోపణలపై మాత్రం తక్షణమే చర్యలు తీసుకున్నది. ఈ విధంగా ఎన్నికల కమిషన్ పక్షపాతంతో పాలక పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నది.

ఇడి, ఎన్ఐఎ, సిబిఐ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలైనప్పటికీ, కొంత మేరకు స్వతంత్ర ప్రతిపత్తితో పని చేస్తుండేవి. తమ వద్దకు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరిపేవి. మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి వ్యతిరేకులను, ప్రభుత్వ విధానాలను విమర్శించేవారిని వేధించటానికి ఈ సంస్థలను ఉపయోగిస్తున్నారు. 2017లో యుపిలోని ఉన్నావోలో జరిగిన హత్య, హింసాకాండను రిపోర్టు చేయటానికి వచ్చిన జర్నలిస్టు కప్పన్‌పై నాన్ బెయిలబుల్ సెక్షన్‌లు పెట్టి, ప్రభుత్వం సంవత్సరాల తరబడి జైలులో నిర్బంధించింది. బీమా కొరేగావ్ కేసులో నిర్బంధంలో ఉన్నవారికి ఆ కేసుతో ఏ మాత్రం సంబంధం లేదు. అయినా దీర్ఘకాలం జైళ్ళలో నిర్బంధించబడ్డారు.

### పార్లమెంటులో చర్చలను ప్రహసనంగా దిగజార్చారు

ప్రజల సమస్యలు, ప్రభుత్వం చేస్తున్న విధాన పరమైన నిర్ణయాలపై పార్లమెంటులో గతంలో కొంత మేరకు వివరంగా చర్చలు జరిగేవి. చట్టాలలో చేస్తున్న మార్పులు, కొత్త చట్టాలు చేసేటపుడు ఆ చట్టాల అవసరం, వాటిలో చేర్చవలసిన అంశాలను గురించి పార్లమెంటులో చర్చించటం, ప్రతిపక్షాల అభిప్రాయాలకు కూడా స్థానం కల్పించటం, అవసరమని భావించిన వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి, లోతుగా చర్చించటం జరిగేది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చారు. ప్రధానమైన అంశాలపై జరిగే చర్చలు, కొత్త చట్టాలు, పాత చట్టాలలో చేస్తున్న మార్పులపై పార్లమెంటులో చర్చలను ప్రహసనంగా మార్చారు. హఠాత్తుగా బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టటం, చర్చకు ప్రతిపక్షాలకు అవకాశాన్ని నిరాకరించటం, బిల్లును ప్రవేశపెట్టిన రోజు, లేదా మరుసటి రోజు తమకున్న మందబలంతో వాటిని ఆమోదించడం జరుగుతోంది.

ఈ విధంగా ఆమోదిస్తున్న చట్టాలన్నీ ప్రజా ప్రయోజనాలకు హాని కలిగించేవే. కోవిడ్–19 సంక్షోభ సమయంలో ఆమోదించిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు ఈ కోవకు చెందుతాయి. దేశంలోని రైతాంగం అంతా ఏకతాటిపైకి వచ్చి ఈ చట్టాలను ప్రతిఘటించింది. ఇదే కాలంలో కార్మికవర్గం శతాబ్ద కాలానికి పైగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులన్నింటినీ హరించటం కోసం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారు. రైతు వ్యతిరేక చట్టాల మాదిరిగానే వాటిపైనా వివరంగా చర్చలు జరగలేదు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ

**"న్యాయవ్యవస్థను కూడా ఈ విధంగానే దిగజార్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవాలతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి, పైస్థాయిలో ఉన్నవారికి అనుకూలంగా తీర్పులు ఇవ్వాలని వత్తిడి చేస్తున్నారు. అనేకమంది న్యాయమూర్తులపై తీవ్రమైన ఒత్తిళ్ళు, బెదిరిం పుల చేస్తున్నారు. వివిధ సందర్భాలలో కేసులలో వస్తున్న తీర్పులు, అయోధ్య మసీదు స్థలంపై తీర్పు, జస్టిస్‌లోయా హత్య తదితరాలు న్యాయ వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను తెలియ జేస్తున్నాయి."**

ఉపాధి చట్టాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో తీసు కొచ్చిన విబి జి రామ్ జి పథకం ఆమోదం విషయంలో కూడా ఇదే విధంగా వ్యవహరిం చారు. ఎంజిఎన్ రెగా రద్దు వలన గ్రామీణ ప్రాంతంలో వినాశకరమైన ఫలితాలు సంభ విస్తాయి. గ్రామాలలో నిరుద్యోగం తాండవించ టంతో పాటు ఆకలి చావులు, ఆత్మహత్యలకు కేంద్రంగా మారతాయి.

న్యాయవ్యవస్థను కూడా ఈ విధంగానే దిగజార్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవాలతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి, పైస్థాయిలో ఉన్నవారికి అనుకూలంగా తీర్పులు ఇవ్వాలని వత్తిడి చేస్తున్నారు. అనేకమంది న్యాయమూర్తులపై తీవ్రమైన ఒత్తిళ్ళు, బెదిరిం పుల చేస్తున్నారు. వివిధ సందర్భాలలో కేసులలో వస్తున్న తీర్పులు, అయోధ్య మసీదు స్థలంపై తీర్పు, జస్టిస్‌లోయా హత్య తదితరాలు న్యాయ వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను తెలియ జేస్తున్నాయి. ఇడి, సిబిఐ తరహాలోనే న్యాయ వ్యవస్థను కూడా తమ చెప్పుచేతల్లో పెట్టుకొని, రాజకీయ వ్యతిరేకులపై ప్రయో గించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

అనేక బిజెపి పాలిత రాష్ట్రాలలో చట్టా లతో నిమిత్తం లేకుండా ప్రభుత్వాలు వ్యవహ రిస్తున్నాయి. తక్షణ న్యాయం పేరుతో నిందితుల నేరం రుజువు కాకుండానే ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్నారు. బీఫ్, లవ్ జిహాద్ తదితర పేర్లతో మైనారిటీలు, దళితులు, గిరిజనులు, అమాయకులను మూకదాడులు, హత్యలు చేస్తున్నారు. అరాచక గ్యాంగులను సమీకరించి, ప్రజలను వేధిస్తున్నారు. ఏదో వంకతో తమ వ్యతిరేకులు, మైనారిటీల ఇళ్ళను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు.

స్టాక్ మార్కెట్ అక్రమాలను అరికట్టవల సిన సెబి అక్రమాలకు నిలయంగా మారింది. తన వద్దకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరపకుండా కప్పిపెట్టే పనికి పూనుకుంటున్నది. అదాని కంపెనీలపై హిండెన్ బర్గ్ చేసిన ఆరోప ణలపై తగిన విచారణ లేకుండానే నేరస్తులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. అదాని కంపెనీ అమెరికాలో అక్రమ మార్గాలలో నిధులు సమీకరించిందని, సాక్ష్యాధారాలతో అక్కడి కోర్టులో కేసు దాఖలు చేశారు. ఆ విషయంపై మనదేశంలో ఎటు వంటి విచారణ లేకుండా అదానీ అక్రమాలను కప్పిపెట్టటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. స్టాక్ మార్కెట్ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించటానికి స్వతంత్రంగా పనిచేసే స్థాయినుండి ప్రభుత్వ వత్తిడికి లొంగి అక్రమాలను కప్పిపెట్టే సంస్థగా దిగజారింది.

ఈ విధంగా రాజ్యాంగబద్ధంగా ఏర్పాటై, స్వతంత్రంగా పని చేయాల్సిన వ్యవస్థలన్నింటినీ దిగజారుస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ స్వప్రయోజనాల కోసం వినియోగించు కొంటున్నది.

**రాష్ట్రంలో పెట్టుబడిదారులకు భూ పందేరం**

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు అరచేతిలో వైకుంఠం చూయిస్తున్నారు. మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరి, గూగుల్ డేటా సెంటర్, కార్గో విమానాశ్రయం, విద్యుత్ ప్లాంట్లు తదితరాల పేర్లతో లక్షలాది ఎకరాల భూములు పెట్టుబడి దారులకు పందేరం వేస్తున్నారు. భూములు లాక్కోవటాన్ని రైతాంగం ప్రతిఘటిస్తున్నది. ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నప్పటికీ వెనక్కు తగ్గకుండా, ప్రతిచోటా వేలాది మంది రైతులు సమీకృతమై భూముల రక్షణకు పోరాడుతున్నారు. చివరికి ప్రభుత్వం రైతులపై కేసులు బనాయించటంతో పాటు, నాయకులపై పిడి యాక్టు లాంటి దుర్మార్గమైన చట్టాలను ప్రయోగించటానికి పూనుకున్నది. భూములను కాపాడటం కోసం రైతులను సమీకరిస్తున్న అనకాపల్లి జిల్లా రైతుసంఘం కార్యదర్శి అప్పలరాజుపై పిడి యాక్ట్‌ను పెట్టి జైలులో నిర్బంధించింది. ప్రజల హక్కుల కోసం పనిచేసే నాయకులపై నిరంకుశ మైన పిడి చట్టం ప్రయోగించడమేంటి? చట్టా లను ఉల్లంఘించే వారు, హంతకులు, ప్రజా కంటకులుగా తయా రైన ఎందరిపై ఈ చట్టాన్ని ప్రయోగించారు? రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కొని, బడా పెట్టుబడిదారులకు ఎకరం 99 పైసలకు అప్పగించటాన్ని వ్యతిరే కించటం రాష్ట్రంలో అన్నింటినీ మించిన నేరంగా ప్రభుత్వం పరిగణిస్తున్నదన్న మాట. పెట్టుబడి దారుల సేవలో తరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం వారి మెప్పుకోసమే ఇటువంటి నిర్బంధాలకు పూను కుంటున్నదన్న విషయం సుస్పష్టం. ప్రజల్లో అసంతృప్తి పెరిగితే దాని పర్యవసానం ఎలా ఉంటుందో చంద్రబాబుకు తెలియనిది కాదు. ఆయన ఇవే నిరంకుశ విధానాలు కొనసాగిస్తే ప్రజలు మరోసారి బుద్ధిచెబుతారు.

*

# దైవ స్వరూపుడైన మోడీ గారు

*(22వ పేజీ తరువాయి)*

గతంలో పెగాసస్ సాఫ్ట్‌వేర్‌ను ఇజ్రాయిల్ నుండి దిగుమతి చేసుకుని ఎంపికచేసిన కొన్ని భారతీయ స్మార్ట్‌ఫోన్‌లలో ప్రవేశపెట్టిన సంగతిని గుర్తుకు తెచ్చుకోండి! ఆ వ్యవహారం దేశ సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లింది. ఆ కేసులో ప్రభుత్వం తమకు అన్ని వివరాలు, సమాచారం ఇవ్వలేదని న్యాయస్థానం చెప్పింది. కానీ ఈ కొత్త సంచార్ సాథి యాప్ దేశవాళీగా తయారవుతుంది గనుక పెగాసస్‌కన్నా తక్కువ ధరకు లభిస్తుంది. అయితే అదృష్టవశాత్తు, దీన్ని ప్రవేశపెట్టడం పౌరుల ఇష్టాఇష్టాలకు వదిలేయబడింది కనుక ఇప్పటికి ప్రమాదం తప్పింది.

ఇక కార్పొరేట్లకు సంబంధించి: ప్రతి రోజూ, ప్రతి నిమిషం పౌరులను మతిలేని వినియోగదారులుగా మార్చడానికి కష్టపడి పనిచేస్తున్న వీళ్లు ప్రభుత్వ యాప్‌ను సమ్మతించడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. ఎందుకంటే, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చెప్పినట్లు కార్పొరేట్ ఫోన్లల్లో ఈ గూఢచారి యాప్‌ను ప్రి-ఇన్‌స్టాల్ చేస్తే వారి రహస్యాలన్నీ అధికార వర్గాలకు చేరిపోతాయి. ఇదే జరిగితే ఇంతకన్నా మహావిపత్తు ఇంకేమన్నా ఉంటుందా?

మీరు అడగొచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో "మనం, ప్రజలం ఎక్కడున్నాం"? అని. ముక్తి కోసం యాత్రల్లో మునిగి తేలుతున్నాం.

*

# అమెరికా ఆర్థికాధిపత్యానికి అంతిమ ఘడియలు?



రచయిత ఒక బిజినెస్ జర్నలిస్టు. జిన్యూస్ బిజినెస్ డెస్క్‌లో సబ్‌ఎడిటర్

**అమన్ చౌదరి**

కొన్ని దశాబ్దాలుగా ప్రపంచానికి ఒక కథ చెబుతూ వచ్చారు...అమెరికా ప్రపంచంలో అతి పెద్ద ఆర్థికవ వ్యవస్థ, అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ, చైనా దాన్ని అందుకోడానికి ప్రయత్నిస్తున్నది అని.

కానీ 2025వ సంవత్సరం చివరిలో వాస్తవం మరో విధంగా ఉంది. చైనా అమెరికాను ఇంకెంతమాత్రం అందుకోడానికి ప్రయత్నించడం లేదు. అనేక విధాలుగా అది ఇప్పటికే అమెరికాను చేరుకున్నది, లేక వాస్తవ ఆర్థిక దృష్టితో చూస్తే దాన్ని దాటిపోయింది కూడా.

రాజకీయ రణగొణధ్వనులు, సుంకాలు, చైనాతో "తెగతెంపులు" (డికప్లింగ్) చేసుకోవాలి అన్న మాటల వెనుక వాస్తవ గణాంకాలు చాలా ఆశ్చర్యకరమైన కథ చెబుతున్నాయి: సరిగ్గా లెక్కిస్తే చైనా ఇప్పటికే ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది.

అమెరికా–చైనా ఆర్థిక పోటీ ఎలా ప్రారంభమైంది?

అమెరికా ఆర్థిక వ్యవస్థ ఒక శతాబ్దం పైగా ప్రపంచంపై ఆధిపత్యం వహించింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ సరుకుల్లో సగాన్ని అమెరికా ఉత్పత్తి చేసేది, అమెరికన్ డాలరును అడ్డం పెట్టుకుని ప్రపంచ ద్రవ్య వ్యవస్థను నియంత్రించేది. 20 శతాబ్దం మొత్తంగా చూసుకుంటే చైనా పేద దేశం, వ్యవసాయ దేశంగా ఉంది.


కానీ 1978 తరువాత పరిస్థితుల్లో మార్పు వచ్చింది. డెంగ్ సియావోపింగ్ హయాంలో చైనా మార్కెట్ సంస్కరణలనూ, బయటి దేశాలకు తన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచే విధానాలనూ అమలు చేయడం ప్రారంభించింది. దాంతో ఫాక్టరీలు పెరిగాయి. ఎగుమతులు ఊపందుకున్నాయి. విదేశీ కంపెనీలు దేశంలోకి క్యూ కట్టాయి.

2000 సంవత్సరం నాటికి చైనా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో చేరింది. మొత్తం ప్రపంచానికి కావలసిన వస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఉక్కు, రసాయనాల ఉత్పత్తితో అది ప్రపంచ ఫ్యాక్టరీగా మారింది.

1980లో చైనా స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) మొత్తం ప్రపంచ జిడిపిలో 2 శాతం కన్నా తక్కువ ఉండేది. 2025 నాటికి అది 18 శాతానికి పెరిగింది. ప్రపంచ జిడిపిలో అమెరికా వాటా ప్రస్తుతం 24 శాతం ఉంది.

రెండు తరాల్లో చైనా ఆర్థికంగా బ్రహ్మాండమైన గెంతుతో పురోగమించింది.

మీడియా శీర్షికలు సాధారణ జిడిపితో రెండు దేశాలను పోలుస్తుంటాయి. అంటే, అమెరికన్ డాలర్లలో లెక్కించే మొత్తం వస్తు సేవల విలువలతో పోలుస్తాయి.



ఆ లెక్కల ప్రకారం:

అమెరికా జిడిపి (2025): సుమారు 28 లక్షల కోట్ల డాలర్లు.

చైనా జిడిపి (2025) : సుమారు 19 లక్షల కోట్ల డాలర్లు.

అందువల్ల కాగితాల మీద లెక్కల ప్రకారం అమెరికా ఇప్పటికీ పెద్ద ఆర్థిక వ్యవస్థే. కానీ ఇక్కడే గందర గోళం ప్రారంభమవుతుంది.

ఆ డాలర్లతో ఎంత కొనగలం అనే దాన్ని సాధారణ జిడిపి చూపించదు. అక్కడ మరో లెక్క – కొనుగోలు శక్తి సమతుల్యత (పర్చేజింగ్ పవర్ పారిటీ– పిపిపి) ముందుకొస్తుంది. పిపిపి అనేది స్థానిక ధరలు, జీవన వ్యయాలను సర్దుబాటు చేస్తుంది.

పిపిపి తో లెక్కిస్తే:

చైనా ఆర్థిక వ్యవస్థ దాదాపు 34 లక్షల కోట్ల డాలర్లు.

అమెరికా ఆర్థిక వ్యవస్థ దాదాపు 28 లక్షల కోట్ల డాలర్లు.

అంటే వాస్తవ దృష్టితో చూస్తే చైనా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే అమెరికాను మించిపోయింది. చైనా ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ ఆ దేశ ప్రజలు అమెరికా కన్నా ఎక్కువ వస్తువులు, సేవలు ఉత్పత్తి చేస్తున్నారు, వినియోగిస్తున్నారన్నమాట.

అందువల్ల అమెరికాను "చైనా ఎప్పుడు అందుకుంటుంది" అన్నది ప్రశ్న కాదు, "ఇప్పటికే అది దాటేసిందన్న విషయాన్ని ప్రపంచం ఎప్పుడు గుర్తిస్తుంది?" అన్నదే ప్రశ్న.

జిడిపి కన్నా ఎక్కువ విషయాలు చెబుతుంది పారిశ్రామికోత్పత్తి. ఏ వాస్తవ ఆర్థిక వ్యవస్థకైనా ఇదే వెన్నెముక.

చైనాలో ఈ రోజు అవుతున్న ఉత్పత్తి:

ప్రపంచ ఉక్కులో 60 శాతం.

అల్యూమినియంలో 50 శాతం.

కార్లలో 30 శాతం.

70 శాతం ఎలక్ట్రానిక్ వస్తువులు, సెమీకండక్టర్లు.

80 శాతం పైగా సోలార్ ప్యానళ్లు, బ్యాటరీలు.

2025లో అమెరికాలో పారిశ్రామికోత్పత్తుల విలువ 4 లక్షల కోట్ల డాలర్లు కాగా చైనాలో 12 లక్షల కోట్ల డాలర్లు.

అంటే చైనా ఫాక్టరీ ఉత్పత్తులు, నిర్మాణాలు, ఇంధన ఉత్పత్తి మొత్తం కలిపితే అమెరికా కన్నా మూడు రెట్లు ఎక్కువ ఉందన్న మాట.

చివరికి అమెరికా కంపెనీలు కూడా ఐఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల నుండి మందులు, వినియోగ వస్తువుల వరకు చైనా సరఫరా గొలుసుల మీద ఆధారపడాల్సిందే.

అందువల్ల అమెరికా ఇప్పటికీ ద్రవ్య పెట్టుబడి, సాంకేతిక పేటెంట్లు, సాఫ్ట్‌వేర్‌లో ఆధిపత్యం వహిస్తుండగా చైనా భౌతిక ఉత్పత్తుల్లో అంటే ప్రపంచ పాదార్థిక పునాదిలో ఆధిపత్యం వహిస్తున్నదన్న మాట.

> “ సుంకాలు విధించినప్పటికీ చైనా ఎగుమ తులు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దాని వస్తూత్పత్తి పునాది మరింత బలపడింది. అమెరికా కంపెనీలు తమ ఉత్పత్తిని భారత దేశం, మెక్సికో లేక వియత్నాంలకు బదిలీ చేద్దామను కున్నా పూర్తిగా చేయలేకపోయాయి. ఎందుకంటే ఈ దేశాలేవీ చైనా స్థాయి, మౌలిక సదుపాయాలూ, నిపుణులైన కార్మికులతో సరితూగ లేవు. ”

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, ఆంక్షలు, టెక్నాలజీ నియంత్రణలతో “చైనాను కాళ్లమీద పడేట్లు చేస్తాను” అని ఒక నాడు అన్నారు. కానీ 2025 నాటికి వాస్తవం కాస్తా పరిస్థితిని తారుమారు చేసింది.

సుంకాలు విధించినప్పటికీ చైనా ఎగుమ తులు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దాని వస్తూత్పత్తి పునాది మరింత బలపడింది. అమెరికా కంపెనీలు తమ ఉత్పత్తిని భారత దేశం, మెక్సికో లేక వియత్నాంలకు బదిలీ చేద్దామనుకున్నా పూర్తిగా చేయలేకపోయాయి. ఎందుకంటే ఈ దేశాలేవీ చైనా స్థాయి, మౌలిక సదుపాయాలూ, నిపుణులైన కార్మికులతో సరితూగ లేవు.

ట్రంప్ ప్రభుత్వం ఇప్పుడు దిగివచ్చి సుంకాల తీవ్రతను తగ్గించడం, చైనా ప్రభుత్వంతో మాట్లాడ్డం బలహీనత వల్ల కాదనీ, ఆర్థిక వాస్తవికతను గుర్తించడం వల్లనేనని విశ్లేషకులు ఇప్పుడు నమ్ముతున్నారు.

ప్రపంచ సరఫరా గొలుసులో చైనా ఆధిపత్యం అంటే అర్థం.. దాన్ని ఒంటరి చేయ డానికి జరిగే ఏ ప్రయత్నమైనా అమెరికాకూ హాని చేస్తుంది. అమెరికాలో ఉత్పత్తి అయ్యే ప్రతి కారు, ఫోన్, సోలార్ ప్యానల్ ఇప్పటికీ చైనా విడిభాగాల మీద ఆధారపడి ఉన్నాయి.

ఫ్యాక్టరీలే కాదు, చైనా గత 40 ఏళ్లలో ఒక విస్తారమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థను నిర్మించింది.

ఇప్పుడు చైనాలో ప్రపంచంలోనే అతి పొడవైనా 45,000 కిలో మీటర్ల హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఉంది.

దాని నగరాలు సమర్థవంతమైన సబ్‌వేలు, హైవేలు, పోర్టులతో అత్యంత ఆధునికంగా అలరారుతున్నాయి.

అది ఇతర ఏ దేశాలతో పోల్చినా అధిక పునరుత్పత్తి ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తోంది. సౌర, పవన, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థలపై భారీగా పెట్టుబడులు పెడుతోంది.

దాని విద్యుత్ వాహనాల మార్కెట్ ప్రపంచంలోనే అతి పెద్దది. 2024లో ప్రపంచం మొత్తం అమ్మిన విద్యుత్ వాహనాల కన్నా ఎక్కువగా చైనా అమ్మింది.

విద్యుత్ వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు అవసరమైన లిథియం వంటి కీలక ఖనిజాలు, అరుదైన మూలకాలు, కోబాల్ట్‌ల ఉత్పత్తిలో చైనా తిరుగులేని ఆధిక్యత వహిస్తోంది.

మరోవైపు అమెరికా పాతబడిపోయిన ప్రాథమిక సదుపాయాలు, పెరుగుతున్న రుణంతో సతమతమవుతోంది. రాజకీయ చిక్కుముడులతో ప్రధాన ప్రాజెక్టులు కుంటి నడక నడుస్తున్నాయి.

అయితే అంతా ఏకపక్షంగా ఏం లేదు. చైనా ఆర్థిక వ్యవస్థలో కూడా అనేక లసుగులు న్నాయి:


రుణ భారం: స్థానిక సంస్థలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులూ లక్షల కోట్ల యువాన్ల బకాయిలు పడ్డారు. దీనివల్ల రియల్ ఎస్టేట్ సంక్షోభంలో పడింది. ఎవర్‌గ్రాండే ప్రాజెక్టు కుప్పకూలిపోయింది.

వయసు మీదపడుతున్న జనాభా: చైనాలో పనిచేసే వయసున్న జనాభా తగ్గిపోతున్నది. 2035 నాటికి దేశంలోని జనాభాలో 30 శాతం మంది 60 ఏళ్లు దాటి ఉంటారు.

తక్కువ ఆదాయాలు: సగటు చైనా పౌరుడు అమెరికా పౌరుడు గడించే దాన్లో పావు వంతు మాత్రమే గడిస్తున్నాడు.

# లక్ష కోట్ల డాలర్లు దాటిన చైనా వాణిజ్య మిగులు

**అలెక్స్ కోజుల్‌రైట్**



రచయిత అల్ జజీరా మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టు

డొనాల్డ్ ట్రంప్ చైనాపై ఎత్తుపెట్టిన సుంకాల ఆయుధం విఫలమైంది. 2025 నవంబర్‌లో చైనా వాణిజ్య మిగులు రికార్డు స్థాయికి చేరుకున్నది.

చైనా వాణిజ్య మిగులు అంటే, ఎగుమ తులు, దిగుమతుల విలువల మధ్య వ్యత్యాసం... ఆ దేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా 1 లక్షల కోట్ల డాలర్ల స్థాయిని దాటిపోయింది. సాక్సులు, కర్టయిన్ల దగ్గరి నుండి విద్యుత్ కార్ల వరకు అన్నిటినీ ఎగుమతి చేస్తూ ‘ప్రపంచ ఫ్యాక్టరీగా’ సంపాదించుకున్న పేరును చైనా నిలబెట్టుకున్నది.

ఈ ఏడాది 11 మసాల్లో మొట్టమొదటి సారిగా చైనా ఎగుమతులు 3.4 లక్షల కోట్ల స్థాయికి చేరుకున్నాయి. దిగుమతులు కొద్దిగా తగ్గి 2.3 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమ య్యాయి. దాంతో ఆ దేశ వాణిజ్య మిగులు 1.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకున్నదని చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ డిసెంబర్ 8వ తేదీన తెలిపింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పై వాణిజ్య యుద్ధం ప్రకటించినప్పటికీ ఆ దేశం నుండి అమెరికాకు ఎగుమతులు ఇబ్బిడిముబ్బి డిగా పెరిగాయి. అమెరికా మొదట విధించిన 125 శాతం సుంకాలను తరువాత జరిగిన చర్చల తరువాత కొంతమేరకు తగ్గించినప్పటికీ దాని ప్రభావం చైనాపై పెద్దగానే పడింది. అయితే దీన్ని అధిగమించేందుకు చైనా అమెరికాకు జరపాల్సిన ఎగుమతులను ఇతర దేశాలకు మళ్లించడం ద్వారా ఈ సవాలును అధిగమించింది.

వాస్తవానికి 2024 ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన వెంటనే చైనా ముందు చూపుతో తన ఎగుమతుల వాణిజ్యాన్ని అమెరికా నుండి ఆగ్నేయాసియా, ఐరోపా దేశాలకు మళ్లించడంతో అమెరికా ఆంక్షలు, సుంకాలు దాన్ని ఏమీ చేయలేకపోయాయి.

సాంకేతిక ఆంక్షలు: అమెరికా ఆంక్షల మూలంగా చైనాకు అత్యాధునిక సెమీకండక్టర్లు, ఏఐ చిప్స్ అందకుండా పోతున్నాయి.

ఈ సమస్యలు ఏం చెబుతున్నాయంటే, చైనా ఆర్థిక వ్యవస్థ పెద్దదే గానీ అది అంతర్గతంగా ఎదుర్కొంటున్న సమస్యలు దీర్ఘకాలిక పురోగతిని అడ్డుకోవచ్చు అని.

అమెరికా ఇప్పటికీ అనేక కీలక రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంది:

నూతనావిష్కరణలు: అమెరికన్ కంపెనీలు ప్రపంచ వ్యాపిత సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ నమూనాలు, బయో టెక్నాలజీలో ఆధిపత్యంలో ఉన్నాయి.

ద్రవ్య శక్తి: అమెరికా డాలరు ఇప్పటికీ ప్రపంచ రిజర్వు కరెన్సీగా ఉన్నది. దాని వల్ల దానికి ప్రపంచ వాణిజ్యంపై తిరుగులేని ఆధిపత్యం లభిస్తోంది. ఆంక్షలు పెట్టే సామర్థ్యం కూడా లభిస్తోంది.

రక్షణ, పరిశోధనాఅభివృద్ధి:

రక్షణ, పరిశోధన మీద అమెరికా ఏటా 90,000 కోట్ల డాలర్లు (సుమారు 81 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తోంది. ఇది దాని తరువాత పది దేశాలు చేసే ఖర్చుకన్నా ఎక్కువ.

అధిక ఉత్పాదకత: మెరుగైన సాంకేతిక వినియోగం, మేనేజ్‌మెంట్ వ్యవస్థల వల్ల అమెరికన్ కార్మికులు ఇతర దేశాల కార్మికులతో పోలిస్తే సగటున తలసరి అధికంగా ఉత్పత్తి చేస్తున్నారు.

అందువల్ల చైనా వస్తూత్పత్తి, తయారీ రంగాల్లో అమెరికాను అందుకున్నప్పటికీ నూతనావిష్కరణలు, ప్రపంచ ద్రవ్య వ్యవస్థ, సాఫ్ట్ పవర్ విషయంలో ఇంకా ముందంజలోనే ఉంది.

❝ 21వ శతాబ్దం బహుళ ధృవ ఆర్థిక ప్రపంచంగా ఉండ బోతోంది. అమెరికా గతం లో లాగా తన ఇష్టం వచ్చినట్లు వాణిజ్య నిబంధ నలను ఇతర దేశాలపై రుద్దడం సాధ్యం కాదు. బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం ద్వారా చైనా పలుకుబడి పెరుగుతోంది. ఈ కార్యక్రమం క్రింద అది ఆఫ్రికా నుండి యూరోపియన్ దేశాల్లో రైల్వేల వరకు 150 దేశాల్లో పెట్టుబడులు పెట్టింది. ❞

21వ శతాబ్దం బహుళ ధృవ ఆర్థిక ప్రపంచంగా ఉండబోతోంది. అమెరికా గతం లో లాగా తన ఇష్టం వచ్చినట్లు వాణిజ్య నిబంధ నలను ఇతర దేశాలపై రుద్దడం సాధ్యం కాదు. బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం ద్వారా చైనా పలుకుబడి పెరుగుతోంది. ఈ కార్యక్రమం క్రింద అది ఆఫ్రికా నుండి యూరోపియన్ దేశాల్లో రైల్వేల వరకు 150 దేశాల్లో పెట్టుబడులు పెట్టింది.

అనేక వర్ధమాన దేశాలు నేడు అమెరికా కన్నా చైనాతో ఎక్కువ వాణిజ్యం చేస్తున్నాయి. అంతే కాదు చైనా ప్రభుత్వం ఆసియా ప్రాథమిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబి) వంటి ప్రత్యామ్నాయ ద్రవ్య సంస్థలను రూపొం దించింది. దాని వల్ల వర్ధమాన దేశాల కు పశ్చిమ దేశాల నాయకత్వంలోని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి వాటిమీద ఆధారపడా ల్సిన అగత్యం తగ్గింది.

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచం నేడు కొత్త బలాబలాల సమతుల్యానికి సర్దుకోవడం జరుగుతోంది: అమెరికా ద్రవ్య, నూతనావిష్కరణల కేంద్రంగా ఉండగా, చైనా వస్తూత్పత్తి, ప్రాథమిక సదుపాయాలకు బలమైన కేంద్రంగా ఉంది.

పిపిపి (కొనుగోలు శక్తి సమతుల్యత) అనేది చైనా బలాన్ని పెంచి చూపిస్తోందని కొందరు విమర్శకులు చెబుతున్నారు. కానీ సామాన్య ప్రజలకు సంబంధించిన వ్యవహారాన్ని పిపిపి వాస్తవంగా ప్రతిబింబిస్తుంది. ఒక దేశం వాస్తవంగా ఎంత ఉత్పత్తి చేస్తున్నది, ఎంత వినియోగిస్తున్నది అన్న విషయాన్ని అది తెలుపుతుంది.

చైనాలో ఒక కార్మికుని వేతనం 500 డాలర్లు కానీయండి లేక 5,000 డాలర్లు కానీయండి అతను ఒక వంతెన నిర్మించినా,

అంతే కాకుండా అమెరికా తక్కువ సుంకాలు విధించిన దేశాలకు చైనా తన ఉత్పత్తి కేంద్రాలను తరలించడంతో దాని ఉత్పత్తుల ఎగుమతులు ఏమాత్రం తగ్గకపోగా పెరగాయి.

**అంత వాణిజ్య మిగులును చైనా ఎలా సాధించ గలిగింది?**

గత అక్టోబర్ నెలలో చైనా ఎగుమతులు అకస్మాత్తుగా తగ్గి మళ్లీ నవంబర్ నెలలో అంతకు ముందు ఏడాది ఇదే నెలతో పోలిస్తే 5.9 శాతానికి పుంజుకున్నాయి. దిగుమతులు 1.9 శాతం పెరిగాయి. దిగుమతుల కన్నా ఎగుమతులు భారీగా పెరగడంతో వాణిజ్య మిగులు లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటేసిం దని చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ విభాగం తెలిపింది.

2025 తొలి 11 మాసాల్లో చైనా వస్తువుల ఎగుమతుల్లో మిగులు అంతకు ముందటేడు ఇదే కాలంతో పోలిస్తే 21.7 శాతం పెరిగింది. ప్రధానంగా ఈ కాలంలో హై-టెక్నాలజీ వస్తువుల ఎగుమతులు భారీగా పెరిగాయి. అంతకు ముందుటేడాదితో పోలిస్తే ఈ వస్తువుల ఎగుమతులు 5.4 శాతం పెరిగా యి. చైనా మోటారు వాహనాలు, ముఖ్యంగా విద్యుత్ వాహనాలు జపాన్, జర్మనీ మార్కెట్ల లోకి చొచ్చుకు పోయాయి. ఈ కాలంలో మొత్తం చైనా కార్ల ఎగుమతులు 10 లక్షలు పెరిగి 65 లక్షల సంఖ్యకు చేరుకున్నాయని ఆటోమొబిలిటీ కన్సల్టెన్సీ సంస్థ తెలిపింది.

ఆధునిక చిప్స్ ఎగుమతుల్లో చైనా ఇప్పటికీ ప్రపంచ అగ్రగామి అయిన అమెరికాకు చెందిన ఎన్‌విడియా కన్నా వెనుకబడి ఉన్నప్పటికీ విద్యుత్ వాహనాల నుండి వైద్య పరికరాల వరకు దైనందిన ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉపయోగించే సెమీకండక్టర్ల ఉత్పత్తిలో మాత్రం చైనా ఆధిపత్యం సాధించింది. చైనా సాంకేతికా భివృద్ధి నౌకా నిర్మాణ రంగంలో కూడా అది పై చేయి సాధించడానికి దోహదపడింది. 2024 సంవత్సరంతో పోలిస్తే 2025లో నౌకా నిర్మాణ రంగంలో అది 26.8 శాతం అభివృద్ధి సాధించింది.

ప్రపంచ వాణిజ్యం ప్రతికూలంగా ఉన్న సమయంలో చైనా ఈ అభివృద్ధి సాధించడం ఎలా సాధ్యమైంది?

**కొత్త మార్గాల్లోకి మళ్లించడం, వైవిధ్యం సాధించడం**

ఇటీవలి మాసాల్లో చైనాపై సుంకాల విషయంలో అమెరికా కొంత వెనక్కు తగ్గినప్పటికీ ఇప్పటికీ ఇతర దేశాలతో పోలిస్తే చైనాపై అమెరికా సుంకాలు అధికంగానే ఉన్నాయి. ప్రస్తుతం చైనాపై సగటున 37 శాతం సుంకాలు నడుస్తున్నాయి. అందువల్ల గత నవంబరుతో పోలిస్తే 2025 నవంబర్‌లో అమెరికాకు ఎగుమతులు 29 శాతం పడిపోయాయి.

కొన్ని చైనా కంపెనీలు తమ ఉత్పత్తి కేంద్రాలను ఆగ్నేయాసియా, మెక్సికో, ఆఫ్రికా దేశాలకు మార్చేశాయి. దాంతో అక్కడి

❝ అయితే, భారత దేశం నేటికీ ప్రాధమిక సదుపాయాలు, ఎగుమతులు, పరిశోధనా వ్య యం విషయంలో చాలా వెనుకబడి ఉంది. ఇప్పుడు భారత దేశం ముందున్న సవాలు చైనా స్థానంలోకి రావడం కాదు, రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఏర్పడిన అంతరాన్ని తను పూడ్చాలి. దానికి గాను భారత్ ఒక సమతుల్య మైన, నమ్మకమైన, వైవిధ్యం గల ఆర్థికవ్యవస్థగా మారాలి. ❞

ఒక కారు తయారు చేసినా, లేక ఆహారాన్ని పండించినా ప్రపంచ సరఫరా గొలుసుపై దాని ప్రభావం ఒకే విధంగా ఉంటుంది.

అందువల్లనే నిజమైన ఆర్థిక శక్తిని కొలవడానికి పిపిపి అనేది వాస్తవికతతో కూడిన లెక్క అని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. అందువల్ల ఆ లెక్కన చైనా ఆధిపత్య స్థానంలో ఉంది.

చైనా జిడిపి (పిపిపి లెక్కలో) అమెరికాను 2017లోనే మించిపోయిందని ఐఎంఎఫ్ 2024 నివేదికలో తెలిపింది. అప్పటి నుండి అంతరం మరింత పెరుగుతూ వచ్చిందని చెప్పింది.

అందువల్ల ఇదంతా చెబుతున్న దేమిటి?

మనం ఒకేఒక ఆధిపత్య శక్తి ఉన్న ప్రపంచంలోకి కాకుండా రెండు సూపర్ ఆర్థిక వ్యవస్థలున్న ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నామన్న మాట. అమెరికా చైనాలు పోటీ పడతాయి, సహకరించుకుంటాయి, కొన్నిసార్లు ఘర్షణ పడతాయి. కానీ వాటిలో ఏదీ మరోదాన్ని విస్మరించి బ్రతకలేదు.

అమెరికాకు చైనా వస్తువులు, ముడి సరుకులు కావాలి. చైనాకు అమెరికన్ టెక్నాలజీ, నూతనా విష్కరణలు, ప్రపంచ ద్రవ్య స్థిరత్వం కావాలి.

ఇలా ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉండడం అంటే అర్థం, రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఆర్థికంగా విడిపోవడం (డికప్లింగ్) సాధ్యం కాదు.

భారత దేశానికి సంబంధించినంతవరకు ఈ అమెరికా-చైనా వైరం నూతన అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది. పశ్చిమ దేశాల కంపెనీలు చైనా ఫాక్టరీలకు ప్రత్యామ్నాయాలు వెదుక్కుంటున్నాయి గనుక భారత దేశం తదుపరి భారీ ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం ఏర్పడుతుంది, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, సెమీ కండక్టర్ల రంగాల్లో.

భారత దేశ జిడిపి నేడు 4 లక్షల కోట్ల డాలర్లు. ఇది ప్రస్తుతం అమెరికా, చైనాల కన్నా వేగంగా ఏడాదికి 7 శాతం చొప్పున పెరుగుతోంది. 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించవచ్చు.

అయితే, భారత దేశం నేటికీ ప్రాధమిక సదుపాయాలు, ఎగుమతులు, పరిశోధనా వ్యయం విషయంలో చాలా వెనుకబడి ఉంది. ఇప్పుడు భారత దేశం ముందున్న సవాలు చైనా స్థానంలోకి రావడం కాదు, రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఏర్పడిన అంతరాన్ని తను పూడ్చాలి. దానికి గాను భారత్ ఒక సమతుల్యమైన, నమ్మకమైన, వైవిధ్యం గల ఆర్థికవ్యవస్థగా మారాలి.

2025లో ద్రవ్య పెట్టుబడి కిరీటం అమెరికాకే దక్కుతుంది. కానీ భౌతిక ఆర్థిక వ్యవస్థ అయిన ప్రపంచ ఫాక్టరీలు, సరుకులు, నిజమైన ఉత్పత్తి విషయంలో చైనా నేడు ఆధిపత్య స్థానంలోకి వచ్చింది.

అమెరికన్ డాలర్ ఇప్పటికీ అధికారం చెలాయిస్తున్నది, కానీ చైనా వస్తూత్పత్తిని శాసిస్తున్నది. ఆధునిక ప్రపంచంలో ఉత్పత్తితోనే అధికారం వస్తుంది.

అందువల్ల ఒకవైపు రాజకీయ నాయకులు వాణిజ్యం, సుంకాలపై వాదప్రతివాదనలు చేసుకుంటుంటే, వాస్తవం చాలా సరళంగా ఉంది: చైనా ఇంకెంత మాత్రం అమెరికాను అందుకోవడానికి పరుగెత్తడంలేదు, అది అమెరికా పక్కనే నడుస్తోంది.

పోటీ అంతం కాలేదు. కానీ రెండు దేశాలమధ్య అంతరం మాయమైపోయింది. అది అన్నిటినీ, అంటే ప్రపంచ వాణిజ్యం నుండి భౌగోళిక రాజకీయాల నుండి ఆర్థిక శక్తి భవిష్యత్తు వరకు అన్నిటినీ మార్చేస్తోంది.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

వస్తువులు నేరుగా చైనా నుండి రావడంలేదు కనుక ట్రంప్ సుంకాల నుండి తప్పించుకున్నాయి. అయినప్పటికీ రెండు దేశాల మధ్య వాణిజ్యం గతంతో పోలిస్తే కొంతమేరకు తగ్గింది. ఉదాహరణకు ఇండోనేసియా నుండి అమెరికాకు దిగుమతులు 2025 తొలి 8 మాసాల్లో మూడో వంతు పెరిగి 2,300 కోట్ల డాలర్లకు పెరిగింది. చైనా వస్తువులు ఇండోనేషియా ద్వారా ఎగుమతి కావడం వల్లనే ఈ పెరుగుదల సంభవించిందని పరిశీలకులు భావిస్తున్నారు.

"అమెరికా సుంకాలనుండి తప్పుకోడానికి చైనా వస్తువులను ఇతర దేశాల ద్వారా ఎగుమతి చేసే క్రమం ఇంకా పెరుగుతూనే ఉంది" అని కాపిటల్ ఎకనామిక్స్‌కు చెందిన ఆర్థిక వేత్త జిచున్ హువాంగ్ ఒక వ్యాసంలో తెలిపారు. "ప్రధానంగా చైనా వస్తువులను అమెరికాకు మళ్లించే స్థావరంగా ఉన్న వియత్నాంకు చైనా ఎగుమతులు శీఘ్రంగా పెరుగుతున్నాయి" అని ఆయన రాశారు.

మరోవంక అమెరికాకు ఎగుమతులు తగ్గిపోవడంతో చైనా ఇతర వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను రెట్టింపు చేసుకుంది. అందులో భాగంగా ఐరోపాకు చైనా ఎగుమతులు 15 శాతం పెరిగాయి, ఆగ్నేయాసియా దేశాలకు 8,2 శాతం పెరిగాయి.

**కరెన్సీ విలువ తక్కువ కావడమూ ఒక కారణం**

ఇతర కరెన్సీలతో పోలిస్తే చైనా కరెన్సీ విలువ ఇటీవలి సంవత్సరాల్లో తక్కువగా ఉండడం వల్ల కూడా దాని ఎగుమతులు పెరగడానికి ఒక కారణం. చైనా కరెన్సీ అయిన యువాన్ విలువ తక్కువగా ఉండడం వల్ల చైనా ఉత్పత్తుల ఖర్చు తక్కువవుతోంది. అదేసమయంలో దిగుమతుల వినియోగం ఖర్చు ఎక్కువవుతోంది. చైనా తన యువాన్ విలువను సమతుల్యంగా ఉండేట్లు నియంత్రిస్తోంది. అంటే, విదేశీమారక మార్కెట్లలో ఇతర కరెన్సీలతో పోలిస్తే చైనా కరెన్సీ నిలకడగా ఉండేట్లు చైనా సెంట్రల్ బ్యాంకు నిరంతరం జోక్యం చేసుకుంటున్నది.

**ఈ స్థాయికి చైనా ఎలా చేరుకున్నది?**

దశాబ్దాలుగా చైనా అనుసించిన పారిశ్రామిక విధానాల వల్ల చైనా 1970లో అల్పాదాయ వ్యసాయ దేశం నుండి నేడు 1 లక్ష కోట్ల డాలర్ల వాణిజ్య మిగులుకు రాగలిగింది. 1980వ దశకంలో చైనా తక్కువ ఖరీదు ఉత్పాదక సరుకులైన టి-షర్టులు, పాదరక్షలు వంటి వస్తువులు నమ్మకంగా సరఫరా చేసే దేశంగా తన ఎగుమతు ప్రస్థానం ప్రారంభించింది. అక్కడి నుండి అది ఒక్కో మెట్టు ఎక్కుతూ

(మిగతా 33వ పేజీలో)

# భారతీయ పాఠశాలల్లో లోపించిందేమిటి?



రచయిత ఢిల్లీలోని శివనాడార్ యూనివర్శిటీ చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ "కంటెస్టెడ్ చైల్డ్‌హుడ్స్ : కాస్ట్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ కొలోనియల్ కేరళ" పుస్తక రచయిత

**దివ్య కన్నన్**

భారత దేశంలో పత్రికలను చూస్తే తరచుగా పాఠశాల పిల్లల మరణాల గురించి వార్తలు కనిపిస్తాయి. కూలిపోయిన తరగతి గదుల పైకప్పులు, మద్యం తాగిన బస్సు డ్రైవర్లు, ఉపాధ్యాయులు లేదా ఇతర సిబ్బంది చేత లైంగిక వేధింపులు, తరగతి గదుల్లో ఏడిపించడాలు వంటివి అరుదైన సంఘటనలు కావు. ఆందోళన కలిగించేంతగా తరుచుగా జరుగుతున్నవే! పేద, కార్మిక వర్గాలకు చెందిన పిల్లలు, చారిత్రకంగా అణగారిన సమూహాల పిల్లలు చదివే పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు అధికంగా జరగడం కూడా యాదృచ్ఛికం కాదు. పత్రికల్లో ఇవి "సాధారణ" వార్తల్లా రాయబడుతున్నప్పటికీ, వాస్తవానికి ఇవి రాజకీయ నిర్ణయాల ఫలితాలు! భారతదేశంలో కూడా, ఇతర దేశాల్లోలాగే, విద్య అనేది కేవలం నేర్చుకోవడానికి మాత్రమే పరిమితం కాలేదు. చదువు ఎవరికి లభిస్తుంది? వారికి ఏమి నేర్పిస్తున్నారు? భవిష్యత్తులో వారిని ఏ దిశగా నడిపిస్తారు? ఇవన్నీ సామాజిక-ఆర్థిక అసమానతలతో ముడిపడిన ప్రశ్నలే. బ్రిటిష్ వలస పాలన రోజుల నుంచి ఇప్పటి వరకూ పాఠశాలలు ఈ లోతైన అసమానతలను ప్రతిబింబిస్తూ, తరచుగా వాటిని మరింత బలపేతం చేస్తూ వచ్చాయి.

మన దేశంలో సాధారణ విద్య చాలా కాలంగా విభిన్న అవసరాలను నెరవేర్చింది. బ్రిటిష్ పాలనా కాలంలో, విద్యను వారి ఆధునీకరణ మిషన్‌లో కీలక భాగంగా భావించారు. అప్పట్లో పాలనకు, సామాజిక నియంత్రణకు, ఆర్థిక అవసరాలకు ఉపయోగపడే సాధనంగా విద్య రూపొందింది. 1835లో గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో లా మెంబర్ అయిన థామస్ మెకాలే తను రాసిన ప్రసిద్ధి చెందిన 'మినిట్ ఆన్ ఇండియన్ ఎడ్యుకేషన్'లో... విద్య లక్ష్యం "రక్తం, వర్ణంలో భారతీయులైనా, అభిరుచుల్లో, అభిప్రాయాల్లో, నైతిక విలువల్లో, మేధస్సులో ఇంగ్లీషువారిలా ఉండే ప్రజలను సృష్టించడం కావాలి" అని ప్రకటించాడు. ఈ దృష్టితోనే విద్యా వ్యవస్థను రూపొందించారు. దీనిలో విద్య అందుబాటు, నాణ్యత, అవకాశాలన్నీ అసమానతలతో కూడుకున్నవే.

ఈ వ్యవస్థను రూపొందించడంలో ప్రభుత్వాధికారులు, క్రైస్తవ మిషనరీలు, మతపరమైన, కులాధారిత సంస్కరణ వాదులు, సంఘాలు తమ పాత్ర పోషించాయి. భారతీయ ఉన్నత వర్గాలు, పెరుగుతున్న మధ్య తరగతి పిల్లలకు సక్రమంగా నిర్వహించే ఇంగ్లీష్-మీడియం, ఆంగ్లో-వెర్నాక్యులర్ సంస్థలు అందుబాటులో ఉండగా, జనాభాలో మెజారిటీ ప్రజలకు మాత్రం ప్రాథమిక స్థాయి, తక్కువ సదుపాయాలతో నడిచే స్థానిక భాషా పాఠశాలలే దిక్కుగా మారాయి.

1854 నాటికి, చార్ల్స్ వుడ్ రూపొందించిన 'డిస్పాచ్ ప్రణాళిక' ఈ విద్యా విస్తరణ ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకెళ్లింది. దీని ద్వారా ప్రైవేట్ సంస్థలు నడిపే స్థానిక భాషా పాఠశాలలను ప్రోత్సహించినప్పటికీ, అవి వలస ప్రభుత్వానికి గట్టిగా లోబడి ఉండేలా నియంత్రణలు రూపొందించారు. ఈ పాఠశాలల్లో చాలా వరకు గ్రాంట్-ఇన్-ఎయిడ్ విధానం ద్వారా అందే గుర్తింపు, నిధులపై ఆధారపడే పరిస్థితిలో ఉన్నాయి. అయితే, పై నుండి ఉన్న ఈ తరహా జోక్యాలు విజ్ఞానాన్ని ప్రజాస్వామ్యీకరించడం, పాఠశాలలను అందరికీ అందుబాటులో ఉంచడం వంటి లక్ష్యాలను పెట్టుకోలేదు. దానికి భిన్నంగా అప్పటికే ఉన్న కులం, వర్గం, ప్రాంతం, లింగం, భాష వంటి అసమానతలకు అనుగుణంగా విద్యను అందుబాటులోకి వచ్చేలా రూపొందించారు. 1882లో భారత విద్యా సంఘం నివేదిక వెలువడిన తర్వాత విద్యా సదుపాయాలు, మౌలిక వసతులు పెరగడం ప్రారంభమయ్యాయి. ఆ నివేదిక స్థానిక భాషా పాఠశాలలను విస్తరించాలని సిఫారసు చేసింది. ఇది భారతీయ ఉపాధ్యాయులు, సంస్కరణవాదులకు తమ విద్యా దృష్టి కోణాలను వ్యక్తీకరించడానికి కొంత అవకాశాన్ని కల్పించింది. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత, 1947లో, భారతదేశ జాతి నిర్మాణ ప్రాజెక్టులో విద్య ప్రధాన స్థానం పొందినప్పుడు పాఠశాల పిల్లలను నైతిక, శారీరక, సాంస్కృతిక సంస్కరణల లక్ష్యాలుగా గుర్తించారు. అలా ఓ కొత్త, పేద దేశానికి జీవం పోసేందుకు ఇవి అవసరమైన వాటిగా భావించారు. శాస్త్ర- సాంకేతిక రంగాల్లో పెట్టుబడులతో పాటు విద్యను విస్తరించడంపై దృష్టి పెట్టారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా, జాతీయ విద్యా విధానాన్ని రూపొందించారు. 1968 – 1986ల మధ్య ప్రాథమిక విద్యను సార్వజనీనం చేయడం, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం, బాలికలు, గిరిజనులకు చెందిన పిల్లల కోసం విద్యా సౌకర్యాలను మెరుగుపరచడం వంటి అంశాలకు ఈ విధానంలో భాగంగా ప్రాధాన్యత లభించింది. ఇవే లక్ష్యాలతో పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడం, బాల్య వివాహాలను నిషేధించడం, ప్రమాదకరమైన పనుల నుండి పిల్లలను రక్షించే చట్టాలను అమలు చేసే ప్రయత్నాలు కూడా విద్యకు అనుసంధానించారు. అయితే, అమలు మాత్రం అస్తవ్యస్తంగా సాగింది. కొన్ని రాష్ట్రాలు ముందుకు దూసుకెళ్లగా, మరికొన్ని రాష్ట్రాలు చాలా వెనుకబడ్డాయి. ఈ అంతరాల్లో చిక్కుకున్నది పేద పిల్లలే!

### నూతన విద్యా విధానం – పరిమితులు

ఈ సమస్యలు కొనసాగుతున్న సమయంలోనే, ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి విరుచుకుపడింది. అది ఉధృతంగా వ్యాపిస్తున్న సమయంలోనే నూతన విద్యావిధానం–2020ని ప్రకటించారు. కోవిడ్ కారణంగా నెలకొన్న పరిస్థితులు బోధన విధానాలపైనా, విద్యా వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపాయి. ఈ సవాళ్లను నూతన విద్యా విధాన పత్రంలో ఎక్కడా ప్రస్తావించ

> **"తాజాగా ఎన్ఇపి ప్రవేశపెట్టిన వృత్తి విద్యల వ్యవస్థ ఈ వివక్షాత్మక ధోరణిని మళ్లీ బలపరిచే ప్రమాదం ఉంది. నైపుణ్యాభివృద్ధి (స్కిల్లింగ్)ని సాధికారతగా చూపించినా, బలమైన రక్షణలు, పైకి ఎదిగే మార్గాలు లేక పోతే, అది అణగారిన వర్గాల పిల్లలను తక్కువ వేతనం, అస్థిరమైన ఉద్యోగాల్లోకి నెట్టివేస్తుంది. అంతర్జాతీయ మూలధన ప్రయోజనాల కోసం పనిచేసే పనులకు పరిమితం చేస్తుంది."**

కపోవడం ఆందోళన కలిగించే విషయం. స్వాతంత్ర్యం తరువాత తొలి దశాబ్దాల్లో ప్రభుత్వ పాఠశాలలు గౌరవనీయమైన సంస్థలుగా గుర్తింపుపొందాయి. నేటి భారత మధ్యతరగతికి చెందిన అనేక మంది నిపుణులు, బ్యూరోక్రాట్లు, ఉపాధ్యాయులు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే. కానీ 1980ల తరువాత ప్రారంభమైన నూతన ఆర్థిక సంస్కరణలు ప్రభుత్వ రంగం విఫలమైందన్న వాదనను బలంగా ముందుకు తీసుకువచ్చాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులపై సోమరులు, అసమర్థులన్న ముద్రను వేశాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలలను విడిచి, ప్రైవేట్ పాఠశాలలవైపు మళ్లడం ప్రారంభించాయి. క్రమంగా ప్రభుత్వ పాఠశాలలు పేదవారికే పరిమితమయ్యాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం తగ్గిపోయింది.

2020లో తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ప్రైవేట్ రంగం మరింతగా పెరగడానికి అనుకూలమైన వాతావరణం సృష్టించింది. పాఠశాలలను ఫ్యాక్టరీల్లా నడపడం ప్రారంభమైంది. ఫలితంగా పిల్లలు స్వంత భాషా-సాంస్కృతిక వారసత్వాల నుండి దూరం అయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో, ఎలైట్ ప్రైవేట్, అంతర్జాతీయ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఒకరకమైన గందరగోళం నెలకొంటోంది. వీరికి ప్రపంచవ్యాప్తంగా సంచరించగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ స్థానికంగా ఎటువంటి సంబంధాలు లేని పరిస్థితి ఉంటోంది. మెరుగైన విద్య, ఉపాధి అవకాశాల కోసం యువత దేశాన్ని విడిచి వెళ్తుండటంతో 'మేధో వలస' (బ్రెయిన్ డ్రైయిన్) పెరుగుతోంది. మరోవైపు నూతన విద్యావిధానం కార్పొరేట్ సంస్థలను విద్యారంగంలోకి ఆహ్వానిస్తుంది. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ (పిపిపి) వంటి పదాలను వినియోగించడం ద్వారా ప్రభుత్వ బాధ్యతను తగ్గిస్తోంది. ఫ్రెంచ్ సామాజిక శాస్త్రవేత్త పియెర్ బోర్ద్యూ చెప్పినట్లు, పాఠశాలలు తరచుగా విద్యను ఒక నైపుణ్యంగా మార్చి సామాజిక ప్రత్యేక హోదాను, అసమానతలను పునరుత్పత్తి చేస్తాయి. వివిధ నేపథ్యాల పిల్లలకు వేర్వేరు విలువలను కేటాయించడం కూడా ఈ వ్యవస్థలో భాగమే. ఎన్ఇపి ఈ ప్రక్రియను మరింత బలపరిచే ప్రమాదం ఉంది.

పేదరికంలో ఉన్న అణగారిన వర్గాల పిల్లల విద్య విషయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దక్షిణ కేరళలోని ట్రావన్కోర్ వంటి ప్రగతిశీలంగా భావించే సంస్థానాలు కూడా వేరుచేయడం, విస్మరించడం అనే భావాలపైనే నడిచేవి. ఉదాహరణకు, ట్రావన్కోర్, కొచ్చిన్‌లతో పాటు ఇతర సంస్థానాల్లో అణగారిన వర్గాల కోసం ప్రభుత్వ పాఠశాలలు చాలా కొద్దిగా ఉండేవి. అవి కూడా భౌతికంగా ఇతర పాఠశాలల నుండి వేరుచేసి పెట్టినవి. బోధకులు తక్కువ. వనరులు చాలా కొద్దిగా ఉండేవి. ఈ పిల్లల కోసం నడిచిన స్థానిక భాషా పాఠశాలలు ప్రధానంగా అక్షరాస్యత వంటి ప్రాథమిక విద్య మాత్రమే అందించేవి. అంతేకాదు, వారి కోసం తప్పనిసరిగా వృత్తి సంబంధిత నైపుణ్యాలనే నేర్పించేవి. అంటే వారిని మానవ శ్రమకు లేదా చిన్నచిన్న వృత్తులకే పరిమితం చేసేవి. వారిని ఉన్నత మేధో విద్య వైపు తీసుకువెళ్లేవి కావు. 'కులం అన్నది మేధస్సును, ప్రతిభను నిర్ణయిస్తుంది" అనే అశాస్త్రీయ భావన ఈ వ్యవస్థ వెనుక ఉన్న ప్రధాన సూత్రం. దుర్మార్గమైన ఈ దృక్పథం నేటి సమాజపు భావజాలంలో కూడా ఆందోళన కలిగించే స్థాయిలో కొనసాగుతూనే ఉంది.

అనేకమంది చరిత్రకారులు చెప్పినట్లుగా రాజ్యం విమోచనకు బదులుగా నియంత్రణ విధానాన్ని అనుసరించింది.

సంప్రదాయంగా ప్రాధాన్య వర్గాలకు చెందిన పిల్లలను భావోద్వేగపరంగా, లైంగికంగా సున్నితులుగా చూపుతూ, వారికి దీర్ఘకాలిక తల్లిదండ్రుల, సంస్థాగత రక్షణ అవసరమన్న భావన ముందుకువచ్చింది. విద్యా వ్యవస్థను వారి భావోద్వేగ, మేధోభివృద్ధికి అనుగుణంగా రూపొందించారు. భవిష్యత్తులో నాయకత్వ స్థానాలను చేపట్టేలా, వృత్తిపరమైన, నిర్వహణా ఉద్యోగాల్లో స్థానం సంపాదించేలా పాఠశాలలు వారిని తీర్చిదిద్దాయి. ఈ పక్షపాతం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

తాజాగా ఎన్ఇపి ప్రవేశపెట్టిన వృత్తి విద్యల వ్యవస్థ ఈ వివక్షాత్మక ధోరణిని మళ్లీ బలపరిచే ప్రమాదం ఉంది. నైపుణ్యాభివృద్ధి (స్కిల్లింగ్)ని సాధికారతగా చూపించినా, బలమైన రక్షణలు, పైకి ఎదిగే మార్గాలు లేక పోతే, అది అణగారిన వర్గాల పిల్లలను తక్కువ వేతనం, అస్థిరమైన ఉద్యోగాల్లోకి నెట్టివేస్తుంది. అంతర్జాతీయ మూలధన ప్రయోజనాల కోసం పనిచేసే పనులకు పరిమితం చేస్తుంది. ఇది ముందుగానే విభజనకు దారితీస్తుంది. అంటే పిల్లలను వారి ఆసక్తి, సామర్థ్యాల ఆధారంగా కాకుండా పుట్టుకతో వచ్చిన సామాజిక-ఆర్థిక పరిమితులపై ఆధారపడి వేరు చేస్తుంది. సిలబస్‌లో 'శ్రమకు గౌరవం' గురించి ఎంత చెప్పినా, శ్రమే కులపరమైనముద్రతో నిండి ఉన్న సమాజంలో ఆ నినాదం శూన్యంగా, అర్థ రహితంగానే మారిపోతుంది. ఈ భావజాల పోరాటాలు 'బాల్యం'అనే భావన నిష్పాక్షికం కాదనీ, అన్ని చోట్ల ఒకేలా ఉండే విశ్వవ్యాప్త సమూహం కాదనీ చూపిస్తాయి. బాల్యం అంటే ప్రతి పిల్లవాడికి సరైన మద్దతు, పోషణను పొందే తాత్కాలిక జీవన దశ మాత్రమే కాదు, అది వారిని విభజించింది. రాజ్యం, ప్రైవేటు వ్యవస్థలు బాలలను అర్హులు, అనర్హులుగా వేరుచేసింది. మిషనరీల రికార్డులు చెబుతున్నట్లుగా 19వ శతాబ్దం నుండి 20వ శతాబ్దపు ప్రారంభ దశల్లో క్రైస్తవ మతంలోకి మారినవారు ముఖ్యంగా 'అంటరాని' కులాలకు చెందినవారే. చాలా సందర్భాల్లో వీరు తీవ్ర ఒత్తిడితోనే పాఠశాలల్లోకి అనుమతించబడ్డారు.

అదే సమయంలో, ఈ సమాజాలు పాఠశాలల్లో ప్రవేశించే హక్కు కోసం, దేవాలయాల్లో ప్రవేశించే హక్కు కోసం, రహదారులను ఉపయోగించే హక్కు కోసం, చెరువులు, బావుల నుండి నీళ్లు తోడుకునే హక్కు కోసం ఎన్నో దశాబ్దాలు పోరాడాయి. బాంబే ప్రెసిడెన్సీలో, 1882లో జ్యోతిరావు పూలే భారత విద్యా కమిషన్ (హంటర్ కమిషన్) ముందు ఇచ్చిన సాక్ష్యం అణగారిన వర్గాలను పాఠశాల విద్యకు దూరంగాఉంచిన తీరుకు అద్దం పడుతుంది. పూలే, ఆయన భార్య సావిత్రి బాయి, పూణెలో అమ్మాయిల కోసం, మహర్, మాంగ్ సమాజాల

పిల్లల కోసం పాఠశాలలను ప్రారంభించారు. అనాటి సమాజంలో దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ వారు వెనుకంజ వేయలేదు. కమిషన్‌కు ఆయన 'మన పిల్లలను ప్రభుత్వం చదివించదు. ప్రతి విషయంలో మనం పక్కన పెట్టబడ్డాం' అని చెప్పారు. ఫూలే ఈ చేసిన విమర్శ, వలసపాలన విధానాల్లో దాగి ఉన్న వెలివేత భావజాలాన్ని వెలికితీసింది. రాజ్యం తన పాత్రను తిరిగి నిర్వచించుకోవాలని తేల్చి చెప్పింది. అధికారిక నివేదికలో చోటుచేసుకున్న ఇటువంటి వ్యాఖ్యలు బహిష్కరణల ద్వారా జరిగే సామాజిక హింసకు సమకాలీన సాక్ష్యాలుగా నిలిచాయి.

అదే సమయంలో అణగారిన వర్గాల సమాజాలు పాఠశాల విద్యను పొందాలన్న ఆత్రుతను కూడా ఇవి నమోదు చేశాయి. ఈ సమాచారం కారణంగా, కార్మికులు, తక్కువ కులాలకు చెందినవారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక లేదా రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేయాలనీ, మరింత సౌలభ్యాలు, ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ కమిషన్ సిఫారసు చేసింది. ఇవి పరిమితమైన సూచనలే అయినా, సామాన్య విద్యకు కుల పక్షపాతం ప్రధాన అడ్డంకి అని అధికారికంగా గుర్తించిన తొలి సందర్భాలలో ఒకటిగా అవి నిలిచాయి. ఇది ఫూలే వంటి కార్యకర్తలు చాలా కాలంగా చెబుతూ వచ్చిన నిజం.

❝ శ్రీ నారాయణ గురు ప్రసిద్ధ సూక్తి 'సంసిద్ధత ద్వారా బలపడాలి, విద్య ద్వారా విముక్తి పొందాలి' అనేది ఆ కాలపు వ్యూహాన్ని అద్భుతంగా ప్రతి బింబించింది. రాజ్యం విద్యాసంస్థల తలుపులు పూర్తిగా తెరవకపోతే, అణగారిన వర్గాలు తామే సంఘటితమై పాఠశాలలను నిర్మించుకోవాలి, అదే సమయంలో ప్రభుత్వంపై ఒత్తిడి కూడా కొనసాగించాలి అన్నది ఆ భావం. ఈ విధంగా, విజ్ఞప్తులు, స్వతంత్ర ప్రయత్నాలు కలిసి ఒక నమూనాగా అనేక ప్రాంతాల్లో రూపుదిద్దు కున్నాయి. ❞




### అణగారిన వర్గాలు తమ భవిష్యత్తును స్వయంగా తీర్చిదిద్దుకున్న సందర్భం

ఆ సమయంలోనూ, ఆ తర్వాతి దశల్లో కూడా అణగారిన కులాలు, పేద సమాజాలు స్వయంగా విజ్ఞప్తులు తయారు చేసి పాఠశాలల్లో ప్రవేశాన్ని కల్పించాలని వలస ప్రభుత్వాన్ని, సంస్థాన రాజ్యాలను కోరాయి, దక్షిణ కేరళలో ఉన్న ట్రావన్కోర్‌ను ఉదాహరణగా తీసుకుందాం. అణచివేతకు గురైన 'యజవ' కులస్తులు సమర్పించిన వరుస మెమోరాండాలు ఒక ముఖ్యమైన సంఘటనగా నిలిచాయి. వీరు చాలా కాలం వివక్షకు గురైనవారు. 1891లో 'మలయాళి మెమోరియల్' కు వీరు మద్దతు ఇచ్చారు. దీనిద్వారా స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని కోరారు. కానీ ఈ డిమాండ్ తరువాత ప్రధానంగా ఉన్నత కుల నాయర్ల ప్రయోజనాలకే ఉపయోగపడింది. దీంతో డాక్టర్ పాల్పు నాయకత్వంలో యజవ కులస్తులు 1895-1896లో తమ స్వంత మెమోరాండాలను సమర్పించారు. వేలాది మంది సంతకాలు చేసిన వీటిని ఇంగ్లీషులో రాశారు. వీటిలో యజవలు ఎదుర్కొన్న అన్యాయాలు, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ నిరాకరణను నమోదు చేశారు. అలాగే, వారు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ హక్కు, ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలను స్పష్టంగా డిమాండ్ చేశారు. ఇలాంటి విజ్ఞప్తుల ప్రాముఖ్యత ఏమిటంటే అణగారిన సమాజానికి విద్య హక్కు కావాల్సిందే అన్న వాదనను అవి స్పష్టమైన భాషలో, చారిత్రక రూపంలో నమోదు చేశాయి.

వీటికి ట్రావన్కోర్ ప్రభుత్వపు ప్రారంభ స్పందన చాలా పేలవంగా ఉంది. 'యజవలు విద్య కోరుకుంటే, వారి కోసం కొద్ది చోట్ల వేరే పాఠశాలలు ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని దివాన్ (ప్రధాన మంత్రి) సమాధానమిచ్చాడు. ఇలా చెప్పి చివరకు రెండు ప్రాథమిక పాఠశాలలను మాత్రమే ప్రారంభించారు. ఈ అరకొర చర్య యజవలను ప్రస్తుత విద్యాసంస్థల్లో ప్రవేశించే దిశగా ఎటువంటి ప్రోత్సాహాన్ని ఇవ్వకపోగా, ఆ సమాజ నాయకులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే, ఈ నిరుత్సాహకరమైన స్పందనే 1903లో ఒక శక్తివంతమైన సంస్కరణ సంస్థ ఏర్పాటుకు దారితీసింది. తత్వవేత్త శ్రీ నారాయణ గురు నాయకత్వంలో స్థాపితమైన 'శ్రీ నారాయణ ధర్మ పరిపాలన యోగం' ప్రధాన లక్ష్యాలలో విద్య ఒక్కటిగా నిలిచింది. శ్రీ నారాయణ గురు ప్రసిద్ధ సూక్తి 'సంసిద్ధత ద్వారా బలపడాలి, విద్య ద్వారా విముక్తి పొందాలి' అనేది ఆ కాలపు వ్యూహాన్ని అద్భుతంగా ప్రతిబింబించింది. రాజ్యం విద్యాసంస్థల తలుపులు పూర్తిగా తెరవకపోతే, అణగారిన వర్గాలు తామే సంఘటితమై పాఠశాలలను నిర్మించుకోవాలి, అదే సమయంలో ప్రభుత్వంపై ఒత్తిడి కూడా కొనసాగించాలి అన్నది ఆ భావం. ఈ విధంగా, విజ్ఞప్తులు, స్వతంత్ర ప్రయత్నాలు కలిసి ఒక నమూనాగా అనేక ప్రాంతాల్లో రూపుదిద్దుకున్నాయి.

ఇది 20వ శతాబ్దంలో మరింత దృఢమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన పోరాటాలకు పునాది వేసింది. వలస పాలనలోని భారతదేశంలో దళితుల విద్యా హక్కు కోసం జరిగిన అత్యంత ప్రభావవంతమైన ఉద్యమాల్లో ఒకదానికి ట్రావన్కోర్‌లో అయ్యంకాళి నేతృత్వం వహించారు. అయ్యంకాళి, 'అంటరాని' వారిగా

**“ నూతన విద్యా విధానం (ఎన్ఇపి) తరగతి గది బయట పిల్లలు ఎదుర్కొనే అడ్డంకుల విషయంలో ఆశ్చర్యకరంగా నిశ్శబ్దంగా ఉంది. ఉదాహరణకు, 2016లో వచ్చిన చైల్డ్ లేబర్ (నిషేధం మరియు నియంత్రణ) చట్ట సవరణ, 14 ఏళ్ల లోపు పిల్లలకు పాఠశాల సమయం తరువాత కుటుం బ వ్యాపారాల్లో పనిచేయడానికి అనుమతి స్తుంది. దీనిని ‘సాంస్కృతికంగా సున్నితమైన చర్య’గా చూపించినా, ఇది వాస్తవానికి బాలల చేత పనిచేయించు కోవడానికి చట్టబద్ధత ఇచ్చినట్టే అయ్యింది.”**

భావించే పులయ కులానికి చెందిన వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించారు. ప్రత్యక్ష చర్యలు, చర్చలు రెండింటినీ ఉపయోగించి, పాఠశాలలు సహా అన్ని ఉమ్మడి ప్రదేశాలపై కొనసాగుతున్న కుల ఆధిపత్యాన్ని ఆయన సవాలు చేశారు. 20వ శతాబ్దపు ప్రారంభంలో, కాగితాలపై అయినా కొన్ని కుల పరిమితులు సడలాయి. ఉదాహరణకు, కొన్ని కులాలు ఉమ్మడి రహదారులను ఉపయోగించరాదన్న ఆచారాన్ని అధికారికంగా రద్దు చేశారు. కానీ వాస్తవంలో మాత్రం పులయలు, ఇతర దళితు లను ప్రభుత్వ పాఠశాలల్లోకి అనుమతించ కుండా స్థానిక కులవాద శక్తులు అడ్డుపడుతూనే ఉన్నాయి. 1904లో అయ్యంకాళి ఆయన సహచరులు స్వయంగా ముందడుగు వేసి, వెంగనూరులో తమ స్వంత పాఠశాలను ప్రారం భించారు. ఈ చిన్నపాటి పాఠశాల ఏర్పాటు కూడా ఒక గొప్ప ప్రకటనే! అత్యంత పేద ‘అంటరాని’వర్గాలకు చెందినవారికీ ఆధునిక విద్యపై ఎంత ఆకాంక్ష ఉందో అది చూపిం చింది. కానీ ప్రతిస్పందన వేగంగా, హింసాత్మ కంగా వచ్చింది. దళిత పిల్లలు చదువుకుంటున్న దృశ్యం చూసి ఆగ్రహించిన ఉన్నత కులాల వ్యక్తులు దాడి చేసి పాఠశాలను తగలబెట్టేశారు. ఈ దాడి సంఘటన స్థానిక చరిత్రల్లో ఒక పెద్ద మలుపుగా నమోదైంది. దళిత విద్యను అడ్డుకునేందుకు ఉన్నత వర్గాలు ఎంత దారుణమైన హింసకైనా సిద్ధమని ఇది స్పష్టం చేసింది.

1920ల నుంచి 1930ల నాటికి పేదలు, అణగారిన కులాల విద్యా హక్కు కోసం జాతీయ స్థాయిలో గొంతెత్తిన నాయకుడు డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ (1891-1956). తన స్వీయ అనుభవాలు, సేకరించిన వాంగ్మూ లాలను ఆధారంగా తీసుకుని, దళితులను పాఠశాలల దరిదాపులకు కూడా రానివ్వని అవమానకరమైన అడ్డంకులను వివరించారు ఆయన. 1927లో బాంబే లెజిస్లేటివ్ కౌన్సిల్ ముందు చేసిన ఒక శక్తివంతమైన ప్రసంగంలో, అంబేద్కర్ తరగతి గదిలో కులం క్రూర వాస్త వంగా ఎలా ప్రత్యక్షమవుతుందో వివరించారు. అవి ఆయన స్వంత అనుభవాల నుంచే వచ్చి నవి. అంటరాని పిల్లలను అరుదైన సందర్భాల్లో పాఠశాలలో చేర్చినా, వారి ఉనికిని అగ్రకులస్తులు ఏమాత్రం సహించేవారు కారు. ‘పవిత్రమైన’ తరగతి గదుల లోపల కూర్చోనివ్వక, బయట కూర్చోబెట్టిన దళిత పిల్లలకు మౌలిక హక్కులైన తాగునీటిని కూడా నిరాకరించేవారు. అగ్రకుల హిందూ విద్యార్థులను శిక్షించాల్సి వస్తే కర్రతో కొట్టే వారు. దళిత విద్యార్థులను కొట్టాల్సివస్తే రాళ్లతోనో, మట్టి కుండ ముక్కలతోనో కొట్టేవారు. అలా చేస్తే గురువుల ‘పవిత్రత’ భంగం చెందదని భావించేవారు. అంబేద్కర్ వర్ణించిన ఈ అనుభ వాలు సాధారణ విమర్శ మాత్రమే కాదు. అవమానం, బహిష్కరణ పునాదులుగా నిర్మిత మైన విద్యావ్యవస్థపై ఒక విస్ఫోటనంలా మారాయి. అంబేద్కర్‌కు పేదరికం కూడా పెద్ద అడ్డంకి అని స్పష్టంగా తెలుసు. కాబట్టే ఆయన వలస ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దళిత విద్యార్థుల కోసం ప్రత్యేక పథకాలు, ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. 1924లో ఆయన డిప్రెస్డ్ క్లాసెస్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించారు. అలాగే బొంబాయి సహా అనేక పట్టణాల్లో దళిత విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఇంట్లో ఎదురయ్యే కులపీడన నుంచి దూరంగా, సురక్షిత వాతావరణంలో చదువు కునే అవకాశం కల్పించడమే ఆయన లక్ష్యం. ఆధునిక పండితులు చెబుతున్నదేమిటంటే, అణగారిన కులాల విద్యా పోరాటాలు, విస్తృత మైన కుల వ్యతిరేక ఉద్యమంతో విడదీయలేని సంబంధం కలిగిఉన్నాయి. విద్య అనేది ఉద్యోగం దొరకడానికి మాత్రమే ఉపయోగపడే సాధనం కాదు. కుల వివక్షను సవాలు చేయడా నికి, సమానత్వ సాధనకు ఉపయోగపడే సాధనం! రోసలిండ్ ఓ హాన్లన్ అభిప్రాయం ప్రకారం, జ్యోతిరావు పూలే వంటి వారు అక్షరాస్యతను బ్రాహ్మణిక శాస్త్రాలు, కుల ఆధిపత్యాన్ని న్యాయబద్ధం చేసిన గ్రంథాలను అర్థం చేసుకుని వాటిని సవాలు చేయగల ఒక శక్తిగా చూశారు. అదే సమయంలో, పండితులు వలస పాలన ప్రభుత్వపు పరిమితమైన పాత్రను కూడా విమర్శిస్తున్నారు. 1854 వుడ్స్ డిస్పాచ్, 1882 హంటర్ కమిషన్ వంటి సంస్కరణలను ప్రవేశపెట్టినా, దళిత విద్యకి ఇచ్చిన మద్దతు తరచూ చిత్తశుద్ధి లేనట్టుగానే ఉండేది. సవ్యసాచి భట్టాచార్య చెప్పినట్లు, బ్రిటిషర్లు అణగారిన వర్గాలను చదివించడంలో ప్రధానంగా ఆధిపత్య కులాలకు చెందిన సంస్క ర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలపై ఆధారపడ్డారు. బ్రిటిషర్లకూ, ఉన్నత కులాల సంస్కరణ వాదు లకూ విద్యకు ప్రాచుర్యం లభిస్తే సామాజిక వ్యవస్థ స్థిరత్వం కోల్పోతుందేమో అన్నభయం ఉండేది.

### నిజజీవిత అనుభవాల విస్మరణ

నూతన విద్యా విధానం (ఎన్ఇపి) ఈ అసమాన చరిత్రను విస్మరించింది. మౌలిక అక్షరాస్యత, బాల్య సంరక్షణ గురించి చెప్పే దాని దృక్పథం తరగతి గది బయట పిల్లలు ఎదుర్కొనే అడ్డంకుల విషయంలో ఆశ్చర్య కరంగా నిశ్శబ్దంగా ఉంది. ఉదాహరణకు, 2016లో వచ్చిన చైల్డ్ లేబర్ (నిషేధం మరియు నియంత్రణ) చట్ట సవరణ, 14 ఏళ్ల లోపు పిల్లలకు పాఠశాల సమయం తరువాత కుటుం బ వ్యాపారాల్లో పనిచేయడానికి అనుమతి స్తుంది. దీనిని ‘సాంస్కృతికంగా సున్నితమైన చర్య’గా చూపించినా, ఇది వాస్తవానికి బాలల చేత పనిచేయించుకోవడానికి చట్టబద్ధత ఇచ్చినట్టే అయ్యింది. ముఖ్యంగా అమ్మాయిలకు. ఎందుకంటే వారికి ఇంటిపనుల్లో ఉచిత శ్రమ చేయడం తప్పనిసరి అన్న భావన ఉంది.

లక్షలాది పిల్లలకు చదువు, పని మధ్య ఉన్న ఈ అస్పష్ట గీత పాఠశాల మానేయడం, బాల్యం కుదించుకపోవడం వంటి చర్యలకు దారి తీస్తుంది. ఎన్ఇపి ఆకాంక్షలకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దానిని కూడా అనుమానంతోనే చూడాలి. డిజిటల్ టెక్నాలజీ లు, లిబరల్ సిద్ధాంతాలు, పాపులర్ మీడియా ప్రభావంతో నేటి యువత స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ అనే కలలను నమ్ముతున్నారు. ఎన్ఇపి కూడా ఈ ధోరణినే ప్రోత్సహిస్తోంది. కానీ అధిక సంఖ్యలో విద్యార్థుల రోజువారీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లోపం, భాషా అడ్డం కులు, నిరంతర ఆర్థిక కొరతలతో సతమత

మౌతున్నాయి. బాల్య వ్యవహారాల ప్రముఖ నిపుణులు సరదా బాలగోపాలన్ చేసిన పరిశోధనల ప్రకారం అమ్మాయిలు, దళితులు, ముస్లింలు, వలస కుటుంబాల పిల్లలను ఈ విధానం ఉద్దేశ్యపూర్వకంగానే బయటకు నెట్టింది. అణగారిన తరగుతుల పిల్లలు ఎక్కువమంది తరగతి గదుల వెలుపల నేర్చుకుంటారు. పొలాల్లో, ఇళ్లలో, పట్టణ వీధుల్లో వీరి అధ్యయనం సాగుతుంది. కానీ విద్యావ్యవస్థ వారిపై 'విఫలమైనవారు'అని ముద్ర వేస్తోంది. చట్టబద్ధ హామీలు మాత్రమే ఈ పరిస్థితులను మార్చలేవు. జాతీయ విద్యా విధానం హక్కుల ఆధారిత వ్యవస్థ నుండి దూరమైతే అది ఈ తరహా జనాభాను దూరంగా పెట్టినట్టే!

> " విద్యా బోధన తరగతి గదులలో మాత్రమే జరుగుతుందన్న భావన కూడా ఒక భ్రమే! పిల్లలు పని, ఆట, భాష, కదలిక, సంరక్షణ ద్వారా నేర్చుకుంటారు. కానీ మన దేశంలోని పాఠశాల లు దీన్ని అరుదుగానే అంగీకరిస్తాయి. విద్య అనేది ఉద్యోగాలకు దారి మాత్రమే కాదు. అది న్యాయం, సమానత్వం, ప్రజాస్వా మ్యం యొక్క పునాది. ఈ దృష్టికోణం లేకుండా ఎన్ఇపి ఏ కొత్త ఆరంభాన్నీ ఇవ్వదు. "

నిజమైన సంస్కరణ 'ఫలితాల ఆధారిత ప్రమాణాల' కంటే చాలా ఎక్కువగా కోరుతుంది. అది నిర్మాణాత్మక ఆచరణను కోరుతుంది. పాఠశాలల్లో కులాన్ని పూర్తిగా అంతం చేయడం, మౌలిక సదుపాయాల్లో సమాన స్థాయిని నిర్ధారించడం, పిల్లలందరినీ పూర్తి హక్కులతో గౌరవించడం, వారిని భవిష్యత్ మార్కెట్ కార్మికుల్లా, ఉద్యోగాలకు సరిపెట్టడానికి ఉద్దేశించిన వస్తువులుగా కాకుండా చూడటం వంటివి లక్ష్యాలుగా విద్యను ప్రాథమిక హక్కుగా హామీ ఇచ్చే ఏకైక చట్టమైన 2009 నాటి విద్య హక్కు చట్టం నుండి ఎన్ఇపి తనను తాను దూరం చేసుకుంది. విద్యాహక్కును పేరుకే ప్రస్తావిస్తుంది కానీ, బాధ్యతగా స్వీకరించదు. ఈ లోటు కేవలం పరిపాలనా నిర్లక్ష్యం కాదు. ఇది ఒక భావజాలం. అంటే హక్కుల ఆధారిత వ్యవస్థ నుండి తప్పుకుని, స్వచ్ఛంద చర్యలు, ప్రైవేటుకు బాధ్యతలు అప్పగించడమే! దీనినే కొందరు 'పాలసీ ఆఫ్ ఆబ్సెన్స్' అని పిలుస్తారు. సమానత్వం కంటే 'మార్కెట్‌కు సిద్ధమైన' విద్యకు ప్రాధాన్యం ఇచ్చే విధానంలో, రాజ్యాంగం హామీ ఇచ్చిన విద్యా హక్కు ప్రాధాన్యత కోల్పోతుంది.

చివరికి ఇక్కడ పణంగా ఉన్నది కేవలం బోధనా విధానం మాత్రమే కాదు! అసలు విద్య అంటే ఏమిటి, అది ఎందుకు కావాలి అన్న దృష్టికోణం కూడా పణంగా పెట్టబడింది. పాఠశాల అనేది గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు విధేయ కార్మికులను తయారు చేసే స్థలమా? లేక విమర్శ నాత్మక ఆలోచన, నైతిక నిర్ణయం, ప్రజాస్వామిక భావనలను పెంచే స్థలమా? కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యావిధానం స్పష్టంగా మొదటి దిశ వైపే మొగ్గు చూపుతోంది. ఉత్పాదకత, ఫలితాలు, ప్రమాణీకరణపై కేంద్రీ కృతమైన దాని దృష్టి , సృజనాత్మకత, ఆశ్చర్యాన్ని ఆనందించే అవకాశాలను తగ్గిస్తుంది. ఫ్లెక్సి బిలిటీ ఉందని చెప్పినా అది కూడా పూర్తిగా కొలతలతో, మార్కెట్ అవసరాలతో స్క్రిప్ట్ చేసినది మాత్రమే!

విద్యా బోధన తరగతి గదులలో మాత్రమే జరుగుతుందన్న భావన కూడా ఒక భ్రమే! పిల్లలు పని, ఆట, భాష, కదలిక, సంరక్షణ ద్వారా నేర్చుకుంటారు. కానీ మన దేశంలోని పాఠశాలలు దీన్ని అరుదుగానే అంగీకరిస్తాయి. విద్య అనేది ఉద్యోగాలకు దారి మాత్రమే కాదు. అది న్యాయం, సమానత్వం, ప్రజాస్వా మ్యం యొక్క పునాది. ఈ దృష్టికోణం లేకుండా ఎన్ఇపి ఏ కొత్త ఆరంభాన్నీ ఇవ్వదు. అది పాత కథకే నిశ్శబ్దమైన, సుతిమెత్తని కొనసా గింపుగా మిగిలి పోతుంది.

(అనువాదం: పొగడ దొరువు)

# లక్ష కోట్ల డాలర్లు దాటిన చైనా వాణిజ్య మిగులు

*(28వ పేజీ తరువాయి)*

విద్యుత్ వాహనాలు, సోలార్ ప్యానల్స్ వంటి అధిక విలువ గల వస్తువులను ఎగుమతి చేయడం ప్రారంభించింది.

ప్రస్తుతం అది ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతిలో రారాజుగా ఎదిగింది. 2024లో చైనా ప్రపంచ వ్యాపితంగా అన్ని దేశాలకూ 1 లక్ష కోట్ల డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎగుమతి చేసింది. ఇతర పారిశ్రామిక దేశాల మాదిరిగానే అది తొలుత సరమైన, శ్రామికులను ఎక్కువగా ఉపయోగించే పరిశ్రమలతో ప్రారంభించి అతి క్లిష్టమైన రంగాలకు విస్తరించింది. అయితే ఇతర దేశాలతో పోలిస్తే చైనా చాలా వేగంగా, చాలా పెద్ద ఎత్తున ఎదిగి ప్రపంచ సరఫరా గొలుసుల్లో ఆధిపత్య స్థానానికి చేరుకున్నది.

అరుదైన ఖనిజాల వాణిజ్యంలో అది పూర్తి ఆధిపత్యం సాధించింది. స్మార్ట్ ఫోన్ల నుండి ఫైటర్ జెట్‌ల వరకు అన్ని రకాల ఆధునిక వస్తువులు ఈ అరుదైన ఖనిజాలు లేకుండా ఉత్పత్తి కావు. పీరియాడిక్ టేబుల్‌లోని 17 అరు దైన ఖనిజాల్లో 12 ఖనిజాలు చైనాలోనే దొరుకు తాయి. ప్రపంచ అరుదైన ఖనిజాల్లో 60 నుండి 70 శాతం చైనాలోనే దొరుకుతున్నాయి. ఈ ఖనిజాల ప్రాసెసింగ్‌లో 90 శాతం ఇక్కడే జరుగుతోంది.

చారిత్రకంగా చూస్తే ఫ్యాక్టరీ వస్తువుల వాణిజ్యంలో చైనాకు లభించిన మిగులు రెండో ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా సాధించిన వాణిజ్య మిగులుకన్నా ఎక్కువ. ఆనాడు రెండో ప్రపంచ యుద్ధంలో చితికిపోయిన దేశాలకు వస్తువులు అమ్మడం ద్వారా అమెరికా విపరీతమైన వాణిజ్య మిగులు సాధించింది.

చైనాతో వాణిజ్య లోటును తగ్గించుకోడానికి ప్రపంచంలోని వివిధ దేశాలు వివిధ రీతుల్లో ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

**ఈ ఆధిపత్యం ఎంతకాలం కొనసాగుతుంది?**

చైనా నుండి వాణిజ్యాన్ని ఇతర దేశాలకు తరలించడానికి అమెరికా, ఇతర ధనిక దేశాలు ప్రయత్నిస్తున్నప్పటికీ సమీప భవిష్యత్తులో చైనా ఎగుమతులు మందగించబోవని కొంతమంది అర్థిక వేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ ఎగుమతుల్లో 15 శాతంగా ఉన్న చైనా ఎగుమతులు మరో దశాబ్దం తరువాత 16.5 శాతానికి పెరగవచ్చునని మోర్గన్ స్టాన్లేకు చెందిన ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. ప్రపంచ అవసరాలు తీర్చడంలో చాలా త్వరగా అందిపుచ్చుకునే సామర్థ్యం చైనాకు ఉండడం వల్ల ఇది సాధ్యమవుతుందని వారు చెప్పారు. చైనా ఎగుమతులు ఇలాగే కొనసాగుతుంటే చైనా ప్రభుత్వం నిర్దేశించుకున్న 5 శాతం జిడిపి అభివృద్ధి రేటును కొనసాగించడం సులభమే అవుతుందని అంచనా వేస్తున్నారు.

(అనువాదం: ఎస్. వెంకట్రావు)

# ఒక దళిత యోధుని సమరగాథ

*(2వ పేజీ తరువాయి)*

ఆలోచించాడు. మహారాజా వారి సంవత్సరపు పూజా దినాన దళితులు ఆయన ఒక పెద్ద చిత్రపటాన్ని ఊరేగిస్తూ బయల్దేరారు. ఊరేగింపులోంచి మహారాజు చిత్రపటాలను తొలగించటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. మధ్యలో కొందరు రాళ్ళు విసిరినా లెక్కచేయకుండా దళితుల ఊరేగింపు పద్మనాభస్వామి దేవాలయం దగ్గరలో వున్న ఈస్టుపోర్టుకు చేరుకుంది. దుమ్ము, ధూళితో ఉన్న దుస్తులు ధరించిన ఈ నల్ల ఊరేగింపుదారులు దేవాలయం నుండి పూజప్పుర వరకు రహదారికి పక్కన వున్న పొలాల్లో నిలబడిపోయారు. ఆ రహదారి వెంట వెళుతున్న రాజావారు పొలాల్లో పోత పోసినట్టు నిలబడి వున్న దళితులను చూసి ఆశ్చర్యపోయారు. మహారాజుని మొట్టమొదటిసారి దర్శనం చేసుకున్న దళితులతో పొలాలన్ని నల్లని మేఘం కప్పుకొని వున్నాయని ఒక కవి వర్ణించాడు. అప్పటిదాకా తాను చూడని ఈ దళిత సమూహాన్ని చూసి మహారాజు ఆశ్చర్యపోయాడు. అగ్రవర్ణాల వారికి కోపం తెప్పించే రెండు ధిక్కారాలకు దళితులు పాల్పడ్డారు. ఒకటి రహదారుల మీద నడవటం, రెండు మహారాజు గారిని చూడటం. ప్రతీకారం తలపెట్టారు. మానక్కాడులో దళితులపై దాడి చేశారు. దీనిని ముందుగానే వూహించిన అయ్యంకాళి యుద్ధంలో ఒక జనరల్ మాదిరి తన దళితసేనను సముద్రతీరం నుంచి విలియాం గుండా వెంగనూరుకు క్షేమంగా తరలించాడు. ధైర్యసాహసాలు కలవాడిగా, ఆజ్ఞాపించే శక్తి కలవాడిగా అయ్యంకాళి ఒక్క తన కులానికి సంబంధించిన నాయకుడిగానే కాకుండా సాధుజన పరిపాలనా సంఘానికి నాయకుడయ్యాడు.

**కేరళలో మొదటి కూలీల సమ్మె**

దళిత పిల్లల్ని బడిలో చేర్చుకోవాలని సాధుజన పరిపాలనా సంఘం చేసిన అనేక పోరాటాల ఫలితంగా 1907లో ప్రభుత్వం ఈ మేరకు దళితులని బడిలో చేర్చుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి రాజాగారి దివాను రాజాగోపాలాచారి దళితులకు మద్దతుగా వుండేవారు. అయితే పైనుండే అగ్రకుల అధికారులు ఈ ఉత్తర్వులను బయటికి రాకుండా చూసేవారు. అయ్యంకాళి ఎలాగోలాగా ఒక ఉత్తర్వును సంపాదించి విద్యాశాఖాధికారులకు ఈ ఉత్తర్వులు అమలుపరచమని కోరాడు. కానీ భూస్వాముల ఆధీనంలో వున్న ఏ పాఠశాలా ఈ ఉత్తర్వును పాటించలేదు. అప్పుడు అయ్యంకాళి మీరు మా పిల్లలను చదవనివ్వకపోతే మీ పొలాల్లో పిచ్చిగడ్డి మొలుస్తుంది. మీ పొలాలు బీళ్ళు పడతాయి అని చెబుతూ సమ్మెకు పిలుపిచ్చాడు. పొలాల్లో పనిచేసే కూలీలను పర్మినెంటు చెయ్యాలనీ, పనుల్లేని దినాలకు వారికి జీతం ఇవ్వాలనీ, వారి పిల్లలకు బడికెళ్ళే హక్కు కల్పించాలని తదితర డిమాండ్లతో సమ్మె ప్రారంభమైంది. భూస్వాములు సహజంగానే ఈ డిమాండ్లకు అంగీకరించలేదు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి జరిగిన వ్యవసాయ కూలీల సమ్మె ఇది. కానీ, ఇక్కడ ఊరేగింపులు లేవు. సైరను మోగిస్తూ తిరిగే జీపుల్లేవు. కరపత్రాలు లేవు, బ్యానర్లు లేవు. అయ్యంకాళి మాటపై కండలా, కన్నియాపురం, పల్లిచెల్, ముదవుప్పార నుంచి విలియం దాకా పొలాల్లో ఒక్క కూలీ కనపడలేదు, పీచుమని పిట్ట లేదు. సమ్మెగట్టిన కూలీలను చూసి భూస్వాములు నవ్వుకున్నారు. కడుపు కాలితే వాళ్ళే వస్తారు అని ఎగతాళి చేశారు. కృష్ణపిళ్లె అనే భూస్వామి కూలీల విశ్వాసాన్ని దెబ్బతీయటానికి, వాళ్ళని బెదిరించడానికి ఒక గ్రూపును తయారు చేసి వాళ్లను కొట్టడం ప్రారంభించాడు. వీళ్ళకు లొంగేదేంటి అని ఒక డజను మంది భూస్వాముల్ని పొలాల్లోకి దింపి పని ప్రారంభించాడు. కొందరు భూస్వాములు వరి నాట్లు వేశారు. కానీ, పంట రాలేదు. ఎండలో పనిచేసినందుకు కొందరు భూస్వాములకు ఆరోగ్య సమస్యలొచ్చేవి. భూస్వాములు, కూలీలు ఇద్దరికీ తిండిగింజల కొరత మొదలైంది. అనంతమైన ఆకలి కూలీలను నిర్వీర్యం చేసింది. ఇలాంటి సమయంలో అయ్యంకాళి ఒక ఎత్తుగడ వేసి విలియంలోని మత్స్యకారులతో కలిసి ఒక ఒప్పందానికి వచ్చాడు. కూలీల కుటుంబాల నుంచి ఒక్కొక్కరిని చేపల పడవ మీద పనికి తీసుకెళ్ళేటట్లు, చేపల్లో కొంత వాటా ఇచ్చేటట్లు వాళ్ళతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. సమ్మె పూర్తయ్యేవరకు ఇది కొనసాగింది. భూస్వాములు కూలీల చేతుల్లో ఓడిపోవటం అనివార్యం అయ్యింది. వారు కూలీల మీద దౌర్జన్యానికి దిగారు. అత్యాచారాలు చేశారు. కూలీల ఇళ్లు తగలబెట్టారు. కూలీలు ప్రతిఘటించారు. ఎప్పుడు ఏ దాడి జరుగుతుందో అని భూస్వాములు భయపడ్డారు. కొన్ని శాంతి ప్రతిపాదనలతో భూస్వాములు రాజీకి వచ్చారు. ఇరు వర్గాల మధ్య రాజీ కుదర్చడానికి దివాన్ ఒక మధ్యవర్తిని కూడా పంపాడు. కూలీల వేతనాలు పెంచటానికి, స్వేచ్ఛగా ప్రయాణించే హక్కు, పిల్లలను బడిలో చేర్చుకునే హక్కును సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇది జరిగిన తరువాత అయ్యంకాళి భూస్వాముల ఏకైక శత్రువు అయ్యాడు. అయ్యంకాళిని ప్రాణంతో పట్టి తెచ్చినవారికి రూ॥2000, చంపి తెచ్చినవారికి రూ॥1000 తలకు వెల కట్టారు. ఫలితంగా చాలా నెత్తురు పారింది. కానీ, అయ్యంకాళి చెక్కు చెదరకుండా నిలబడ్డాడు.

**ప్రజాసభ సభ్యులు**

మహారాజావారి ప్రజాసభలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజా ప్రాతినిథ్యం వుండేది. ప్రజాసమస్యలను, ఫిర్యాదులను రాజు దృష్టికి తెచ్చేందుకు ఈ సభ ఉపయోగపడేది. కానీ, జనాభాలో 5 లక్షల మందిగా వున్న పులయాలకు మాత్రం సవర్ణుడైన పి.కె గోవిందు పిళ్లె ప్రాతినిథ్యం వహించారు. మానవతావాది అయిన పిళ్లె 1911 ఫిబ్రవరి 18న సభలో మాట్లాడుతూ కనీసమైన మానవహక్కులు, స్వేచ్ఛ కూడా దళితులకు ఇవ్వటం లేదు. ఫలానా చోట ప్రభుత్వ భూమి వుంది, మేం ఆ భూమిలో పండించుకుంటాం అని కోరినప్పుడల్లా అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నారు. వారికి చదువుకునే హక్కు లేదు, ప్రభుత్వం వారికి భూమిని, చదువుకునే హక్కుని కల్పిస్తే ఈ అభాగ్యులకు ఏ సహాయం అక్కర్లేదు అని గోవిందుపిళ్లె అన్నారు. ప్రజాసంఘ సభ్యుడిగా అయ్యంకాళిని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన విని సభలో వారు గంగవెర్రులెత్తారు. ఒక అంటరాని వాడు ఈ గౌరవ సభలో నిలబడి మాట్లాడటమా అని గొడవ చేశారు. అయినా గోవిందు పిళ్లె ప్రతిపాదనని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్య మీద బడుగుజీవుల విముక్తి ఆధారపడి వుందని అయ్యంకాళి నమ్మాడు. చదువుకోవడానికి పిల్లలను బయట రాష్ట్రాలకు పంపటం ఆర్థికంగా వెసులుబాటు కాదని తెలుసు. అయ్యంకాళి చివరకు ప్రజాసభ సభ్యుని హోదాలో దివాన్ కార్యాలయానికి వెళ్లాడు. కానీ, అక్కడి కాపలాదారులు అతనిని లోపలికి అనుమతించలేదు. అయ్యంకాళి బయటకు వెళ్ళి దివాన్ పేరిట టెలిగ్రామ్ ఇచ్చారు. నిముషాల లోపున అయ్యంకాళిని అనుమతించండి అని దివాన్ ఇచ్చిన ఆజ్ఞతో అయ్యంకాళి దివాన్‌ను కలిశాడు. ప్రభుత్వ భూముల మీద మాకు పట్టాలు కేటాయించటంపై చేసిన వాగ్దానం మేరకు మేము అధికారులకు దరఖాస్తు చేసుకున్నాం. కానీ, రెవెన్యూ శాఖలో వున్న ఉద్యోగులు భూస్వాములతో కుమ్మక్కై అగ్రవర్ణ కుటుంబాలకు ప్రభుత్వ భూముల్ని కేటాయించారు. అంతేకాదు, అడిగినందుకు మమ్మల్ని ఊళ్ళ నుంచి, ఇళ్ళ నుంచి తరిమేశారు. చివరికి మేము వున్నది కూడా పోగొట్టుకున్నాం. అందుకోసం మాకు ప్రభుత్వ భూమి కేటాయించాలని నిరక్షరాస్యుడైన ఒక

పులయనేత అయ్యంకాళి ప్రసంగం దివాన్‌ను ఆకర్షించింది. పులయాలకు సహాయపడటానికి ప్రభుత్వం 500ల ఎకరాల భూమి విలాప్పిల్ పగుతీలో ఇచ్చింది.

### పెరినాడు అల్లర్లు

దళిత స్వాతంత్ర్యం కోసం పోరాటం కొనసాగుతూనే వుంది. డిమాండ్లు, వేతనాల సవరణ పనిగంటల తగ్గింపు దాకా ఎదిగాయి. భూస్వాముల కూలీలలతో క్రూరంగా ప్రవర్తించ సాగారు. దళితుల్లో యువకులు అగ్రవర్ణాల దౌర్జన్యాన్ని ప్రతిఘటించడానికి సర్వసన్నద్ధ మవుతున్నారు. ప్రథమ ప్రపంచ యుద్ధం వల్ల ఆర్థిక పరిస్థితులు కడా పూర్తిగా దిగజారాయి. కూలీలు రోజులో 11గం॥ 12గం॥ల దాకా పనిచేసినా భూస్వామి సంతృప్తి చెందటం లేదు. ఒకరోజు కూలీగా ఒకటిన్నర కిలోల ధాన్యం ఇస్తే దాంట్లో అరకిలో తాలు వుండేది. కూలీగా ఇచ్చిన ధాన్యంలో భూస్వాములు ఆ తాలును చెరిగేవారు కాదు. పనికి కొంచెం ఆలస్యంగా వచ్చినా తన్నులే. ఉతికిన బట్టలు వేసుకున్నా తన్నులే. దళితులందరూ మోకాళ్ళ పైనుంచి ఛాతి వరకు మాత్రమే దుస్తులు ధరించాలి. తేడా వస్తే చెట్టుకు కట్టేసి కొట్టేవారు. దళిత కూలీకి కుటుంబ సంబంధాలు వుండకూడదు. భూస్వామి లాలస కోసం కూలీల గుడిసెల మధ్యలో ఒక ప్రత్యేక గుడిసె ఏర్పాటు చేయాలి. దళిత కూలీల ఇంట్లోని మహిళలు భూస్వామి కోరికలు తీర్చాలి. ఇది దురాచారం. ఆ దశలో అయ్యంకాళి దళిత మహిళలకు ఒక సందేశం ఇచ్చారు. మెడ చుట్టూ వేసుకునే చెక్కిన రాతి నక్లీసులను విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ నక్లీసులు బానిసతనానికి గుర్తు. మెడల మీదుగా చనుకట్టు పై వేలాడే ఆ గొలుసులు తప్ప దళిత మహిళలు పైన ఏమి ధరించకూడదనేది అప్పటిదాకా ఆచారం. అవి పాముల్లా వేలాడేవి. గాజుతోనూ, రాళ్ళతోనూ చేసిన ఈ గొలుసులు దళిత మహిళల మెడ చుట్టూ కప్పేసి వుండేవి. మణికట్టు చుట్టూ కట్టుకునేవారు. చెవులకి జూకాల్లాగా ఇనపాభరణాలు వుండేవి. బానిస గుర్తులకు వ్యతిరేకంగా అయ్యంకాళి పోరాటం ప్రారంభించారు. ఆ పోరాటంలో విజయం సాధించారు. పాత సాంప్రదాయాలు విడనాడాలనే అయ్యంకాళి ఇచ్చిన పిలుపు సవర్ణులైన కొల్లాములను ఒక ఊపు ఊపింది.

### పులయ దేవాలయ ప్రవేశ ఉద్యమం

1917లో 2 వేల మంది పులయాలతో ఒక చారిత్రకాత్మకమైన ఊరేగింపు నిర్వహించి చెంగలూరు దేవాలయంలోకి ప్రవేశించాడు అయ్యంకాళి. దేవాలయ ప్రవేశం ఆర్డినెన్స్ వెలివడే కన్నా పదేళ్ళు ముందు ఇది జరిగింది. అందువల్ల దీన్ని దేశంలోనే మొట్టమొదటి దేవాలయ ప్రవేశంగా పేర్కొనవచ్చు. అంటరాని వాళ్ళ కోసం, దళితుల కోసం చివర వరకు పోరాడిన సంస్కర్త శ్రీ అయ్యంకాళి. నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం శ్రీ నారాయణ గురు చేపట్టిన కార్యక్రమాలు దళితులు చైతన్యానికి ఉపయోగ పడేవి. దక్షిణ మధ్య కేరళలో నిమ్నవర్గాలు సంస్థలు స్థాపించిన తరువాత పోరాటాలు మలబార్కుకు కూడా వ్యాపించాయి. చిరగల్ తాలూకాలో అంటరాని వాళ్ళు తమ డిమాండ్‌ల సాధనకు కదలటంతో అక్కడి పోలీసులు వాళ్ళను చితకబాదారు. ఈ దౌర్జన్యాలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా కొందరు సామాజిక కార్య కర్తలు సత్యాగ్రహం జరపాలని నిర్ణయించారు. 30సంవత్సరాల సేవ, అనేక పోరాటాల వల్ల సాధు జన పరిపాలనా సంఘం ఒక మహా సంస్థగా ఆవిర్భవించింది. తరతరాలుగా అనుభవిస్తున్న బాధల నుండి న్యూనత నుండి కొద్దిపాటి ఉపశమనం కలిగింది. దళితుల దేవాలయ ప్రవేశం గొప్పవారి గొప్పబుద్ధి వల్ల సాధ్యమైందని, చరిత్రకారులు చెప్పవచ్చు. కానీ, దేవాలయాల గేట్లు అందరికీ తెరుచుకోవటం వెనుక దళితుల జీవన్మరణ పోరాటాలు, నెత్తుటి త్యాగాలు, నిరవమాన ధైర్యసాహసాలు ఉన్నాయన్నది చారిత్రక నిజం.

### అయ్యంకాళి - మహాత్మాగాంధీ

నిరక్షరాస్యుడు, అంటరాని బుద్ధిశాలి అయ్యంకాళి గురించి మహాత్మాగాంధీ విన్నారు. ఒక అంటరాని వారికే కాదు, కేరళ ప్రజలకు అయ్యంకాళి చేసిన సేవలు కూడా గాంధీకి తెలుసు. 1937లో కేరళలో ఒక మారుమూలన వున్న వెంగనూరులో అయ్యంకాళిని కలుసుకోవటానికి మహాత్మాగాంధీ వెళ్ళారు. అయ్యంకాళిని చేరువుగా తీసుకొని కూర్చోపెట్టుకోవటం, అక్కడ కూడిన పెద్దలకు దిగ్భ్రాంతిని కలిగించింది. గాంధీ మాట్లాడుతూ నువు చేస్తున్న పనంతా నాకు తెలుసు, నేను కూడా నీ వయసువాడినే, మనిద్దరం స్వేచ్ఛకోసం పోరాడుతున్నాం, మీ పనిని కొనసాగించండి అన్నారు. దానికి అయ్యంకాళి, మహాత్మాజీ మీ దయను నేను మర్చిపోలేను. మేము బడిలో చదువుకునే స్వేచ్ఛ సంపాదించాం. దేవాలయాల్లో పూజల కోసం ప్రవేశాన్ని సాధించాం. బానిస బంధాలను తెగదెంచేదానికి పోరాడుతున్నాం అన్నాడు.

ఇంకా మీ ప్రజలకు ఏం కావాలని గాంధీ అడిగారు. నేను చనిపోయేలోపు దళితుల్లో 10మంది బి.ఏ గ్రాడ్యుయేట్స్‌ను చూడాలని వుంది అని అయ్యంకాళి విన్నవించారు. నీ పని కొనసాగించు, నీ కోరిక తీరుతుంది అని గాంధీ చెప్పారు. జాతీయోద్యమంలో కూడా అయ్యంకాళి తనవంతు పాత్రను నిర్వహించారు. జాతి విముక్తి పోరాటాలకు ఆకర్షితులైన యువకుల విప్లవ ఉత్తేజాన్ని ఆయన చూశాడు. జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో ఎవరి పాత్ర వారు పోషించాలని దీర్ఘకాలంలో దేశభక్తులు ఈ ప్రవంతిలో ఉండాలని ఆయన కోరారు. శారీరక శ్రమ చేసేవారంతా నా సోదరులు. రోజంతా కష్టపడి శ్రమ మర్చిపోవడానికి ఆడ, మగా కలిసి కల్లు దుకాణానికి వెళ్ళటం తగదని, ఇది కుటుంబాల్లో దరిద్రాన్ని పెంచుతుందని, మనలో శుభ్రత, సుచి లేకుండా చేస్తుందని, మన ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుందని, కనుక మనం తాగకూడదని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఆ సమావేశానికి వేలాదిమంది హాజరయ్యారు. అయ్యంకాళి ఆరోగ్యం క్షీణించటం ప్రారంభమయ్యింది. ఉబ్బసం ఆయనను ఇబ్బంది పెట్టింది. 1941 కల్లా అయ్యంకాళి పూర్తిగా లేవలేని స్థితికి చేరుకున్నారు. 1941, జూన్ 18న ఉబ్బసం వ్యాధితో ఆయన మరణించారు. ఆవిధంగా ధైర్యసాహసాలు కలిగిన ఒక దళిత పుత్రుడు తన జీవిత కోర్కెలు సఫలమయ్యే సమయం ఎంతో దూరం లేదన్న సంతృప్తితో ప్రశాంతంగా మరణించారు.

అయ్యంకాళి నాయకత్వంలో జరిగిన 1907 చారిత్రాత్మక వ్యవసాయ కూలీల సమ్మె దేశానికే కొత్త ఒరవడిని దిద్దిందని 1980 మార్చిలో కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ (ఎం) అగ్రనాయకుడు కామ్రేడ్ ఇ.యం.ఎస్. నంబూద్రిపాద్ అన్నారు. అంబేద్కర్, అయ్యంకాళి ల పాత్రను ఎవరూ దాచిపెట్టలేరు. ప్రజల స్మృతి నుంచి అయ్యంకాళి కొన్నాళ్ళు మాత్రమే అదృశ్యమయ్యారు. సమాజానికి ఆయన చేసిన సేవలు అంచనా కట్టడానికి 40 సంవత్సరాలు పట్టిందని అన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి ఇకె నయనార్ మాట్లాడుతూ భారతదేశంలో అయ్యం కాళి మొట్టమొదటి కూలీల నాయకుడు, అసంఘటితంగా, చిన్న చిన్న సమూహంగా వున్న కూలీలందర్నీ ఆయన ఒక తాటిపైకి తెచ్చి వారికి సంఘటిత శక్తి ఏంటో తెలియజెప్పారు, అని అన్నారు. అయ్యంకాళి పేరుతో ఏర్పడిన ట్రస్టు ఆయన నిలువెత్తు విగ్రహంతో మద్రాసు నుంచి కేరళ అంతా విజయోత్సవ ఊరేగింపు జరిగింది. ఈ విగ్రహం కేరళ అంతటా ఊరేగించినపుడు కేరళ ప్రజలు రోడ్డుపక్కన బారులు తీరి సందర్శించారు.

అయ్యంకాళి అస్పృశ్యుల విముక్తి పోరాటాలు నడిపిన ప్రథమ నాయకుడు. భారతదేశపు ఆత్మలో అంటరానితనం ఒక మాయని మచ్చ. ఇప్పటివరకు భారతదేశాన్ని ఈ అంటరానితనమే వెనకబాటుకు గురి చేసింది. స్వేచ్ఛ, సమానత్వం విడదీయరానిది. సమానత్వం లేకుండా అసలైన స్వేచ్ఛ లేనే లేదు. పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప అనే చైతన్యంతో వివక్షతకు వ్యతిరేకంగా పోరాడటమే అయ్యంకాళికి మనమిచ్చే నిజమైన నివాళి.

*

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 8 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# ప్రపంచ ఇన్నొవేషన్ సూచీలో 38వ స్థానంలో భారత్

ప్రపంచ ఇన్నొవేషన్ (నూతనావిష్కరణల) సూచీలో ప్రపంచంలోని 139 దేశాలకు గాను భారత దేశం 38 స్థానంలో ఉందని ప్రపంచ మేథో సంపద సంస్థ (డబ్ల్యుఐపిఓ) తెలిపింది. ఇన్నొవేషన్ ఇన్‌పుట్స్ అంటే ప్రాథమిక సదుపాయాలు, మానవ వనరులు, ఇన్నొవేషన్ ఔట్‌పుట్స్ అంటే విజ్ఞానం, టెక్నాలజీ ఆధారంగా ఇన్నొవేషన్ సూచీని తయారు చేస్తారు. కార్నెగీ విశ్వవిద్యాలయంలో కలిసి డబ్ల్యుఐపిఓ తయారు చేసిన ఈ సూచీలో మొత్తం 136 దేశాలకు గాను తొలి స్థానంలో స్విట్జర్లాండ్ నిలిచింది. రెండు మూడు స్థానాలను స్వీడన్, అమెరికాలు ఆక్రమించాయి. ఈ జాబితాలో చైనా తొలిసారిగా 10 స్థానాన్ని ఆక్రమించింది. అయిదేళ్ల క్రితం 12వ స్థానం నుండి అది 10 స్థానానికి ఎగబాకగా, 2021లో మూడో స్థానంలో ఉన్న బ్రిటన్ అయిదో స్థానానికి పడిపోయింది.

భారత్, టర్కీ, వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనీషియా, ఇరాన్ వంటి దేశాలు రెండేళ్ల కాలంలో ఇన్నొవేషన్ ఇండెక్స్‌లో శీఘ్రంగా పైకి వచ్చాయని డబ్ల్యుఐపిఓ తెలిపింది. భారత దేశం 2023లో 66వ స్థానం నుండి (28 స్థానాలు ఎదిగి) 38వ స్థానానికి చేరుకోగా వియత్నాం 76వ స్థానం నుండి 44వ స్థానానికి (32 స్థానాలు) ఎదిగింది. ఈ కాలంలో టర్కీ (68 నుండి) 43, ఫిలిప్పీన్స్ (90 నుండి) 50, ఇండోనీషియా (85 నుండి) 55, ఇరాన్ (113 నుండి) 70 స్థానాలకు ఎదిగాయి.

ఇన్నొవేషన్ సూచీలోని మొదటి 15 స్థానాల్లో గత దేశాల్లో దక్షిణ కొరియా గత అయిదేళ్లలో తీవ్ర ఎగుడుదిగుడులకు గురైంది. 2021లో 5వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా 2023కి 10 స్థానానానికి పడిపోయి మళ్లీ రెండేళ్లలో 4వ స్థానానికి ఎదిగింది. ఈ జాబితాలో ఫ్రాన్స్ రెండు స్థానాలు, జర్మనీ ఒక్క స్థానం దిగజారాయి. మొత్తం మీద తొలి 15 దేశాల జాబితాలో ఐరోపా దేశాలు అధిక స్థానాలు ఆక్రమించినప్పటికీ వాటి దిగజారుడూ, ఆసియా దేశాల ఉన్నతి స్పష్టంగా కనిపిస్తోంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు......................................................

వీధి.......................................................................

గ్రామం.................................................................

మండలం లేదా పట్టణం........................................

జిల్లా.......................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.